

నిష్పక్షపాతం.. సత్యనిష్ఠ..
అంకితభావం..
ప్రజల మేలు కోసం చూపే తెగువ
పత్రికలకు అవశ్యం.

ఆంధ్రపత్రిక

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914

విజయవాడ సంపుటి : 60 సంచిక : 47 • పేజీలు : 8 • ఆదివారం 17 నవంబరు 2024 • వెల : రూ. 5.00

Published from : Vijayawada | Visakhapatnam | Srikakulam | Rajahmundry | Kurnool | Guntur | Ongole | Nellore Tirupati

చేయని తప్పుకు శిక్ష అనుభవించా

- తల్లి, చెల్లిపై అసభ్య పోస్టులు పెట్టినా వదిలేస్తారా?
- వ్యక్తిత్వ హననానికి పాల్పడటం దారుణం
- వారి పార్టీ నాయకులే అసభ్యకర పోస్టులు పెడుతున్నారు
- సోషల్ మీడియా సైకోలను కట్టడి చేయాలి
- ప్రజల కోసం పనిచేస్తే అక్రమ కేసులా?
- 53 రోజుల జైలు జీవితం.. మరింత పట్టుదల పెంచింది
- ప్రజా సేవలను చివరి వ్యక్తి వరకు అందించాలన్నది మా లక్ష్యం
- ఈ యుగంలో సమాచారమే ఓ పెద్ద నిధి
- భాజపాకి వాజ్‌పేయీ పునాదులు వేస్తే.. నరేంద్రమోదీ బలోపేతం చేశారు
- నరేంద్ర మోదీ నేతృత్వంలోనే ముందుకు వెళ్తాం..
- హిందూస్థాన్ టైమ్స్ లీడర్ షిప్ సమ్మిట్‌లో సిఎం చంద్రబాబు



న్యూఢిల్లీ, నవంబర్ 16:సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిత్వ హననానికి పాల్పడటం దారుణమని ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీ అధ్యక్షుడి తల్లి, చెల్లిపైన వారి పార్టీ నాయకులే అసభ్యకర పోస్టులు పెడుతున్నారన్నారు. దిల్లీలో పర్యటించిన చంద్రబాబు.. హిందూస్థాన్ టైమ్స్ లీడర్ షిప్ సమ్మిట్‌లో పాల్గొన్నారు. ప్రజల కోసం పనిచేసి అక్రమ కేసులకు గురికావడం తనను బాధించిందన్నారు. అక్రమ కేసులు పెట్టి 53 రోజులు వేధించారు.. చేయని తప్పునకు శిక్ష అనుభవించానని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ఎక్కడా నిరాశకు గురికాలేదు, ధైర్యం కోల్పోలేదన్నారు. 53 రోజుల జైలు జీవితం.. మరింత పట్టుదల పెరిగేలా చేసిందని, ఆ పట్టుదలను ప్రజలకు సేవ చేయటానికి ఉపయోగిస్తున్నానని చంద్రబాబు చెప్పారు. "సోషల్ మీడియాలో విపరీత ధోరణులు కనిపిస్తున్నాయి. వ్యక్తిత్వ హననం జరుగుతోంది. మహిళలను కించపరిచే విధంగా పోస్టులు పెడుతున్నారు. మమ్మల్ని మాత్రమే కాదు.. సొంత తల్లి, చెల్లిని కూడా బూతులు తిట్టిస్తున్న వాళ్లని ఏం చేయాలి? ఇలాంటి వారిపై చర్యలు తీసుకోకూడదు అంటే ఎలా? సోషల్ మీడియాలో మహిళల్ని వేధించే వారిని ఎలా నియంత్రించాలనే అంశంపై తీవ్ర స్థాయిలో చర్చ జరగాలి. సామాజిక మాధ్యమాల్లో వేధించే సైకోలను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అగ్రభాగాన నంబర్ వన్‌గా ఉండాలనేది లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. టెలికాం రంగంలో డీరెగ్యులేషన్ వల్ల పురోగతి ఉంటుందని రిపోర్టు మిగతా 7లో

దేశం గర్వించేలా యువత

- బాజాపా ప్రభుత్వంలో అభివృద్ధికి ప్రాధాన్యత
- ఓటు బ్యాంకు రాజకీయాలకు దూరంగా బిజెపి
- ప్రజల కోసం, ప్రజలచే అభివృద్ధి మా నినాదం
- భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- హిందూస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో ప్రధాని మోడీ
- ఉగ్రవాదులు భారత్‌ను భయ పెట్టలేరు
- పాకిస్థాన్‌కు పరోక్షంగా సవాల్ విసిరిన ప్రధాని

న్యూఢిల్లీ, నవంబర్ 16: ప్రధాని నరేంద్ర మోడీ పాకిస్థాన్‌కు పరోక్షంగా సవాల్ విసిరారు. ఉగ్రవాదులు తమ ఇళ్లలో కూడా సురక్షితంగా ఉండలేకపోతున్నారన్నారు. భయం భయంగా జీవించాల్సిన పరిస్థితి ఏర్పడిందని మోడీ అన్నారు. శనివారం హిందూస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో ప్రధాని ఉగ్రవాదం, అభివృద్ధి, ప్రభుత్వ విధానాలపై మిగతా 7లో

మరింత పెరిగిన కశ్మీర్ అందాలు

శ్రీనగర్, నవంబర్ 16: జమ్ముకశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో మంచు కురుస్తున్నది. కుప్వారా జిల్లాలోని మాచిల్ సెక్టార్‌లో, బందిపొరా జిల్లాలోని అప్పర్ రీచెస్‌లో, గురెజ్, తులైల్, కంజల్వాన్‌లలోని సరిహద్దు ఏరియాల్లో భారీగా మంచు కురుస్తున్నది. దాంతో కశ్మీర్ అందాలు మరింత రెట్టింపయ్యాయి. లోయలు, కొండల పైన తెల్లటి మంచు కురుస్తున్నది. చల్లని మంచు తెంపరులు కురుస్తూ పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. బందిపొరా జిల్లాలోని పలు ప్రాంతాల్లో తెల్లటి మంచు దుప్పటి కప్పుకోవడంతో కశ్మీర్ అందాలు రెట్టింపయ్యాయి.

బ్రెజిల్ పర్యటనకు ప్రధాని నరేంద్రమోడీ

జీ -20 సమ్మిట్‌లో పాల్గొనేందుకు పర్యటన

న్యూఢిల్లీ, నవంబర్ 16: ప్రధాని నరేంద్రమోడీ బ్రెజిల్‌లో జరిగే జీ-20 సమ్మిట్ కోసం బయలుదేరారు. బ్రెజిల్ సహా గయానా, నైజీరియా దేశాల్లో పర్యటించనున్నారు. గతేడాది జీ-20 సమావేశానికి భారత్ ఆతిథ్యం ఇచ్చింది. 17 ఏళ్ల తర్వాత భారత ప్రధాని నైజీరియాలోలో పర్యటించబోతున్నారు. 5 దశాబ్ధాల తర్వాత ఒక భారత ప్రధాని గయానకు వెళ్లడం ఇదే మొదటిసారి. ప్రధాని తన 5 రోజుల పర్యటనలో మొదటి రెండు రోజులు (నవంబర్ 16-17) నైజీరియాలో గడపనున్నారు. "నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబు ఆహ్వానం మేరకు, పశ్చిమ ఆఫ్రికా ప్రాంతంలో మా సన్నిహిత భాగస్వామి అయిన నైజీరియాకు ఇది నా మొదటి పర్యటన. మా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి మిగతా 7లో

అర్ష్ దల్లా కేసులో విచారణ జరుగుతోంది

అర్ష్ దల్లా అరెస్టుపై భారత అధికారులతో చర్చిస్తున్నాం
కెనడా విదేశాంగ మంత్రి మెలానీ జోలీ వెల్లడి

న్యూఢిల్లీ, నవంబర్ 16: భారత ప్రభుత్వం ఉగ్రవాదిగా ప్రకటించిన ఖలిస్థానీ వేర్పాటువాది అర్షదీప్ సింగ్ అలియాస్ అర్ష్ దల్లాను కెనడా పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అతడిని తమకు అప్పగించాలని ఇటీవల కెనడాను భారత్ కోరింది. ఈ విషయంపై కెనడా విదేశాంగ శాఖ మంత్రి మెలానీ జోలీ స్పందిస్తూ అతడిని అప్పగించే విషయంపై భారత విదేశాంగ మంత్రి జై శంకర్‌తో చర్చిస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం పెరూలోని లిమాలో జరిగిన ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకార వార్షిక మంత్రివర్గ సమావేశంలో మెలానీ జోలీ మాట్లాడుతూ ప్రస్తుతం అర్ష్ దల్లా కేసులో విచారణ జరుగుతోందని..కాబట్టి ఆ విషయంపై ఎటువంటి మిగతా 7లో

వాడివేడిగా ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

జీరో అవర్‌పై గళం విప్పిన కూన రవికుమార్

జీరో అవర్.. డ్రైవర్ లేని కారులా ఉందని వ్యాఖ్య..

స్పీకర్ స్పందిస్తూ.. మంత్రులు నోట్ చేసుకుంటున్నారని వెల్లడి

దీనిపై స్పందించిన వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి, నవంబరు 16 (ఆంధ్రపత్రిక): ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు వాడివేడిగా సాగుతు న్నాయి. ప్రతిపక్షం అంటూ లేకపోయినప్పటికీ అధికార తెలుగు దేశం-జనసేన-భారతీయ జనతా పార్టీ సభ్యులే ఆ పాత్రను పోషిస్తోన్నారు. కూటమి ప్రభుత్వంలోని లోపాలు, నియోజకవర్గాల స్థాయిలో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి మిగతా 7లో

శంషాబాద్‌లో విమానానికి బాంబు బెదిరింపు

విమానంలో బాంబు ఉందంటూ ఓ అజ్ఞాత వ్యక్తి ఫోన్‌కాల్‌తో కలకలం..

బాంబు బెదిరింపుతో విమానాన్ని ఎమర్జెన్సీ ల్యాండ్.. 7

దారుణం

పది మంది శిశువులు సజీవదహనం

- మెడికల్ కళాశాలలో మంటలు
- భయబ్రాంతులకు గురైన రోగులు, ఆసుపత్రి సిబ్బంది
- శుక్రవారం రాత్రి 11.30 గంటల సమయంలో జరిగిన ఘటన..
- సీఎం యోగి ఆదిత్యనాథ్ విచారం వ్యక్తం

ఉత్తరప్రదేశ్,నవంబరు 16:ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఝాన్సీలోని మెడికల్ కాలేజీ చైల్డ్‌వార్డ్‌లో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో 10 మంది చిన్నారులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో మరో16 మంది చిన్నారులు తీవ్రంగా మిగతా 7లో

రామోజీరావు బాటలు నేటికీ ఆదర్శం

విలువలతో కూడిన జర్నలిజానికి రామోజీరావు నిదర్శనం

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు 7

జేపీ నడ్డా, ఖర్గేలకు ఈసీ నోటీసులు

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో..

పరస్పర ఆరోపణలు దృష్ట్యా నోటీసులు

ఖర్గే, నడ్డాకు కేంద్ర ఎన్నికల సంఘం నోటీసులు

ఖర్గే, నడ్డా వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలన్న ఈసీ

రేపు మధ్యాహ్నంలోగా వివరణ ఇవ్వాలని ఆదేశం 7

పది దాటినా చీకటి.. చీకటి

ఢిల్లీలో తీవ్రమవుతున్న కాలుష్యం

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఢిల్లీ సర్కారు ఎన్ని ప్రయత్నాలు చేసినా కనిపించని ఫలితం 7

గాలి వార్తలకు చెక్ పెట్టాలి

తిరుమలలో రాజకీయాలు బ్యాన్ చేస్తాం

రాజకీయాలు మాట్లాడినా,, టెలికాస్ట్ చేసినా కేసులు పెట్టిస్తాం

తిరుమల పవిత్రను కాపాడడమే తమ ఉద్దేశ్యం

టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడి 7

నారా వారి ఇంట విషాదం 7



ఒరులేయని యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

గురువాగ్గేయకారుడు

ఎందరో మహానుభావులు వాగ్గేయకారులుగా భక్తిసాగరంలో పుడమిని పులకింపజేశారు. వారిలో శ్రీ నారాయణతీర్థుడి స్థానం విశేషమైంది. యక్షగాన సంప్రదాయానికి, భజన సంప్రదాయానికి మనదైన కూచిపూడి నృత్యానికి పూనికగా,భూమికగా నిలిచినవాడు నారాయణతీర్థుడు. సిద్ధేంద్రయోగి వంటివారికి పథనిర్దేశం చేసిన గురువర్యుడు. త్యాగయ్య గురువు శొంఠి వెంకటరమణయ్య తండ్రి వెంకటసుబ్బయ్య కూడా నారాయణతీర్థుడిని గురువుగా తన గుండెలో నిలుపుకున్నారు. 'శ్రీకృష్ణతత్త్వం' తెలియాలంటే లీలాశుకుని,జయదేవుని, నారాయణతీర్థుని కృతులను ఆలకిస్తే,సర్వం బోధపడుతుందని మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య వంటివారు పలుమార్లు చెప్పారు. ఈ ముగ్గురు మహనీయులలో నారాయణతీర్థుడు మన తెలుగువాడు.ఎందరో వాగ్గేయకారులకు, నాట్యాచారులకు పరమగురువుగా ప్రబోధం చేసినవాడు. నారాయణతీర్థుడు అనగానే గుర్తుకు వచ్చేది 'తరంగాలు'. కృష్ణం కలయ సఖి సుందరం, బాల గోపాలకృష్ణ పాహి పాహి.. వంటివి నృత్య ప్రదర్శనలలో తరచూ మనకు వినిపించే గీతాలు. శరణం భవ కరుణాం మయి, ఆలోకయే శ్రీ బాలకృష్ణం,గోవర్ధన గిరిధర...మొదలైన కీర్తనలు యావత్తు దక్షిణభారతంలోనే బహుళ ప్రచారంలో ఉన్నాయి. తరంగాలలో ఉండే రుచే వేరు, ఆ మత్తు,గమ్మత్తు వేరు. అనుభవించినవారికి అర్థమవుతుంది. ఆ దివ్య గానామృతంలో మునిగితే బయటకు రావడం అసాధ్యం. దరువులు,జతులతో సాగే ఈ గాన సంప్రదాయం పరమ విలక్షణమైంది. ఇది పూర్తిగా మనదైన విద్య, మనదైన కళ, మనదైన సంప్రదాయం. బాలగోపాల మా ముద్ధర.... తరంగాన్ని రాత్రంతా పాడుతూ,ఆడుతూ తాదాత్మ్యం చెందుతూ వేడుక చేసుకొనే సంప్రదాయం నిన్నమొన్నటి వరకూ ప్రకాశం జిల్లా అద్దంకి సీమలో ఉండేది.రామాయణంవారు, బొమ్మరాజువారు, ఘోరకవివారు తరంగగానంలో ప్రసిద్ధులు. ఘంటసాల వెంకటేశ్వరరావు మొట్టమొదటగా విన్నది, నేర్చుకున్నది తరంగాలనే. మేనమామ ర్యాలి పిచ్చయ్య తరంగగానంలో ప్రముఖులు. ఘంటసాల తండ్రి కూడా తరంగాలు అద్భుతంగా పాడేవారు. సుప్రసిద్ధ నాటి భానుమతి కుటుంబానిది కూడా అదే సంప్రదాయం. శరణం భవ కరుణాం మయి వంటి తరంగాలను ఆమె సినిమాల్లో స్వయంగా పాడారు కూడా. ఇప్పటికీ అద్దంకి, ఒంగోలు ప్రాంతంలో తరంగగానం చేసేవారు ఎందరో ఉన్నారు. నారాయణతీర్థుడుజి సింగరకొండ నృసింహస్వామి సన్నిధిలో గడిపినప్పుడు ఆ ప్రాంతానికి చెందిన అరవై గ్రామాలవారు స్వయంగా ఆయన నుంచే తరంగాలు నేర్చుకున్నారు. అట్లే,కృష్ణా జిల్లా దివిసీమలోని శ్రీకాకుళం,కూచిపూడి ప్రాంతాలలోనూ తరంగగాయకులు ఉన్నారు. అక్షరాస్యులు, నిరక్షరాస్యులు సైతం వడలు మరచి నృత్యం చేస్తూ,భక్త్యావేశంతో పాడే ఈ సంప్రదాయం తమిళ, కన్నడిగులను కూడా విశేషంగా ఆకర్షించింది.ముఖ్యంగా నెల్లూరు, ప్రకాశం,గుంటూరు,కృష్ణాతీరంలో తరంగసంప్రదాయం వందల ఏళ్ళు విలసిల్లింది. ఇప్పటికీ,ఒంగోలుకు చెందిన ఘోరకవి సంపత్ కుమార్ వంటివారు ఈ సంప్రదాయానికి దివిటీ పడుతూ మన మధ్యనే ఉన్నారు. తరంగాలను 'శ్రీకృష్ణ లీలా తరంగిణి' పేరుతో నారాయణతీర్థుడు రచించారు. భాగవతంలోని దశమ స్కంధం నుంచి కథలను,విశేషాలను తీసుకొని కీర్తనలుగా మలచారు. రుక్మిణీ కల్యాణంతో ఈ మహారచన సంపూర్ణమవుతుంది.ఈ కృతులలో శ్రీకృష్ణుడి లీలలు పరమ సమ్మోహనంగా ఆకృతిదాల్చాయి. మొత్తం 12 భాగాల్లో 152 కీర్తనలు ఉంటాయి.కొన్ని ప్రక్షిప్తాలను కూడా కలుపుకుంటే ఈ సంఖ్య పెరుగుతుంది.ప్రతి కీర్తనకు ముందు శ్లోకం ఉండడంఇందులో ప్రత్యేకత. మధ్య మధ్యలో గద్యాలు,దరువులు,జతులు ఉంటాయి. ఇంతటి విశేష రచన దేశంలో ఎక్కడా కనిపించదు. కీర్తనలన్నీ సంస్కృతంలో రాసినా,తెలుగు వింటున్నంత తేటగా ఉంటాయి. సంగీతం,సాహిత్యం,నృత్యాత్మకం ముప్పేటలుగా ముడివేసుకొని సాగే ఈ కీర్తనలు రస, భావ, భక్తిబంధురాలు. ఇటువంటి మహాసృష్టి చేసిన నారాయణతీర్థుడి స్వగ్రామం గుంటూరు జిల్లా మంగళగిరి దగ్గర కాజా. వీరి పూర్వనామం తల్లావజ్జల గోవిందశాస్త్రి. ఒక సందర్భంలో, వేదాద్రిలోని కృష్ణానదిలో మనఃసన్యాసం తీసుకొన్నారు. ఆ తర్వాత వారణాసికి పయనమయ్యారు. అక్కడ యతీంద్రుడిగా దీక్ష ధరించారు.ఒరిస్సా మొదలు దక్షిణాది రాష్ట్రాలన్నీ సంచరించారు. ఎక్కడెక్కడో తపస్సు చేశారు. నిత్యం గానం,ధ్యానంలో తరించారు. సద్గురు శివనారాయణతీర్థుడుగా ప్రసిద్ధికెక్కారు. ఆంధ్రదేశంలోని కృష్ణాతీరంలో పుట్టి, తమిళనాడులోని కావేరీ నదీ పరీవాహక ప్రాంతంలోని తిరుపుందుర్తిలో యోగ మార్గంలో సజీవ సమాధి అయ్యారు. తెలుగు తిథుల ప్రకారం ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి వీరి జననం.మాఘ శుద్ధ అష్టమి వీరు జీవసమాధియైన రోజు. వీరు క్రీ.శ 1600-1700 సంవత్సరాల మధ్య జీవించినట్లుగా తెలుస్తోంది.పుణ్య దినాల్లో జన్మస్థలమైన కాజా లోనూ, తుది పయనం చేసిన తిరుపుందుర్తిలోనూ ప్రతిఏటా పెద్దఎత్తున ఉత్సవాలు జరుగుతాయి.ఈ రెండు ప్రదేశాలలోనే కాక,యావత్తు దక్షిణాదిలో సంగీత ప్రియులు, భక్తులు శ్రీనారాయణతీర్థుడిని స్మరిస్తూ తరంగ గానం చేస్తూ నీరాజనాలు పలుకుతారు. 'తరంగ కాలక్షేపం' గొప్ప ఆచారంగా తెలుగునాట ప్రసిద్ధి. ఎందరినో తరింప జేసి, ఎందరో శిష్యప్రశిష్యులను సంపదగా పొందిన నారాయణతీర్థుడు పరమ పుణ్యుడు,ధన్యుడు. తరంగాలతో పాటు పారిజాతాపహరణం (తెలుగు యక్షగానం), శాండిల్య భక్తిసూత్ర వ్యాఖ్య, భాట్ట భాషాప్రకాశం వంటి ఎన్నో విశిష్ట రచనలు చేశారు. కొన్ని ముద్రితములుగా, కొన్ని అముద్రితములుగా కాశీ విశ్వవిద్యాలయంలో ఉన్నట్లు చెబుతారు.నారాయణతీర్థుడు తీర్చిదిద్దిన సంప్రదాయాన్ని నిలబెట్టడమే మనం ఆ మహావాగ్గేయకారునికి ఇచ్చే నిజమైన నివాళి. ఈ సంప్రదాయాన్ని నిలబెట్టాలంటే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలి.తరంగాలు మిగిలిన వాగ్గేయకార కీర్తనల వంటివి కావు. తగుమాత్రం రాగంతో, భావానికి ప్రాధాన్యతనిస్తూ, పూర్తి భక్తిభావంతో, లయ ప్రధానంగా, భజన/యక్షగాన సంప్రదాయంలో సాధన చేయాలి.పాడుతూ నాట్యం చేస్తూ,నాట్యం చేస్తూ పాడే గొప్ప విన్యాసం ఈ సంప్రదాయంలోఉంటుంది. మంచి మృదంగ వాద్య సహకారం అవసరం. ఘోరకవి సంపత్ కుమార్ వంటివారితో తెలుగునేల నలుచెరుగులా ఔత్సాహికులకు శిక్షణ ఇప్పించడం ద్వారా ఈ సంప్రదాయాన్ని నిలుబెట్టుకోవచ్చు. శ్రీ నారాయణ తీర్థునిపై జయదేవుని ప్రభావం ఉన్నదని పెద్దలు చెబుతారు.కీర్తనా రచనలో తాళ వైవిధ్యం ప్రత్యేక ఆకర్షణ. పల్లవి,చరణాలు వివిధ తాళాలలో పాడుతూ ఉంటే? పాడేవారే కాక, వినేవారు కూడా మైమరచి నాట్యం చేసేలా అంతటి ఆకర్షణ లఉంటుంది.దరువులు,జతులు సమ్మోహనం చేస్తాయి. ప్రసిద్ధమైన రాగాలే కాక, కర్ణాటక సారంగ,మంగళకాపి వంటి 'అపూర్వ',అపురూప రాగాలను కూడా నారాయణతీర్థుడు లోకానికి పునఃపరిచయం చేశారని పండితులు చెబుతారు. హిందుస్థానీ రాగమైన ద్విజావంతి వంటి రాగాలను కర్ణాటక సంగీతంలోకి తెచ్చిన వారిలో తీర్థులవారిని మొదటివారుగానూ కొందరు చెప్పుకొస్తారు. కర్ణాటక సంగీతానికిబహుళ ప్రాచుర్యం తెచ్చిన తొలితరం వాగ్గేయకారులలో నారాయణ తీర్థుడి స్థానం విలక్షణమైంది. గీతం-వాద్యం-నృత్యం మూడింటిని సమప్రతిభతో వెలయించిన పరమోత్తమ వాగ్గేయకారుడు. 'పరమ భాగవతోత్తముడు' శ్రీ నారాయణతీర్థుడు పదహారణాల తెలుగువాడు.

జీవితం మనిషికి దేవుడిచ్చిన వరం

మనిషికి విచక్షణవివేచన విజ్ఞానం దేవుడిచ్చిన వరంనిన్న కలిగిన బాధను తలుచుకుంటూ కృంగిపోకుండా నేడు కనిపిస్తున్న వాస్తవాన్ని గమనిస్తూ రేపటి ఆనందం కోసం దారులు వెతకాలి డబ్బు పరపతి అధికారం అద్దె ఇల్లు ఖరీదైన కారు ఆభరణాలు ఆడంబరాలు ఎప్పటికీ మనతో ఉండవు మంచితనం చిరునవ్వుప్రేమజిసొంత ఇల్లుఆత్మీయత అభిమానం ఎప్పుడూ మనతోనే ఉంటాయిఏ క్షణం నుంచి మన మనసు ఎదుటివారి మంచిని కోరుకుంటుందో ఆ క్షణం నుండి మన మనసుకు సంతోషం ప్రారంభం అవుతుంది. మనుషులను ప్రేమించాలి. వస్తువులను వాడుకోవాలి. కాని అహం అజ్ఞానంతో మనుషులను వాడుకుంటున్నాం వస్తువులను ప్రేమిస్తున్నాం కఠిన సవాళ్ళను ఛేధించాలన్నా గొప్ప విజయాలు సాధించాలన్నా ముందుగా మీ అంతరంగం పై పైచేయి సాధించాలి.

మీ మీద మీకు నమ్మకం ఉండాలి మీరు చేసే పనిలో విఫలమైనప్పుడో ఇష్టమైన వ్యక్తి ధూరమైనప్పుడో జీవితం ముగిసిపోదు ఎదురు దెబ్బలను పెద్దవిగా ఊహించుకోకండి పట్టుదలతో ముద్దుకెళ్ళినపుడే జీవితములో ఉన్నత శిఖరాలు చేరుకోగలరు సమాజానికి స్ఫూర్తి ధాతలుగా నిలువగలరు. - నేదునూరి కనకయ్య

సమాజ సేవలో తరించిన పద్మజా నాయుడు

నవంబర్ 17.. పద్మజా నాయుడు జయంతి

పద్మజా నాయుడు (నవంబర్ 17, 1900-మే 2, 1975) స్వాతంత్ర్య సమర యోధురాలు, కవయిత్రి, సుదీర్ఘ కాలం పాటు గవర్నర్‌గా పని చేసిన మహిళ. ఆమె హైదరాబాద్‌లో జరిగిన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సంయుక్త వ్యవ స్థాపకురాలు. పురుషుల ఆధిపత్య ప్రజా రంగంలో, సామాజిక సేవ కురాలిగా, రాజకీయ నాయకు రాలిగా, పాలకురాలిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. పద్మజా నాయుడు 1900 నవంబర్ 17న హైదరాబాద్‌లో జన్మించారు. ఆమె (బెంగాలీ) తల్లి ప్రఖ్యాత కవి, భారత స్వాతంత్ర్య సమర యోధుడు సరోజిని నాయుడు. ఆమె (తెలుగు) తండ్రి ముత్యల గోవింద్రజులు నాయుడు వైద్యుడు. ఆమెకు జైసూర్య, లీలమణి, ఆదిత్య, రణధీర అనే నలుగురు తోబుట్టువులు. పద్మజా నాయుడు పెద్దగా చదువు కోలేదు. చిన్ననాడు చేరిన మహ బూబియా బాలికల ఉన్నత పాఠశాలలో నాలుగేళ్ళు మాత్రమే చదివారు. బాల్యంలో తరుచుగా అనారోగ్యానికి గురికావడంతో ఆమె చదువు సరిగా సాగలేక పోయింది. ఆమె నేర్చుకున్న విద్య, సంస్కారం అంతా తన తల్లి వివాసమైన గోల్డెన్ థ్రెషోల్డ్‌కు వచ్చి పోయే వారి మధ్యే సాగిపోయింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ వర్క్స్ శాఖను ఏర్పాటు చేసి ఆమె పలు సామాజిక సేవా కార్యక్రమా లను చేపట్టారు. ప్రజారోగ్య పరిరక్షణకై ఆమె ఎంతో మంది ముస్లిం స్త్రీలను సభ్యులుగా చేర్చుకొని ప్లేగు రిలీఫ్ కమిటీని ఏర్పాటు చేశారు. పౌరుల స్వేచ్ఛ కొరకు, జాగిర్ధారీ వ్యవస్థకు వ్యతిరేకంగా స్థాపించ బడిన స్వదేశీ లీగ్ అనే సంస్థకు అధ్యక్షురాలిగా పనిచేశారు. ఆ సంస్థ ఆధ్వర్యం లోనే, ఆమె తన సంపాదకత్వంలో వన్ వరల్డ్ అనే పత్రికను నడిపారు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో సామ్యవాద సిద్ధాంతానికి ప్రభావితులైన కొందరు ఉస్మానియా విద్యార్థులు కామ్రేడ్స్ అసోసియేషన్ స్థాపించగా, సంస్థకు పద్మజా నాయుడు సహకారాన్ని

అందించారు. 1935లో ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం ఏర్పడి నప్పుడు, రైతుల దుర్భర పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకు రావడానికి ఏర్పడిన హైదరాబాద్ సహాయక సంఘానికి ఆమె అధ్యక్షురాలుగా వ్యవహ రించారు. అనేక ప్రాంతాలు పర్యటించి, భాధితులకు తక్షణ సహాయం అందేలా ఏర్పాట్లు చేశారు. 1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళారు. అప్పటికి మహిళలకు ప్రత్యేకమైన జైళ్ళు లేకపోవడం, పలుకుబడి కలిగిన కుటుంబానికి చెందిన వారు కావడం మూలాన ఆమెను హయత్ నగర్ లోని బేగం గారి దేవిడిలో సకల సౌకర్యాలు కలిగిన రాజభవనంలో నిర్బంధించారు. దానికి ఆమె సంతోషించక తనతో పాటు అరెస్ట్ అయిన తక్కిన మహిళలకు ఎందుకు ఆ వసతులు కల్పించ లేదని ప్రశ్నించారు. చైనా యుద్ధ సమయంలో ఆమె తనకున్న విలువైన బంగారు ఆభరణాలను నేషనల్ డిఫెన్స్ ఫౌండేషన్ కు సమర్పించారు. భారతదేశం నుండి " క్రమబద్ధమైన బ్రిటీష్ ఉప సంహరణ" కోరుతూ మహాత్మా గాంధీ ప్రారంభించిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నం దుకు ఆమె 1942 లో జైలు పాలైనారు. ఖాదీ గురించి గాంధీ సందేశాన్ని విస్తృతంగా వ్యాప్తి చేసేందుకు, విదేశీ వస్తువులను బహిష్కరించడానికి కృషి సల్పారు. 1950లో పద్మజా నాయుడు భారత రాజ్యాంగ సభకు ఎన్నికై రెండేళ్ళు ఆ పదవిలో కొనసాగారు. ఆ తరువాత ఆమె 1956 నుండి 1967 వరకు పశ్చిమ బెంగాల్ గవర్నరుగా పని చేశారు. స్వాతంత్ర్యోద్యమంలో చురుకుగా తల్లితో పాటు పనిచేసిన పద్మజ, 21 యేళ్ల వయసులోనే హైదరా బాదులో భారత జాతీయ కాంగ్రెస్ సహ వ్యవస్థాపకురాలు అయ్యారు. స్వాతంత్ర్యానంతరం పద్మజా నాయుడు పార్లమెంటుకు ఎన్నికైనారు. కానీ అనారోగ్యం వల్ల రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆ తరువాత పశ్చిమ బెంగాల్ గవర్నరుగా పని చేశారు. అర్ధ శతాబ్దానికి పైగా ఉన్న ఆమె ప్రజా జీవితంలో, స్వచ్ఛంద సేవలో ఔత్సాహికురాలై, ఆమె మానవ సంక్షేమ నిర్దేశిత, అంతర్జాతీయ మానవతా సంస్థ రెడ్‌క్రాస్ సొసైటీ తో సంబంధం కలిగి ఉండేది. బంగ్లాదేశ్ శరణార్థుల సహాయచర్య లప్పుడు భారత రెడ్ క్రాస్ సంస్థ ఛైర్ పర్సన్ గాను పని చేసి, ప్రముఖ పాత్ర పోషించారు. పద్మజా నాయుడుకు భారత్ సేవక్ సమాజ్, అఖిల భారత హస్తకళల బోర్డు, నెహ్రూ స్మారక నిధి వంటి సంస్థలతో అనుబంధం ఉండేది. 1961లో పద్మజ తన కవితా సంకలనం "ది ఫెదర్ ఆఫ్ డాన్" పేరుతో ప్రచురించారు. 1975లో పద్మజా నాయుడు స్మృత్యర్థం డార్జిలింగులోని జంతు ప్రదర్శన శాలను పద్మజా నాయుడు హిమాలయ జంతు ప్రదర్శన శాలగా మార్చగా, నాటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ ప్రారంభోత్సవం చేశారు. పద్మజా నాయుడు తన తల్లి (సరోజిని నాయుడు) నివాసం ది గోల్డెన్ థ్రెషోల్డ్‌ను 1970 లలో హైదరాబాద్ విశ్వవిద్యా లయానికి (యుఒహెచ్) అప్పగించారు. భారతజాతికి అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆమెకు పద్మ విభూషణ్ పురస్కారం లభించింది. పద్మజా నాయుడు 1975 మే 2న పరమపదించారు.

- రామ కిష్టయ్య సంగన భట్ల

లక్ష్యాన్ని చేరాలంటే పట్టుదల అవసరం

"ఒక లక్ష్యాన్ని చేరాలంటే పట్టుదల, నిరంతర కృషి, ఆత్మదృఢ చిత్తం అవసరం.. ఎన్నో కష్టాలు ఎదురుకొని..తన లక్ష్యసాధనలో ఏమాత్రం అధైర్యపడక చివరికి ఈ ప్రపంచానికే వెలుగులు పంచిన ఒక స్త్రీ మూర్తి కథ..నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకం, మార్గదర్శకం ఈ స్త్రీ మూర్తి జీవితం! 1867 నవంబరు 7 పోలెండ్ రాజధానిలో ఒక ఉపాధ్యాయ కుటుంబంలో ఐదవ సంతానంగా పుట్టింది ఆ అమ్మాయి..చాలీ చాలని జీతాలప్పుడు..అదీగాక పోలెండు అప్పుడు రష్యా చేతిలో బానిసదేశం... కానీ ఆ పాపకు చదువంటే ప్రాణం.ఆమె ఐదవ యేటనే తల్లి,సోదరీ మరణించారు.అయినా చదువు మాత్రం మానలేదు..తను చదివిన స్కూల్‌లో ప్రథమస్థానం సాధించింది..ఇంతలో నాన బాధ్యత మరిచి త్రాగుడుకు బానిసై ఏటో వెళ్ళిపోయాడు...ఒక అక్క మెడిసిన్ చేస్తుంది...ఆర్థికసమస్యలు ప్రారంభమైనాయి. ధనవంతుల ఇండ్లలో పనికి చేరింది.. చిన్నపిల్లలకు ట్యూషన్ చెప్పసాగింది..వచ్చిన డబ్బును అతి జాగ్రత్తగా ఖర్చు చేసేది. ఆ డబ్బులోనే తన సోదరి చదువుకు పంపేది.తన చదువు కోసం కొంత దాసుకొనేది. చదవాలి సైన్సు సబ్జెక్ట్‌లో పరిశోధనలు చేయాలి. ఎలాగైనా చదువుకొనసాగించాలి. ఇదే ఆమె తపన.. తన 24 యేట కొంత డబ్బు దాసుకొని ఆస్ట్రియా లోని కాకో యూనివర్సిటిలో చేరాలని ప్రయత్నించగా స్త్రీలకు సైన్సులో ప్రవేశం లేదనే నిబంధనతో ఆమె కు సీటు నిరాకరించబ డింది. అయినా ధైర్యం కోల్పోలేదు..ఎలాగైనా ఫ్రాన్స్ వెళ్ళాలనుకుంది.. మొత్తానికి ఫ్రెంచ్ పౌరసత్వం పొంది, అతి కష్టం మీద ఫ్రాన్స్ లోని "సోబర్న్ యూనివర్సిటీలో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమెస్ట్రీలతో డిగ్రీలో నైట్ కాలేజ్ స్టూడెంట్‌గా చేరింది.డబ్బులు కోసం పగలు ల్యాబ్ లేటరీలో పరికరాలు అమర్చే సహాయకరాలుగా పని చేసింది. బయట భోదకురాలుగా పనిచేసేది..అప్పుడే పియర్ క్యూరీ అనే లెక్చరర్ తో పరిచయం అయిందామెకు. ఆయన

ఆమెలోని ప్రతిభను గుర్తించి తన ల్యాబ్‌లో పరిశోధనలకు అనుమతినిచ్చాడు. 1893లో మంచి మార్కులతో డిగ్రీ పూర్తి చేసింది. 1894 లో అదే కళాశాలలో పరిశోధన(డాక్టరేట్) కు హెన్రీ బెకరల్ దగ్గర చేరింది..ఆయన అప్పటికే రేడియోధార్మికతను కనుగొని దానిపై పరిశోధనలు చేస్తున్నాడు. ఇందులో ఈమె కూడా భాగస్వామ్యమైంది. ఫియరీక్యూరీ కూడా వీరితో కలిసాడు.1896 లో పియరీని వివాహం చేసుకున్నారు..1903 లో రేడియోధార్మికత పరిశోధలకై ఈ ముగ్గురికీ "నోబుల్ బహుమతి" వచ్చింది. 1906 లో పియరీక్యూరీ ఒక రోడ్ ప్రమాదంలో మరణించాడు..పిడుగులాంటి ఆ దుర్వార్త విని కుప్పకూలిందామె. అప్పటికే ఇద్దరు ఆడపిల్లలు..ఆమె కళాశాల ఆమెకు అండగా నిలిచింది. పియరీక్యూరీ జాబ్ ఆమెకు ఇచ్చింది. ఫిజిక్స్‌కు హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్‌గా నియమించింది. చరిత్రలో ఈ స్థానం దక్కిన తొలి మహిళ ఈమె. ఒక ప్రక్క జాబ్..పరిశోధనలు..మరొక ప్రక్క పిల్లల ఆలనా పాలనాలతో క్షణం తీరిక లేకుండా గడిపేది. యూరేనియం కంటే ఎక్కువ పవర్ ఫుల్ రేడియోధార్మికత కలిగిన ఫిచ్ బండ్ ను కనుగొనింది. తర్వాత కిరణాలపై పరిశోధన మొదలెట్టింది. 1911లో మళ్ళీ నోబుల్ బహుమతి పొందింది. ఇలా భౌతిక, రసాయన శాస్త్రాలలో నోబుల్ ప్రైజ్ పొందిన ఏకైక శాస్త్రవేత్త ఈమె..1914 లో మొదటి ప్రపంచయుద్ధంలో రేడియాలజిస్టుగా పనిచేసింది.. క్యాన్సర్ ను అదుపుచేసే రేడియోకణాలను కనుగొని ఎంతోమందికి ప్రాణదాతగా నిలిచింది.తల్లిగా తన కూతుర్లిద్దరినీ ప్రయోజకవంతులను చేసింది.పెద్దకూతురు శాస్త్రవేత్తగాకా, చిన్న కూతురు సోషల్ వర్కర్‌గా పేరు గడించింది. తన కనుగొనిన ఒక మూలకానికి తన మాతృదేశమైన పోలెండ్ పేరు మీద "పోలోనియం" అనే పేరు పెట్టింది...అయితే ఏ క్యాన్సర్‌నైతే జయించేందుకు కృషి చేసిందో ..ఆ క్యాన్సర్ కే 1934 లో బలైపోయింది.. ఈమె ఎవరో తెలుసా?? మారియా ఉరఫ్ మేరీ క్యూరీ..శాస్త్రపరిశోధనలో ఒక గొప్ప పరిశోధకరాలు. బానిసదేశంలో పుట్టి,కటిక దరిద్రం అనుభవించి, ఆయాగా పనిచేసి, ట్యూషన్స్ చెప్పి,తన లక్ష్యసాధనలో ఎన్నో అవాంత రాలను ఎదురుకొని చివరికి తన లక్ష్యాన్ని విజయవంతంగా అధిరోహించిన మహిళ. శాస్త్రవేత్తగానే కాదు ఒక తల్లిగా 100% విజయం సాధించిన ఆదర్శమహిళ!!

- సేనాధిపత్యం రమేష్

మనిషి జీవితానికి ముఖ్య ఘట్టం పెళ్లి

జీవితం సంతోషంగా సాగాలన్నా, నాశనమై పోవాలన్నా పెళ్లితోనే, జీవిత భాగస్వామితోనే సాధ్యం. అది ఆడైన, మగైనా......

మంచి భార్యగా ఉండాలంటే: తనకంటూ ఒక కుటుంబం ఏర్పడింది అని గుర్తించాలి. ఒక కొత్త వ్యక్తుల మధ్యకు వెళ్తున్నాం కాబట్టి.... మన విలువలను పెంచుకోవాలన్నా, తగ్గించుకోవాలన్నా అణుకువగా ఉండడం అలవాటు చేసుకోవాలి. తన తల్లిదండ్రులతో సమానంగా అత్తమామలను చూసే విధంగా ఉండాలి. నా వాళ్ళు నీ వాళ్ళు అనే భేదాలు లేకుండా ఉండాలి. కష్టసుఖాల్లో ఎక్కువ కాలం తన వెంట ఉండేది భర్త అని గుర్తించాలి. ప్రేమను పంచడంలో భర్తకు ప్రత్యేక స్థానం ఉండాలి. నా భర్త నా పిల్లలు అనే స్వార్థం ఉండాలి. కానీ ఎదుటి వారిపట్ల ఇర్షా భావం లేకుండా ఉండాలి. భర్తను ప్రేమించాలి ప్రేమించబడే విధంగా ప్రవర్తించాలి. ఇగోల కోసం జీవితాలు నాశనం చేసుకోకూడదు. **మంచి భర్తగా ఉండాలంటే.:::** భార్య అంటే బానిస కాదు. నిన్ను నమ్మి ఒక కొత్త వ్యక్తి నీ జీవితంలో అడుగుపెట్టింది అని గుర్తించాలి. ఆమె కష్టసుఖాల్లోనూ సమానంగా ఉండడానికి

ప్రయత్నించాలి. నేనే ఇంటి యజమానిని అనే మనస్తత్వం ఉండకూడదు. భార్య ఇష్టాలను గుర్తించి వాటిని తీర్చాల్సిన పూర్తి బాధ్యత నీదే.... నువ్వే సర్వస్వం అని నమ్మి నీతో జీవి తాంతం ఉండడానికి వచ్చింది. నేను మగాణ్ణి అనే అహంకారం ఉండకూడదు. భార్య అంటే భర్తతో సగభాగం. అంతే కానీ బానిస కాదు అని గుర్తించాలి. నీ జీవితంలో ఎక్కువకాలం నీతో ఉండే ఏకైక వ్యక్తి భార్య. నువ్వు తనుకు ఎంత ప్రేమను పంచితే. అంతకు రెండింతలు నిన్ను ప్రేమిస్తుంది. ముఖ్యంగా నీ వంశ వృద్ధి కి కారణం స్త్రీ అది గుర్తించాలి.తన పుట్టింటి వారిన ఒదరినీ ఒదిలి నీకోసం వచ్చిందని గుర్తించాలి. ఆమె తల్చుకుంటే.... నీ కుటుంబాన్ని అందలం ఎక్కించగలదు. పాతాళా నికి తొక్కగలదు. సర్దుకుపోయే మనస్తత్వాలు ఇరువురిలో ఉన్నప్పుడే... వారి కాపురం సంతోషంగా సాగిపోతూ...నలుగురిలో గౌరవం నిలబడుతుంది. లేదంటే....బజారున పడటం ఖాయం. **ముఖ్య విషయం:** ఒకరిపై ఒకరికి నమ్మకం ముఖ్యం. అలాగే ఎదుటివారు చెప్పే మాటల వలన కుటుంబాలే నాశనం అయిపోతున్నాయి. ఇది గుర్తించాలి.

కృష్ణుడు అంటే... ప్రేమతత్వం

కృష్ణుడి జీవితమే ఒక మానవ జీవన అనుభవసారం.. మూర్తీభవించిన వ్యక్తిత్వ వికాసం..శ్రీకృష్ణుని రూపం నల్లనిది.. మనసు మాత్రం వెన్న పూసలా తెల్లనిది.. దేనికీ భయపడని వ్యక్తిత్వంతో చేపట్టిన ప్రతీ పనిలోనూ విజయం సాధించాడు.. నమ్మిన వారికి కొండంత అండగా నిలిచాడు. అసలు కృష్ణుడంటేనే అలౌకిక ఆనందానికి ప్రతిరూపం.. సచ్చిదానంద రూపం.. సత్‌చిత్ ఆనంద స్వరూపం.. పాపాల్ని నాశనం చేసేదే కృష్ణ తత్వం.. కృష్ణుడి పేరు తలుచుకుంటేనే అమరత్వం సిద్ధిస్తుంది.. జవసత్వాలు ఉట్టి పడతాయి.. కృష్ణ నామం కర్ణపేయంగా ఉంటుంది. పురాణాలలోను, తాత్విక గ్రంథాల లోను, జనబాహుళ్యంలోని గాథలలోను, సాహిత్యంలోను, ఆచార పూజా సాంప్రదాయాలలోను కృష్ణుని అనేక విధాలుగా భావిస్తుంటారు, చిత్రీకరిస్తుంటారు. చిలిపి బాలునిగాను, పశువులకాపరిగాను, రాధా గోపికా మనోహరునిగాను, రుక్మిణీ సత్యభామాది అష్టమహిషుల ప్రభువుగా ను, గొపికల మనసు దొచుకున్న వాడిగాను, యాదవరాజుగాను, అర్జునుని సారథియైన పాండవ పక్షపాతిగాను, భగవద్గీతా ప్రబోధకునిగాను, తత్త్వోపదేశకునిగాను, దేవదేవునిగాను, చారిత్రిక రాజనీతిజ్ఞునిగాను ఇలా బహువి ధాలుగా శ్రీకృష్ణుని రూపం, వ్యక్తిత్వం, దైవత్వం చిత్రీకరింపబడినాయి. కాని ఆ శ్రీకృష్ణుని గురించి ఇంకా ఎన్నో విశేషాలు తెలుసుకోవలసినవి మిగిలిపోతూనే ఉంటాయి, ఉన్నాయి.వెన్న ముద్దల దొంగ...ఈ బాలకృష్ణుడు ఇంటింటా తన స్నేహితులతో వెన్న ముద్దలు దొంగిలిస్తూ వెన్న దొంగగా ముద్రవేసుకున్నాడు. అలా వెన్న ముద్దల దొంగతనంలో మానవులకు అందని దేవరహస్యం ఉందట. వెన్న జ్ఞానానికి సంకేతంగా చెపుతుంటారు మన పెద్దలు. తన భక్తుల మనసులోని అజ్ఞానమనే చీకటిని తొలగించి, జ్ఞానమనే వెలుగును నింపడం కోసమే కన్నయ్య వెన్న తినేవాడు.అంతా క్రిష్ణమయం... కృష్ణ తత్వం చదివిన వారికి నిజమైన ప్రేమ తత్వం తెలుస్తుంది. కాలానికి ప్రతీకగా శ్రీకృష్ణుడు నెమలి పింఛాన్ని ధరిస్తాడు...కన్నయ్య వేణువును విడిచిపెట్టి క్షణం కూడా ఉండలేడు. వేణువు, మాధవుల అనుబంధం ఎంత గొప్పదంటే చివరకు గోపికలు కూడా వేణువును చూసి అసూయపొందారు. కన్నయ్య తమ కన్నా వేణువునే ఎక్కువగా ఆదరిస్తున్నాడని అలిగారు. వాళ్ళందరు కలిసి వేణువుని అడిగితే ఇలా అందట... 'నన్ను నేను గోపయ్యకు అర్పించుకున్నాను. నాలో ఏమీ లేదు. అంతా డొల్ల' అంది. నిజమే! వేణువు అంతా శూన్యం. అంటే, పరిపూర్ణతకు చిహ్నం. మానవుడు అందుకోవాల్సిన మహత్తరమైన ఆధ్యాత్మిక సందేశాన్ని వేణువు అందిస్తుంది.

నేను, నాది అనే వాటికి మనిషి దూరం కావాలి. తాను తానుగా మిగలాలి. తన స్వచ్ఛమైన మనస్సును మాధవుడికి అర్పించాలి. అలాంటి మనసున్న మనుషుల్ని పరమాత్మ అక్కున చేర్చుకుంటాడు. వ్యాసమహర్షి శ్రీభాగవతంలో రుతువర్ణన చేస్తూ... 'కృష్ణమేఘం' అన్న మాట వాడారు. ఆ మేఘం వెంట వచ్చే మెరుపు కృష్ణయ్య చిరునవ్వేనట! మధురాధిపతే అఖిలం మధురం! కృష్ణుడు మధురకే కాదు, ప్రేమ మాధుర్యానికీ అధిపతి. మొత్తం మీద చెప్పాలంటే శ్రీకృష్ణుడు అంటే ఆనందతత్వం ప్రేమతత్వం స్నేహతత్వం ప్రకృతితత్వం నాయకత్వం నీవే తల్లివి దండ్రివి నీవే నా తోడు నీడ! నీవే సఖుడౌనీవే గురుడవు దైవమునీవే నా పతియు గతియు! నిజముగ కృష్ణా..

ఘనంగా ఆర్ఎస్‌యు 10వ జిల్లా మహాసభలు విజయవంతం

ఆర్ఎస్‌యు జాతీయ అధ్యక్షుడు వెన్నుతుర్ల రవిశంకర్ రెడ్డి

బద్వేలు నవంబర్16(ఆంధ్రపత్రిక): బద్వేలు పట్టణంలో రెవలూషనరీ విద్యార్థి సంఘం(ఆర్ ఎస్ యు) పదవ జిల్లా మహాసభలు బద్వేలు పట్టణంలో రెండు రోజులపాటు నిర్వహించడం జరిగింది. రెండవ రోజు ప్రతినిధుల సమావేశం బద్వేలు పట్టణంలోని ఏపీ ఎన్జీవో హెూంలో నిర్వహించారు.ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్ ఎస్ యు జాతీయ అధ్యక్షుడు వెలుతుర్ల రవిశంకర్ రెడ్డి. మోడల్ స్కూల్స్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి హాజరయ్యారు.ఈ సమావేశంకు జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆర్ ఎస్ యు జాతీయ అధ్యక్షులు వెనుతుర్ల రవిశంకర్ రెడ్డి . మాట్లాడుతూ ఎస్సీ. ఎస్టి. బిసి. మైనార్టీ హాస్టల్ లో లక్షల మంది హాస్టల్ విద్యార్థులు సమస్యలు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు గ్రహించి తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.అలాగే ఖాళీగా ఉన్న హెచ్ డబ్ల్యు ఓ. ఏ ఎస్ డబ్ల్యూ ఓ. ఏబిసిడబ్ల్యుఓ. ఉద్యోగాలను భర్తీ చేయాలని తెలియజేశారు.కస్తూర్బా గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీనికి ప్రధాన కారణం పర్యవేక్షణ లోపమే కాబట్టే రాష్ట్రవ్యాప్తంగా గురుకులాలు కస్తూర్బా పాఠశాలలో అనేక సంఘటనలు జరుగుతున్నాయి జరుగుతున్న సంఘటనలు దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అలాగే కస్తూర్బా మరియు గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని ఆయన అన్నారు.గత ప్రభుత్వంలో ఫీజుమెంట్ పెండింగ్లో ఉన్నది. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పెండింగ్ లో ఉన్న మొత్తం ఫీజుమెంట్ బకాయిలు యాజమాన్యం ఖాతాలో పడతాయని ఎంతో ఆశతో ఉన్నారు. ఈరోజు ఫీజుమెంట్ బకాయిలు రాకపోవడం వలన విద్యార్థులకు పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో ఒత్తిడి పెరుగుతావుంది. దీనివలన రాష్ట్రవ్యాప్తంగా లక్షల మంది విద్యార్థులు మానసికంగా ఇబ్బంది పడతూన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు ఈ విషయాన్ని గమనించి విద్యార్థుల సమస్యలు తక్షణమే పరీక్షించాలని పెండింగ్లో ఉన్న ఫీజు ఫీజుమెంట్ విడుదల చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షలు సమయం దగ్గరపడుతుంది. కావున విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన అన్నారు.జీవితంలో తొందరగా స్థిరపరాలంటే ఇంటర్మీడియట్ అయిపోతూనే టెక్నికల్ కోర్సులు జేరి ఎక్కువ శాతం టెక్నికల్ రంగంలో యువత ఎదగాలని ఆయన విద్యార్థులకు మా తరఫున సూచనలు సలహాలు ఇవ్వడానికి మేము సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ మాట్లాడుతూ ఈ మహాసభలు సందర్భంగా అనేక తీర్మానాలు చేశామని. బద్వేలు పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల. ప్రభుత్వ ఐటిఐ కళాశాల. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు చేతికి అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విధంగా అనేక తీర్మానాలు ఈ మహాసభల్లో చేశామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి వంశీ. ఉపాధ్యక్షులు కొండేటి హరిబాబు. కడప నగర అధ్యక్షుడు వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎం.ఆర్.పి.ఎస్ వ్యవస్థాపకుడు శ్రీ మందకృష్ణ మాదిగకు చెన్నేకొత్తపల్లిలో ఘనస్వాగతం

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన ఎంఆర్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ

చెన్నేకొత్తపల్లి నవంబర్ 16 (ఆంధ్రపత్రిక): భారత రాజ్యాంగం నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గారి విగ్రహానికి ఎం.ఆర్ పి ఎస్ వ్యవస్థాపకులు , జాతీయ నాయకులైన శ్రీ మందకృష్ణ మాదిగ శనివారంనాడు శ్రీ సత్యసాయి జిల్లాలోని మండల కేంద్రమైన చెన్నేకొత్తపల్లి లో 44 వ జాతీయ రహదారి సమీపంలో అందరివాడు ఉత్సవ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి, నమస్కరించారు.శనివారం అనంతపురం జిల్లా కేంద్రంలోని లలిత పరిషత్ లో అనంతపురం , శ్రీ సత్యసాయి జిల్లాలోని ఎం ఆర్ పీ ఎస్ తో పాటు గా వీటియొక్క అనుబంధ సంఘాల నాయకులతో కలిసి రిజర్వేషన్లు వర్గీకరణ అంశంపై చర్చించేందుకు ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎం ఆర్ పి ఎస్ వ్యవస్థాపకుడు శ్రీ మందకృష్ణ మాదిగ బెంగళూరు ఎయిర్ పోర్ట్ నుండి అనంతపురం కు 44 వ జాతీయ రహదారిపై వెళ్తుండగా చెన్నేకొత్తపల్లి లోని డాక్టర్ బి ఆర్ అంబెద్కర్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి, నమస్కరించి, నివాళులర్పించారు. చెన్నేకొత్తపల్లి లోని డాక్టర్ బి ఆర్ అంబెద్కర్ గారి విగ్రహం వద్దకు ఆయన కాన్వాయ్ వచ్చి, ఆగగానే అందరివాడు ఉత్సవ సొసైటీ సభ్యులు అలాగే ఎం ఆర్ పి ఎస్ నాయకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యామద్దెల గ్రామానికి చెందిన ఎన్. నరసింహులు, ఆటో ముత్యాలప్ప, డీలర్ నరసింహులు, దామాజిపల్లి గ్రామానికి చెదిన ఎం ఆర్ పి ఎస్ సీనియర్ నాయకులు దబ్బల శ్రీరాములు , మెకానిక్ మల్లికార్జున, గంగాధర, ఆదినారాయణ, దబ్బల నరసింహులు, సి ఎం నరసింహులు, సురేష్,చెన్నేకొత్తపల్లి కి చెందిన రాచర్ల రామకృష్ణ, మురళి, వార్డెన్ నారాయణ స్వామి, కమలమ్మ, మేడాపురం నారాయణ, వర్మ, లతో పాటుగా మరికొంతమంది పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో ఆర్యవైశ్య కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్‌కు ఘన సన్మానం

బద్వేలు నవంబర్ 16 (ఆంధ్రపత్రిక): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్గా నియమితులైన బద్వేలు పట్టణవాసి పరిటాల వెంకటసుబ్బయ్య కు శనివారం సిద్ధవటం రోడ్డులో వెలసిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆలయ కమిటీ నిర్వాహకులు మరియు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో వారిని సాధారణంగా ఆహ్వానం పలుకుతూ స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి వస్త్రంతో సత్కరించి వారికి అభినందనలు తెలపడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీనియర్ న్యాయవాది పివిఎన్ ప్రసాద్ ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు శ్రీ కోదండరామస్వామి దేవాలయం అధ్యక్షులు పేర్ల జనార్దన్ రావు వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్‌తో పాటు పలువురుకి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువాతో సత్కరించడం జరిగింది.ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన సీనియర్ న్యాయవాది పివిఎన్ ప్రసాద్ ఆర్యవైశ్య వర్తక్ సంఘం అధ్యక్షులు కె.వి. సుబ్బారావులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఆర్యవైశ్యులను గుర్తించి జిల్లాలోనే మొదటగా నామినేటెడ్ పోస్టల్ లో ఆర్యవైశ్య స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్గా బద్వేలు పట్టణానికి చెందిన పరిటాల వెంకటసుబ్బయ్యను నియమిస్తూ ఉత్తర్వు జారీ చేయడం సంతోష కరమన్నారు.బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ సమన్వయకర్త రితీష్ రెడ్డి మరియు రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు కొత్తపు మునిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి సహకారంతో స్టేట్ డైరెక్టర్ గా పరిటాల వెంకటసుబ్బయ్యకు పదవి రావడం సంతోషకరమన్నారు ఇందుకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే విజయమ్మకు రితీష్ రెడ్డికి పలువురు ప్రత్యేక అభినందనలు తెలిపారు.వెనుకబడిన నిరుపేద ఆర్యవైశ్యులు అనేకమంది ఉన్నారని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా నిరుపేద వైశ్యులకు స్వయం ఉపాధి కొరకు ప్రత్యేక నిధులు అందజేస్తూ ఆర్యవైశ్యుల అభివృద్ధికి పాటుపడాలని ఈ ప్రాంతంలో ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఇక్కడ నెలకొన్న సమస్యలను ఆర్యవైశ్య స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్యకు పలు విషయాలను తెలిపారు ఈ కార్యక్రమంలో ఆలయ సెక్రెటరీ గుడిసిపాటి అంకయ్య, ట్రెజరర్ వల్లంకొండు శివకుమార్, మెంటా వెంకట నాగేంద్ర, బండారు సురేష్ బాబు, దాస సతీష్ కుమార్, మరియు జొన్నలగడ్డ సుధాకర్ (వస్త్రం) వినోద్ వినోద్ కుమార్, ఓలేటి సురేంద్ర కుమార్, సత్తారు మహేంద్ర, బయన వెంకటసుబ్బయ్య, నేలపాటి వెంకటసుబ్బయ్య, తోపాటు పలువురు పాల్గొన్నారు.

7వ వార్డులో రికార్డు స్థాయిలో

టీడీపీ సభ్యత నమోదు కార్యక్రమం

హిందూపురం, నవంబర్ 16 (ఆంధ్ర పత్రిక) : ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదేశాలతో శనివారం పట్టణంలోని 7వ వార్డు ముక్కడిపేట లో కౌన్సిలర్ నాసిరభాను, షపి ఉల్లాల ఆధ్వ ర్యంలో 475 మందికి పైగా టీడీపీ సభ్యత్వం పొందారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లా డుతూ తెలుగుదేశం పార్టీ అమలు పరచిన సంక్షేమ పథకాలు అభివృద్ధిని చూసి వార్డు ప్రజలు ఆకర్షితులై విరివిగా టిడిపి సభ్యత్వం పొందు తున్నారన్నారు. వంద రూపాయలకు సభ్యత పొందిన వారికి ఐదు లక్షల వరకు ఇన్సూరెన్స్ ఉంటుందని మంచి బీమా కార్యక్రమంగా ప్రజలు అవగాహన పొంది స్వచ్ఛందంగా సభ్యత్వాన్ని తీసుకుంటున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు డిఇ రమేష్ కుమార్, మాజీ మునిసిపల్ చైర్మన్ జెవి అనిల్ కుమార్,నాయకులు అమర్నాథ్, డైమండ్ బాబా, అంజాద్, అల్లబాకష్,అన్వర్, నబిరసూల్,కౌన్సిలర్ అయూబ్, బూత్ ఇంచార్జ్ లు జంషీద్, ఐటీడీపీ టౌన్ ప్రెసిడెంటు శ్రీనివాసులు నాయుడు, ఆసిఫ్, నవీన్, సాధిక్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆస్మా, అలర్జి మందులు పంపిణీ

హిందూపురం, నవంబర్ 16 (ఆంధ్ర పత్రిక) : పట్టణంలోని నింకంపల్లి రోడ్డు విద్యారణ్య ఆవాస్ ఆవరణంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆనంద మార్గ్, వివేకానంద యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఆస్మా అండ్ అలర్జీ క్యాంప్ జరిగింది. ఈ సందర్భంగా సుమారు 500 మంది ప్రజలు పాల్గొని ఆస్మా, అలర్జీ మందు తీసుకొని క్షేమంగా వారి వారి గమ్య స్థానాలు చేరుకున్నారు. ఈ ఆస్మా, అలర్జీ క్యాంపులో ఆనంద్ మార్గ్ స్వామీజీతో పాటు గురుమూర్తి, చారు కీర్తి, రవీంద్రబాబు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

అపార్ నమోదుపై అవగాహన

హిందూపురం, నవంబర్ 16 (ఆంధ్ర పత్రిక) : పట్టణంలోని సప్తగిరి జూనియర్ కళాశాలలో అపార్ అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా శ్రీ సత్యసాయి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఆధార్ నెంబర్ ఎంత ముఖ్యమో చదువుకుంటున్న విద్యార్థులకు అపార్ నెంబర్ అంత ముఖ్యమని ఆయన తెలిపారు. హిందూపురం పరిధిలో ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాల ప్రిన్సిపాల్ లు తమ కళాశాలలోని పిల్లలకు అపార్ నెంబర్ నమోదును త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అపార్ నెంబర్ పొందితే దేశంలో ఎక్కడ చదువుకుంటున్న ఆ విద్యార్థి చదువుకు సంబంధించిన విషయాలను ఆన్లైన్ లో చూడవచ్చునన్నారు.అంతే కాకుండా అపార్ నెంబర్ నమోదు చేయడంలో ఉన్న ఇబ్బందులను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మంజునాథ్, పరిపాలనాధికారి గంగిరెడ్డి, ప్రభుత్వ, ప్రైవేట్ ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ లు పాల్గొన్నారు.

యురేనియం తవ్వకాలు నిలిపివేయాలని జీవో జారిచేయడం హర్షనీయం

మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్

దేవనకొండ, నవంబర్ 16 (ఆంధ్ర పత్రిక) : వైసిపి పార్టీ ఏమ్మెల్యే వీరుపాక్షి చేసిన చౌకబారు వ్యాఖ్యలు మానుకోండని టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర గౌడ్ ఘాటు గా విరుచుకుపడ్డారు. దేవనకొండ మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండలం లోని అన్ని గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కప్పట్రాళ్ల గ్రామంలో యూరేనియం తవ్వకాల గురించి ప్రజలలో ఉన్న అపోహలను తొలగిస్తూ ప్రభుత్వం జీవో నెంబర్ కూడా జారీ చేయడంహర్షించదగ్గ విషయమని వారు పేర్కొన్నారు .ఈ సందర్భంగా తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, కు ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్ కు అలాగే పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డికు పత్తికొండ శాసనసభ్యులు శ్రీ శామ్ కుమార్, కోడుమూరు శాసనసభ్యులు దస్తగిరి విష్ణువర్ధన్ రెడ్డి ఆలూరు నియెజకవర్గం ఇంచార్జీ వీరభద్ర గౌడ్ మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్ ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలూరు వైసీపీఎమ్మెల్యే వీరుపాక్షి చేసిన నిరధారమైన ఆరోపణలను మండల కన్వీనర్ ఖడించారు.రాజకీయ లబ్ది కొసం ప్రజలు భయభ్రాంతులకూ గురి అయ్యే విధంగా ఎటువంటి సమాచారం లేకున్నా ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదు అని ఏమైనా ఉంటే ప్రజలకు మేలుచైయాలి కానీ కీడు చేయకూడదు అని చెప్పడం జరిగింది.రాబోయే రోజులలో ప్రజల తరుపున తెలుగుదేశం పార్టీ గా పోరాటం చేస్తాం అని చెప్పడం జరిగింది మాజీ జడ్పీటీసీ ఉచిరప్ప బండిగింజల రంగన్న మలకన్న ఆకుల వీరేష్ అలారుదిన్నె మల్లయ్య రామారావు నాయుడు కరివేముల గిడ్డయ్య వెంకటస్వామి గౌడ్ నెల్లిబండ మల్లికార్జున రాజుగోపాలగౌడ్ రాజశేఖర్ గౌడ్ మల్లేపల్లి రంగుడు కప్పట్రాళ్ల మల్లికార్జున మస్తాన్ డీలర్ బండ్లయ్య వివిధ గ్రామాల ప్రజలు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు

కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం అసెంబ్లీలో సీఎంపై జిల్లా ఎమ్మెల్యేలు ఒత్తిడి తీసుకురావాలి

కడప ఉక్కు పరిశ్రమకు బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడం బాధాకరం

డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని

బద్వేలు నవంబర్16 (ఆంధ్రపత్రిక): కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమకు నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పనకు ప్రాముఖ్యత ఇవ్వకుండా బడ్జెట్ కేటాయింపులు జరగని ఇది తీరని అన్యాయమని అలాగే అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సందర్భంలో కడప జిల్లా ఎమ్మెల్యేలు ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం నిధులు కోసం సీఎం చంద్రబాబు నాయుడు పై ఒత్తిడి తీసుకురావాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని విమర్శించారు శనివారం బద్వేలు పట్టణంలోని స్థానిక సుందరయ్య భవనం నందు డివైఎఫ్ఐ బద్వేలు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.కె.మస్తాన్ షరీఫ్ ఎస్.కె.ఆదిల్ తో కలసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్డీఏ కూటమితో అధికారంలోకి వచ్చిన తర్వాత బడ్జెట్2.94. లక్షల కోట్లతో ప్రవేశపెట్టింది ఈ బడ్జెట్లో విద్యకు నిరుద్యోగ యువత ఉపాధి కల్పన కోసం పరిశ్రమల స్థాపనకు ప్రాధాన్యత ఇవ్వకుండా బడ్జెట్ కేటాయింపులు జరిగాయి కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం పరిశ్రమల కోసం బడ్జెట్ కేటాయించకపోవడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు కడప జిల్లా ప్రజలు చిరకాల కోరిక ఆకాంక్ష కడప ఉక్కు పరిశ్రమకు బడ్జెట్ లో కేటాయింపులు చేయకపోవడం ఎమ్మెల్యేలు ఒత్తిడి చేయకపోవడం చూస్తుంటే దుర్మార్గమన్నారు జిల్లా ప్రజల నిర్లక్ష్యానికి అద్దం పడుతుందన్నారు జిల్లాలోని మెజార్టీ ఎమ్మెల్యేలను కూటమి ప్రభుత్వం అభ్యర్థులను జిల్లా ప్రజానీకం గెలిపించిన జిల్లా సమగ్ర అభివృద్ధితో ముడిపడి ఉన్న కడప ఉక్కు పరిశ్రమకు బడ్జెట్ లో నిధులు కేటాయించకుండా మరొకసారి కూటమి ప్రభుత్వం కడప జిల్లా ప్రజల ఆశల పైన నీళ్లు చల్లారన్నారు ఇప్పటికైనా జిల్లాలో ఉన్నటువంటి కూటమి ఎమ్మెల్యేలందరూ కలిసికట్టుగా కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ కోసం బడ్జెట్లో నిధులు కేటాయించే విధంగా ముఖ్యమంత్రిపై ఒత్తిడి తీసుకురావాలని ఒత్తిడి తీసుకొస్తే జిల్లాలో పరిశ్రమలు వస్తాయని దానిద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని వారు డిమాండ్ చేశారు లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా డివైఎఫ్ఐ యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో ఉక్కు పరిశ్రమ వచ్చేంతవరకు పోరాటాలు కొనసాగిస్తామని వారు తెలిపారు.

అంగన్వాడీ బాలబాలికలకు మానసిక శారీరక పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు

బద్వేలు, నవంబర్16 (ఆంధ్రపత్రిక): బద్వేలు మండలము అనంతరాజ పురం నందు రాష్ట్రీయ బాలు స్వస్తిక్ కార్యక్రమం ప్రారంభించిన వైద్య ఆరోగ్య సిబ్బంది. శని వారం బద్వేలు మండలం అనంతరాజు పురం గ్రామ పరిధిలోని అంగన్వాడి మరియు పాఠశాలను డాక్టర్ జె.వినయ్ కుమారు మరియు డాక్టర్ విశ్వంత్ సందర్శించి రాష్ట్రీయ బాలుర స్వస్తిక్ కార్యక్రమమును పర్యవేక్షణ చేయడమైనది. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ జై.వినయ్ కుమార్,డాక్టర్ విశ్వంత్ మాట్లాడుతూ రాష్ట్రీయ బాలుల స్వస్తిక్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రతి విద్యార్థినీ విద్యార్థులకు శారీరిక పరీక్షలు మరియు మానసిక పరీక్షలు సంక్రమణ వ్యాధులు మరి యు అసంక్రమణ మైన వ్యాధులకు స్క్రీనింగ్ చేయవలనని హెల్త్ సిబ్బందికి ఆదేశించడం అయినది మరియు అదే విధంగా ప్రతి పాఠశాల హెడ్మాస్టరు అంగన్వాడి సెంటర్స్ హెల్త్ సిబ్బంది కి హెల్త్ కార్డును పూరించి ఆ పిల్లల యొక్క బరువు మరియు ఎత్తు,రక్తహీనత మొదలగు అన్ని పరీక్షలు చేపించవలసినదిగా పేర్కొనడమైనది.ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ బి.వెంగయ్య పోలుగ్గొని ఆరోగ్య విద్య ద్వారా పోషకాహారం, పరిసరాల పరిశుభ్రత పైన మరియు వ్యక్తిగత పరిశు భ్రత పైన పిల్లలకు అవగాహన కల్పించడమైనది, ఈ కార్యక్రమంలో, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శిరీష, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు,మరియు మహిళా పోలీసులు పాల్గొనడం అయినది.

త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ బేబీకి వినతిపత్రం అందజేసిన కాలనీవాసులు

నందికొట్కూర్, నవంబర్16 (ఆంధ్రపత్రిక): నందికొట్కూరు పట్టణంలోని ఎస్ ఎస్ ఆర్ నగర్ లో మంచినీటి కొరతను తీర్చాలి అనిఏపీ రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు పిక్కిలి వెంకటేశ్వర్లు, రైతు సంఘం ఆధ్వర్యంలో నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్ బేబీ మేడం కు కాలనీ వాసులతో కలిసి శనివారం వినతి పత్రం అందజేశారు, అనంతరం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శేష చెన్నారెడ్డి నగర్ లో గత.30 రోజుల క్రిందట మినీ ట్యాంక్ బోరు మోటర్ రిపేర్ రావడంతో. ఇంజనీరింగ్ సెక్షన్ అధికారులు రిపేరి కోసం తీసుకువెళ్లి 15 రోజులు కావస్తున్న ఇంతవరకు మోటర్ బిగించకపోవడంతో కాలనీలో ప్రజలు నీటి ఎద్దడితో తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు, మున్సిపాలిటీ కుళాయిల.ద్వారా వచ్చే నీరు ఐదు గంటలు వదిలిన ఇండ్లలోకి కుళాయిలకు నీరు రావడంలేదని ఇళ్లకు మోటర్లు ఎక్కువగా ఉండటంతో కుళాయిలకు నీళ్లు రావడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు, అందువలన తక్షణమే ఎస్ ఎస్ ఆర్ నగర్ తో పాటు పట్టణంలోని జగనన్న కాలనీ లో రెండు మోటర్లు మిగతా ఉన్నటువంటి మోటార్లను తక్షణమే రిపేర్ చేయించి ప్రజలకు మినీ ట్యాంకుల ద్వారా నీళ్లు అందించాలని వినతి పత్రంలో కోరారు, ఈ కార్యక్రమంలో కాలనీ ప్రజలు,మల్లేశ్వరమ్మ అబ్దుల్లా మా భాష శ్యామల షర్మిల మున్ని మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

యువత జాతీయ స్థాయిలో రాణించాలి

ఉపకులపతి ప్రొఫెసర్ కృష్ణారెడ్డి

కడప నవంబర్ 16 (ఆంధ్ర పత్రిక): యువ ఉత్సవ్ కార్యక్రమం నేటి యువతరానికి స్ఫూర్తిదాయకంగా ప్రతిభా పాటవాలను వెలికి తీసేలా, దేశభక్తిని పెంపొందించేందుకు ఉపయోగపడుతుందని వై వి యు వైస్ ఛాన్సిలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి అన్నారు.భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ,నెహ్రూ యువ కేంద్ర కడప యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి "యువఉత్సవ్ 2024 కార్యక్రమం వై.వి.యు లోని సురభి సమావేశ మందదిరంలో శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వైవియూ వీసీ మాట్లాడుతూ యువతరం సానుకూల దృక్పథంతో ఈపోటీ ప్రపంచంలో రాణించాలన్నారు.ఈ యువ ఉత్సవ్ లో వచ్చిన అవకాశాన్ని యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు వైవీయూ రిజిస్ట్రార్ పద్మ ప్రసంగిస్తూ జీవితంలో ఎదురయ్యే గెలుపోటములను సమానంగా స్వీకరించాలని యువతకు ఉద్బోధించారు చాటాలన్నారు. వై.వి.యు ప్రిన్సిపాల్ రఘునాథ రెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత తాము అనుకున్న లక్ష్యాలను సాధించాలని హితవు పలికారు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కె.మణికంఠ మాట్లాడుతూ యువ ఉత్సవ్‌లో భాగంగా ఇండియా ఏ2047 నాటికీ దేశం ప్రపంచానికి దిక్సూచిలా ఉండాలన్నారు. అందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింత దోహదపడతాయన్నారు. అనంతరం కల్చరల్ కో ఆర్డినేటర్ విజయభారతి మాట్లాడుతూ ప్రజలలో మన దేశం విభిన్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వం గురించి ప్రశంసలను సృష్టించడం చేయవచ్చని తెలిపారు. శక్తిసామర్థ్యాలను వెలికి తీసేందుకు ఈ వేదికలు ఉపయోగపడతాయన్నారు. ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ భారతదేశం ఇటీవల సంవత్సరాలలో వివిధ రంగాలలో సాధించిన ముఖ్యమైన పురోగతిని ప్రదర్శించ డానికి యువ ఉత్సవాలు లాంటి కార్యక్రమాలు చక్కని వేదిక అన్నారు.సాధన విద్యా సంస్థల కరస్పాండెంట్ బి.వి రెడ్డి, సిబిఐటి ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాగార్జున ప్రసంగించి యువతలో ఉత్తేజాన్ని నింపారు. మన జిల్లా యువతీ యువకులు అత్యద్భుత ప్రతిభను ప్రదర్శించి జాతీయస్థా యిలో రాణించాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన యువత, వైవియూ విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారానే సాధ్యం

ఉద్యమాల ప్రముఖులను స్మరించుకోవాలి

ఎమ్మిగనూరు,నవంబర్ 16 (ఆంధ్ర పత్రిక): గ్రంధాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులను స్మరించుకోవాలని గ్రంధాలయ ఇన్చార్జి హరికృష్ణ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ శాఖ గ్రంధాలయం నందు 57 వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు పురస్కరించుకుని 3 వ రోజు న మాచాని సోమప్ప బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ఆర్. శారద దేవి. యు. ఉమా. ఆర్. వెంకటేశ్వరి లు గ్రంధాలయ ఉద్యమ ప్రముఖుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రంగస్వామి మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమాల గూర్చి ,పుస్తకాల ప్రాముఖ్యత గూర్చి వివరించారు. గ్రంథాలయ ఉద్యమాల అయిన గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకటరమణయ్య , ఆర్. ఎస్ రంగనాథన్ మరియు పాతూరి నాగభూషణం గార్ల జీవిత విశేషాలను క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు. గ్రంధాలయం సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీలో 200 సభ్యత్వాలు

బ్రహ్మంగారిమఠం,నవంబర్ 16 (ఆంధ్ర పత్రిక):ఎమ్మెల్యే శ్రీ పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకుబ్రహ్మంగారిమఠం మండలంపలుగురాళ్లపల్లి నందు టీడీపీ నాయకులు నాగరాజ్ స్వామి, వెంకటేశ్వర్లు స్వామి, ప్రభాకర్, సుబ్బా రావు, వీరయ్య, జోసెఫ్ ఆధ్వర్యంలో ఇవాళ 200 కు పైగా సభ్యత్వాలు లక్ష్యంగా విజయవంతంగా కొనసాగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం.

రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టు పూర్తి చేయాలి

ఎమ్మిగనూరు,నవంబర్ 16 (ఆంధ్ర పత్రిక): శ్రీ బాగ్ ఒప్పందం అమలు చేసి రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని రాయలసీమ ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ నాగన్న డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోనే రాయలసీమ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తాహశీల్దార్ కార్యాలయం నందు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహసిల్దార్ వీరేంద్ర గౌడ్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ నాగన్న మాట్లాడుతూ దశాబ్దాల తరబడి రాయలసీమ అన్యాయానికి, వివక్షతకు గురవుతూనే వుంది. పాలకులు మారుతూ వున్నా రాయలసీమ పరిస్థితి మారడం లేదన్నారు. కరువు పరిస్థితుల్లో వలసలు రైతుల ఆత్మహత్యలు తగ్గడం లేదన్నారు. శ్రీ బాగ్ ఒప్పందం కుదిరింది. హామీలు పూర్తిగా నెరవేరలేదు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో రాయలసీమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజలు అడుగుతూ వున్నా తీర్చే ప్రభుత్వాలు లేవన్నారు. పెద్ద ఎత్తున ప్రజలు ఉద్యమిస్తే తప్ప సమస్యలు పరిష్కారం అయ్యే పరిస్థితి లేదన్నారు. ఈ సందర్భంగా శ్రీ బాగ్ ఒప్పందం కుదిరిన నవంబర్ 16 న రాయలసీమ హక్కుల ఉల్లంఘన దినంగా సీమ ప్రజలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యార్థి ప్రజా సంఘాల నాయకులు బతకన్నా. సంజీవ్ శేఖర్. వీరేష్ యాదవ్. ఖాజా. మహేంద్ర. కృష్ణ. సురేంద్ర. వెంకటేష్. నాగరాజు. అఫ్రీదు పాల్గొన్నారు.

నేడు తిరుమలలో కార్తీక వన భోజనం

భారీ వర్ష హెచ్చరికల నేపథ్యంలో వేదిక మార్పు

తిరుమల, ననవంబర్ 16 (ఆంధ్ర పత్రిక):తిరుమలలో కార్తీక వన భోజన కార్యక్రమాన్ని నేడు (17.11.24)శ్రీవారి ఆలయం సమీపంలోని వైభవోత్సవ మండపంలో టీటీడీ నిర్వహించనుంది. సాధారణంగా పార్వేట మండపంలో ఈ కార్యక్రమం జరగడం ఆనవాయితీ. వాతావరణ శాఖ భారీ వర్ష హెచ్చరికల నేపథ్యంలో ఈ ఏడాది వైభవోత్సవ మండపంలో నిర్వహించాలని టీటీడీ నిర్ణయించింది. పవిత్రమైన కార్తీకమాసంలో వనభోజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది .ఇందులో భాగంగా ఉదయం శ్రీవారు ఉభయనాంచారు లతో కలిసి వైభవోత్సవ మండపానికి వేంచేపు చేస్తారు. ఉదయం 11 నుండి 12 గంటల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారికి స్నపన తిరుమంజనం నిర్వహిసారు. ఈ సందర్భంగా పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేస్తారు. అనంతరం స్వామివారు ఆలయానికి వేంచేపు చేస్తారు.ఈ ఉత్సవం కారణంగా శ్రీవారి అలయంలో నిర్వహించే కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

హైందవ శంఖారావం బహిరంగ సభకు

శ్రీ మఠం పీఠాధిపతులకు ఆహ్వానం

కర్నూలు జిల్లా హైందవ శంఖారావం కో కన్వీనర్ న్యాయ కంటి భీమారెడ్డి ఆహ్వానం

మంత్రాలయం ,నవంబర్ 16 (ఆంధ్ర పత్రిక): జనవరి 5 న విజయవాడ లో జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభకు మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి శ్రీ సుభుదేంద్ర తీర్థుల కు ఆహ్వానించినట్లు కర్నూలు జిల్లా హైందవ శంఖారావం కో కన్వీనర్,టీటీడీ ధర్మ ప్రచార మండలి సభ్యులు, విశ్వ హిందూ పరిషత్ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు న్యాయ కంటి భీమారెడ్డి తెలిపారు. శనివారం వారు సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతులు శ్రీ సుబుదేంద్ర తీర్థుల కు ఆహ్వాన పత్రిక అందజేయడం జరిగిందని తెలిపారు. అనంతరం శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుబుదేంద్ర తీర్థులు మాట్లాడుతూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుండి విముక్తి చేసి, స్వయం ప్రతిపత్తి కలిగిన ఒక ఉత్తమ దార్మిక వ్యవస్థకు అప్పగిస్తూ వెంటనే చట్ట సవరణ చేయాలని సూచించారు. ,ధర్మో రక్షతి రక్షితః అన్నట్లుగా మన సనాతన హిందూ సంప్రదాయం లో హిందూ దేవాలయాలు, మఠాలు, పీఠాలు విశ్వ వ్యాప్తంగా సమాజంలో ఉన్న విషయం అందరికీ తెలిసినదే అన్నారు. వీటిని ఆయా రాష్ట్రాలలోని ప్రభుత్వాలు చట్టాలు చేపట్టి హిందూ దేవాలయాల పైన, మఠాలపైన, పీఠాలపైన ఆధిపత్యం చలాయించడం పవిత్రమైన భారతీయ సమ్మిదానానికి చాలా విరుద్ధమైనటువంటిదని తెలిపారు. కావున హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తిని కల్పించాలి అనే నినాదంతో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టబోయే హైందవ శంఖారావం బహిరంగ సభకు మా తరపున పూర్తి మద్దతు తెలుపుతూ మరియు హిందూ బంధువులు, భక్తులు, హిందూ సంఘాలు అందరూ కూడా దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించే వరకు కలసి కట్టుగా పోరాడాలని, విశ్వహిందుపరిషత్ వారికీ మా తరుపున సహాయ సహకారాలు ఎల్లా వేళల ఉంటాయి అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార మండలి సభ్యులు, మంత్రాలయం సూర్యనారాయణ చార్యులు, విశ్వహిందూ పరిషత్ నాయకులు భీమ లింగారెడ్డి, శ్రీరాములు యాదవ్, మురళీధర్, సోమిరెడ్డి,సీతారాముడు, గురు పాల్గొన్నారు.

కోర్టు తీర్పు అనుకూలంగా

కూటమి ప్రభుత్వం అడుగులు



ఎమ్మిగనూరు, నవంబర్ 16 (ఆంధ్ర పత్రిక):వర్గీకరణకు సుప్రీంకోర్టు తీర్పు కు అనుకూలంగా కూటమి ప్రభుత్వం వర్గీకరణ అమలు దశగా అడుగులు వేస్తుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి ఆనంద్ చైతన్య పేర్కొన్నారు.శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పై విశ్రాంత ఐఏఎస్ రాజీవ్ మిశ్రా ఏక సభ్య కమీషన్ ఏర్పాటు చేయడం శుభపరిణామం బావించాలన్నారు. ఎస్సీల వర్గీకరణ కోసం ముప్పై ఏళ్ల సుదీర్ఘ సామాజిక పోరాటమే ఇరవై ఏళ్ల న్యాయ పోరాటానికి సుప్రీం కోర్టు అనుకూల తీర్పు చెప్పింది. తదనుగుణంగా రాష్ట్ర కూటమి ప్రభుత్వం వేస్తున్న అడుగులో భాగంగా ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ వినతి మేరకు వర్గీకరణ కోసం ఏక సభ్య కమిషన్ ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దయ్య. ప్రతాప్. పోలయ్య. వివిధ గ్రామాల ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు. నవంబర్ 16 (ఆంధ్ర పత్రిక): అర్ధ వలస అర్ధ భూస్వామ్య వ్యవస్థ కలిగిన బారత దేశం ప్రజల సమస్యలు పరిష్కారం కావాలంటే నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్య సాధన ద్వారానే సాధ్యమని దక్షిణ భారత దేశ రాజకీయ సమాఖ్య వ్యవస్థాపకుడు మహమ్మద్ రషీద్ ద్రావిడ్ పేర్కొన్నారు. శనివారం ఆదోని ఆర్ట్స్ కాలేజీ రోడ్డు మాలతి ఫంక్షన్ హాల్ నందుసిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కొలిమి ప్రసాద్ అధ్యక్షతన కామ్రేడ్ చంద్ర పుల్లా రెడ్డి 40 వర్ధంతి సభకు ముఖ్య అతిథిగా మహ్మద్ రషీద్ హాజరయ్యారు. అనంతరం జాతీయ కార్యదర్శి షేక్ షావలి అమరవీరుల అరుణ పథాకాన్ని ఆవిష్కరించి అమరవీరుల సంతాపక సూచికగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఐఎఫ్టియు శ్రామిక స్పందన ఏపి రాష్ట్ర అధ్యక్షులు బి. జయరాం మాట్లాడుతూ లక్షలాది ఎకరాల భూమిని ప్రజలకు స్వాదీనపరిచిన కామ్రేడ్ సిపిరెడ్డి నిర్మించిన గోదావరిలోయ విప్లవ ప్రతఘటనోద్యమంలో వేలాది మంది కామ్రేడ్స్ అమరులై య్యారన్నారు. వారి ఆశయాలసాధనలో కంకణ బద్దులై నడవాల న్నారు. దున్నేవానికే భూమి ప్రాతిపదికన వ్యవసాయిక విప్లవో ద్యమాన్ని ఇరుసుగా చేసుకొని భూమి, భుక్తి, పీడిత ప్రజల విముక్తై పోరాడిన అమరవీరులకు భారత రైతు కూలీ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి నకిరేకంటి చిట్టిబాబు పేరు పేరున విప్లవ జోహార్లు అర్పించారు. దోపిడీ పీడన అణిచివేతలేని సమసమాజ స్థాపనకు ప్రతినబూనాలనిఅప్పుడు మాత్రమే అమరవీరులకు అర్పించే నిజమైన విప్లవ నివాళి అని అన్నారు. అనంతరం ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి

కామ్రేడ్ చంద్ర పుల్లా రెడ్డి 40 వ వర్ధంతి

కె. నరసన్న మాట్లాడుతూ కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న అన్నిరకాల ప్రజాస్వామిక అమానుష ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా వర్గపోరాటాలను, ప్రజాఉద్యమాలను తీవ్రతరం చేయాలని కోరారు. అలాగే ఇఫ్టూ నాయకులు బడిగే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కుల మత ప్రాంతీయ తత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సూచించారు. ఐఎఫ్టియు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పేర్క సునీత. ఏపి ఎంఎస్ బాకరం లావణ్య లు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా స్త్రీలు, దళితులు, ఆదివాసీలు, ఇతర మైనార్టీ వర్గాలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలకు వ్యతిరేకంగా సంఘటితంగా ఉద్యమించాలన్నారు. అనంతరం ఇఫ్టూ జాతీయ కార్యదర్శి షేక్ షావలి మాట్లాడుతూ భారత పాలకవర్గం ప్రజల సమస్యలను ప్రక్కదారి పట్టిస్తున్నారన్నారు. మత విద్వేష రాజకీయాలతో లౌకిక స్పూర్తిని కాలరాస్తున్నారని దుయ్యబట్టారు. మధ్య భారతదేశంలో ఆపరేషన్ కగార్(అంతిమ యుద్ధం) పేరుతో ఆదివాసి గిరిజన ప్రజలపై సామూహిక హత్యలు, అత్యాచారాలుపెరిగాయన్నారు.అడవి నుండి ఆదివాసీలను తరిమిగొట్టి బడా కార్పొరేట్ దోపిడీకి అనుకూలంగా మార్చే విధానాలను ఎండగట్టి ప్రశ్నిస్తూ ఉద్యమించే సంస్థల నాయకత్వాలను మావో యిస్టులు అనే నెపంతో అక్రమ అరెస్టులు తప్పుడు కేసులు, ఎన్ కౌంటర్లకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు బీజేపీ, జనసేన, టిడిపి కూటమి రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. ఇష్టారాజ్యంగా ప్రజల హక్కులను కాలరాస్తున్నారని అన్నారు. ఎన్నకలకు ముందు, ఆతర్వాత ప్రజలకు ఇచ్చిన హామీల అమలును విస్మరించి కక్ష పూరితమైన రాజకీయ విధానాలకు తెరలేపారని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. సామ్రాజ్యవాద దేశాల మధ్య వైరుధ్యాలు తీవ్రమయ్యాయన్నారు. అంతర్జాతీయ మార్కెట్ పై తమ ఆదిపత్యాన్ని నిలుపుకునే క్రమంలో జరుగుతున్న యుద్దాలు, అంతర్యుద్దాలకు వ్యతిరేకంగా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలను నిర్మించాల్సిన అవసరం నేడు విప్లవ సంస్థలు ప్రజానీకం పై ఉన్నదన్నారు. భారతదేశంలో విప్లవం విజయవంతం కావాలంటే, కామ్రేడ్ సిపిరెడ్డి స్వయంగా ఆచరించి నిర్మించిన గోదావరిలోయ ప్రతిఘటన పోరాట మార్గం తప్ప మరోమార్గం లేదన్నారు. ఈపై కార్యక్రమంలో కర్నూలు జిల్లా ప్రజా సంఘాల నాయకులు భారత రైతు కూలీ సంఘం బి.ఏసేపు, ఇఫ్టూ కెఎండి అనీఫ్, ఐపివైఎల్ చిన్నిప్రసాద్, ఇఫ్టూ వెంకప్ప, అరుణోదయ రాంచందర్, దళిత సంఘం నర్సన్న తధితురులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవ వేడుకలు

బ్రహ్మంగారిమఠం,నవంబర్ 16 (ఆంధ్ర పత్రిక):జాతీయ పత్రికా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని బ్రహ్మంగారిమఠం మండలంలోని విలేకరుల సంఘం ఆధ్వర్యంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి పార్కు వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో పాత్రికే విలేకరులు కేకును కట్ చేసి జాతీయ పత్రికా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ వ్యవస్థలో పత్రికను ఫోర్త్ ఎస్టేట్ గాపిలువబడుతుందని అంటే మన దేశంలో నాలుగవ స్థానంలో పత్రిక వ్యవస్థ ఉందని అటువంటి పత్రికకు విలేఖరిగా వ్యవహరించే వ్యక్తి విలువలతో. విశ్వసనీయతతో కూడుకున్న వ్యక్తులుగా ఉండాలని,విలేఖరి అంటే ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా నిలిచే ఉన్నత వ్యక్తి అని ఆ ఉన్నత వ్యక్తి విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ ప్రజల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యపరిష్కారానికి కృషిచేయాలనితెలియచేస్తూఈసందర్భంగా బ్రహ్మంగారిమఠం మండల మీడియా సంఘము తరపున ప్రభుత్వానికి విన్నవించుకుంటూ రాష్ట్రంలో ఉన్న విలేకరుల సమస్యలను గుర్తించి త్వరితగతిగా ఆ సమస్యలుపరిష్కరించాలని అలాగే విధి నిర్వహణలో పత్రికా విలేకరిగావ్యవహరించే వ్యక్తులపైన అక్రమంగా కేసులు పెట్టినటువంటి కేసులను వెంటనే ప్రభుత్వంఉపసంహరించుకోవాలని పత్రికా విలేకరులకు ఇంటి స్థలంతో పాటు భూమిని కూడా కేటాయించి వారి సంరక్షణకు ప్రభుత్వం అండగా నిలవాలని బ్రహ్మంగారిమఠం మీడియా సంఘం తరపున రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించుకున్నారు ఈ కార్యక్రమంలో పాత్రికేయులు మల్లికె వెంకటేశ్వర్లు (ఆంధ్ర పత్రిక)అంబిశెట్టి వెంకటసుబ్బయ్య (సూర్య దినపత్రిక) నారాయణ,రామానాయుడు, అమర్,బాలు,జగన్, రఘు,చంద్ర శేఖర్,వెంకట సుబ్బయ్య,రసూల్,నరసింహులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు. నవంబర్ 16 (ఆంధ్ర పత్రిక): పట్టణం గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం పాఠశాలల్లో మతాలకు సంబం ధించిన సభా కార్యక్రమాలకు అనుమతించ కూడదని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను ఉల్లంఘించినప్రదానోపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్యు రాష్ట్ర కార్యదర్శి రాజేష్ పేర్కొన్నారు. శనివారం పిడిఎస్యు రాష్ట్ర కార్యదర్శి రాజేష్ మాచాని సోమప్ప బాలికల ఉన్నత పాఠశాలకు సందర్శించి ప్రదానోపాధ్యా యులను మత కార్యక్రమాలకు ఎలా ప్రోత్సాహిస్తారని నిలదీశారు. ఈ సందర్భంగా పిడిఎస్యు రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం ప్రభుత్వ పాఠశాలల్లో మతాల భగవద్గీతలను విద్యార్థులకు పంచడం సరైనది కాదన్నారు. ఆభం శుభం తెలియని పసిపిల్లలలో మెదడుల్లలో కొంతమంది విశ్వహిందూ పరిషత్ పేరుతో ప్రభుత్వ పాఠశాల యందు విద్యార్థులకు భగవద్గీతలను ఇవ్వడం దారుణం అన్నారు విద్యాసంస్థల్లో అన్ని మతాలకు సంబంధించిన విద్యార్థులు ఉంటారని కానీ ఇలా ఒక మతానికి సంబంధించిన భగవద్గీతలను విద్యార్థులకు ఇవ్వడం శోచనీయమన్నారు. మతం అనేది ఎవరి వ్యక్తిగతం కానీ విశ్వ హిందూ పరిషత్ వాళ్ళు ఇలా ప్రభుత్వ విద్యా సంస్థలో విద్యార్థులకు ఇచ్చేకంటే చాలా మంది హిందువుల ఇంటింటికి వెళ్లి ఇవ్వాలి కానీ ఇలా విద్యార్థులకు మతం రంగులు పూయడం వలన విద్యార్థుల్లో తారతమ్యం ఏర్పడుతుందన్నారు.ఇంకా ఈ దేశంలో స్వర్వ మతాల సమానం తెలుసుకొనే వయసులో విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు పెట్టడం సరికాదు అన్నారు.ఈరోజు హిందువులు రేపు ముస్లింలు మరొక రోజు క్రైస్తవులు ఇలా ప్రతి మతం వారి గ్రంథాలను పంచుకుంటూ పోతే దేశంలో విద్యార్థులు ఎలా నైపుణ్య అభివృద్ధి చెందుతారని దేశం ఎలా అభివృద్ధి అవుతుందని ప్రశ్నించారు. మత కార్యక్రమాలు నిర్వహించినప్రదానోపాధ్యాయులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యా శాఖ అధికారులును డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు నాయకులు రాజు, వీరేష్,వెంకటేష్, శ్రీనివాసులు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి 99వ జన్మదిన వేడుకల ఏర్పాట్లను

పరిశీలించిన మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

సత్యసాయి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రానీవొద్దు

పుట్టపర్తి, నవంబర్16 (ఆంధ్రపత్రిక): పుట్టపర్తి లోని శ్రీ భగవాన్ సత్యసాయి బాబా జన్మదిన వేడుకల ఏర్పాట్లను శనివారం మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పరిశీలించారు.పుట్టపర్తిలో నవంబర్ 18 నుంచి ప్రారంభమయ్యే 99వ సత్యసాయి బాబా జయంతోత్సవాల ను పుట్టపర్తి పట్టణంలోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్,కొత్తరోడ్, వై.జంక్షన్, పెద్ద కమ్మవారిపల్లి చింత తోపు వద్ద వాహనాల పార్కింగ్ ప్రదేశం, పడమర గేటు, కర్ణాటక నాగేపల్లి వద్ద వాహనాల పార్కింగ్ స్థలాన్ని,ప్రత్యేక మరుగుదొడ్లు ఏర్పాటు ప్రాంతాల్ని పరిశీలించారు.చిత్రావతి బ్రిడ్జి వద్ద వాహనాల పార్కింగ్ ఎలాంటి దుకాణాలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.చిత్రావతి రోడ్ లోని ప్రధాన వీధులు పాదాచార్యులు నడిచే పుట్ పాత్ తోపాటు చిత్రావతి నది పరివాహక ప్రాంతం శుభ్రంగా ఉండేలా చూడాలని తెలిపారు.పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు అందంగా ఉండేలా చూడాలన్నారు.ఎక్కడ పారిశుద్ధ్యం లేకుండా మున్సిపల్ అధికారులు నిత్యం పర్యవేక్షణ చేసేలా కమిటీని వేయాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి కమిషనర్ కు సూచించారు.పుట్టపర్తిలో నగర వీధుల్లో పారిశుద్ధ్యం చెత్తాచెదారం లేకుండా చూడాలని అన్నారు.పట్టణంలోని ప్రధాన రోడ్లలో విద్యుత్ అలంకరణతో అందంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ జన్మదిన వేడుకలకు దేశ విదేశాల నుంచి అనేక మంది భక్తులు ఎక్కువగా వస్తారని అందుకు తగ్గట్టుగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ అధికారులు,మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద,వారి సిబ్బందికి సూచించారు.సత్యసాయి జన్మదిన వేడుకలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సత్యసాయి ట్రస్టు సహకారంతో ప్రభుత్వ అధికారులు తగిన ఏర్పాట్లు చేసి బాబా జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలని మాజీ మంత్రి పల్లె అధికారులకు సూచించారు.మాజీ మంత్రి తోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు మున్సిపల్ కమిషనర్ ప్రహల్లాద,ఇంజనీర్ నరసింహమూర్తి,మున్సిపల్ అధికారులు,కూటమి పార్టీ కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయునిపై దురుసుగా ప్రవర్తించిన

హాస్టల్ వార్డెన్ పై చర్యలు తీసుకోవాలి

అమడగూరు మండల పాత్రికేయులు

అమడగూరు, నవంబర్16 (ఆంధ్ర పత్రిక): పాత్రికేయునిపై దురుసుగా ప్రవర్తించిన బీసీ హాస్టల్ వార్డెన్ పై చర్యలు తీసుకోవాలి అని మండల పాత్రికేయులు పేర్కొన్నారు. నల్లచెరువు మండల కేంద్రంలోని బీసీ హాస్టల్లో నెలకొన్న సమస్యలపై విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రచురించిన వార్తకు పాత్రికేయులపై బీసీ హాస్టల్ వార్డెన్ దురుసుగా అసభ్య పదజాలంతో తను ఒక ఉద్యోగి అని మరచి దురుసుగా ప్రవర్తించడం సబబు కాదని అన్నారు. అలాగే ఆ వార్డెన్ సూర్యపత్రిక విలేకరిపై అక్రమంగా కేసు కూడా బనాయించడం ఎంతవరకు సమన్యసం అన్నారు.వార్డెన్ ఇచ్చిన ఫిర్యాదు పై విచారణ లేకుండా కేసు బనాయించడం దారుణమన్నారు. సమాజంలో పేదల పక్షాన పోరాడుతూ సమస్య లను ఎత్తిచూపుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారిదిగా పనిచేస్తున్న పత్రిక మీడియా పైన దురుసుగా ప్రవర్తించిన హాస్టల్ వార్డెన్ పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని మండల తాహసిల్దార్ రామనాథరెడ్డి,పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ కు మండల పాత్రికేయులు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ధర్మారెడ్డి, మారుతి, రవి, లక్ష్మీపతి, గంగాధర, దొడ్డప్ప, మండల పాత్రికేయులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ధర్నా

కర్నూలు నవంబర్ 16(ఆంధ్రపత్రిక): ప్రజా సమస్యల పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ప్రజా పోరు కార్యక్రమంలో భాగంగా కోసిగి సిపిఎం పార్టీ కోసిగి మండల కమిటీ ఆధ్వర్యంలో తహాశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ కోసిగి మండల నాయకులు వీరేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఎన్నికల ముందు నిత్యవసర వస్తువుల ధరలు తగ్గిస్తామని విద్యుత్ ఛార్జీలు పెంచమని సూపర్ సిక్స్ పథకాల అమలు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కావస్తున్న ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని ఆయన విమర్శించారు.నిత్యవసర వస్తువులు ధరలు తగ్గించమని ప్రజలు కోరుతూ ఉంటే మద్యం ధరలు తగ్గించామని కూటమి ప్రభుత్వం చెప్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పిన కూటమి ప్రభుత్వము ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో ప్రజల పైన 17 వేల కోట్ల రూపాయల భారం మోపిందని ఆయన విమర్శించారు.గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పెడతామంటే పగలగొట్టండి అని చెప్పిన కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజల నుండి రైతుల నుండి ముక్కుపిండి

అధికంగా ఛార్జీలు వసూలు చేయడానికి సిద్ధంగా ఉందని ఆయన అన్నారు.సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తానని చెప్పిన ప్రభుత్వం ఇంతవరకు అమలు చేయకపోవడం విచారకరమని ఆయన అన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలుకు పూనుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అంతేకాకుండా కోసిగి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అదేవిధంగా కోసిగి మండలంలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలని అదేవిధంగా వలసలు నివారించడానికి తగు చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అనంతరం డిమాండ్స్ తో కూడిన పత్రాన్ని రెవిన్యూ డిపార్ట్మెంట్ జూనియర్ అసిస్టెంట్ పరశురాముకు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ కోసిగి మండల కన్వీనర్ రాముడు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కోసిగి మండల కార్యదర్శి పూజారి శ్రీనివాసులు గౌడ్ సిపిఎం పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు చిన్నన్న ఆటో యూనియన్ నాయకులు అమీర్ అంజి వీరేష్ రైతు సంఘం నాయకులు జలీల్ రామకృష్ణ హనుమంతు నాగేంద్ర గోపాల్ చిన్న కోసిగయ్య హనుమంతు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పత్రికా విలేకరులకు ఘన సన్మానం

ప్రిన్సిపాల్ గంగాధర్ నాయుడు..

సోమల. నవంబర్ 16(ఆంధ్రపత్రిక): జాతీయ పత్రికా దినోత్సవం ను పురస్కరించుకుని స్థానిక కొల్లా వెంకట్రామానాయుడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్. ఎన్. ఎస్.వారి సౌజన్యం తో శనివారం నవంబర్ 16 వతేది న జాతీయ పత్రిక దినోత్సవాన్ని ఘనంగా కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి గంగాధర్ నాయుడు మాట్లాడుతూ భారతదేశంలో జాతీయ పత్రిక దినోత్సవం 1966 నవంబర్ 16 నుంచి జరుపుకుంటున్నామని, ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నించే మార్గం సమాచార మా ధ్యమమని తెలిపారు. అలాగే నిర్భయంగా, నిజాయితీగా, వాస్తవాలను ప్రభుత్వానికి నివేదించడంలో విలేకరులు ముందుంటారని విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు. ప్రభుత్వం కు ప్రజలు కు మధ్య వారధిగా పత్రిక విలేకరులే పని చే స్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్. ఎస్. ఎస్ అధికారి జి. గౌతమ్ మాట్లాడుతూ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పత్రిక విలేకరులకు పూర్తి స్వేచ్ఛను ఇస్తూ వాస్తవాలను వెలికితీయడంలో వీరిది ముఖ్యమైన పాత్ర అని తెలియజేశారు. జంతు శాస్త్ర అధ్యాపకులు B.శివయ్య మాట్లాడుతూ ప్రభుత్వాలకు వారి కర్తవ్యాన్ని గుర్తు చేయడంలో పత్రికలు ప్రముఖ పాత్ర వహిస్తాయని తెలియజేశారు. చరిత్ర అధ్యాపకులు %దీ%. చింతమాను రామకృష్ణ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్రోద్యమ కాలంలో పత్రికలు ప్రముఖ పాత్ర వహించాయని, భారతదేశానికి స్వాతంత్రం తీసుకురావడంలో ప్రధాన పాత్ర పోషించాయని తెలియజేశారు. జాతీయ పత్రికా దినోత్సవం పురస్కరించుకొని సోమల పత్రిక విలేకరులైన జగన్ మోహన్ నాగరాజు, కృష్ణమూర్తి, ప్రసాద్‌ని ఘనంగా సత్కరించడం జరిగింది.ఈ క్రమంలో విలేకరులు మాట్లాడుతూ పత్రిక దినోత్సవం రోజు న మా కర్తవ్యాన్ని గుర్తింపు చేసి సన్మానించడం సంతోషదాయకమని తెలిపారు. ఈ సన్మానం మా బాధ్యత ను మరింత పెంచిందని తెలిపారు. అలాగే కళాశాల బృందం కు విలేకరులు కృతజ్ఞతలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పరమాత్మను ప్రతిష్ఠించిన

మానవీయ కవి వేమన

ఆచార్య ఎన్ ఈశ్వర్ రెడ్డి

కడప నవంబర్ 16 (ఆంధ్రపత్రిక): ఆత్మలో పరమా త్మను ప్రతిష్ఠించిన అచ్చమైన మానవీయ కవి వేమన అని, రాయిరప్పల్లో దైవం లేదని చెప్పిన అత్యాధునిక కవి వేమన అని యోగి వేమన విశ్వవిద్యాలయ ఆచార్యులు ఎన్.ఈశ్వరరెడ్డి అన్నారు.తమిళనాడు రాజ్ భవన్ లో యోగ కవులైన తిరువళ్లువర్ – కబీర్ దాస్ – యోగి వేమనలపై జరిగిన బహుభాషల అంతర్జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. "వేమన దృక్పథంలో దైవం" అనే అంశంపై మాట్లాడుతూ రాళ్ళలో దేవుడు లేడని,పట్టు వస్త్రాలను దేవుడు అడగలేదని, గుళ్ళు గోపురాలు కట్టించమని దేవుడు కోరలేదని చెప్పిన వేమన తాత్వికత మతాలకు అతీతమైందని పేర్కొ న్నారు. దైవత్వం విశ్వమంతా వ్యాపించి ఉందని, ప్రతి హృద యంలో కొలువై ఉన్న శివుణ్ణి చూడడం చేతకాక విగ్రహాల వైపు పరుగులు తీయడాన్ని వేమన ఖండించిన విధానం శాస్త్రీయ జ్ఞానానికి సంబంధిన అంశంగా విశద పరిచారు.రాయికి పూజ చేస్తే ముక్తి లభించేది నిజమే అయితే నేను కొండకే పూజచేస్తానని చెప్పిన కబీర్ దాస్ భావజాలానికి వేమన దృక్పథం సారూప్యత కలిగి ఉందని ఉదాహరణలతో వివరించారు. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్ రవి, రాజస్థాన్ కేంద్రీయ విశ్వవిద్యాలయ ఆచార్యులు, సదస్సు సంచాలకులు ఎన్.లక్ష్మి అయ్యర్, ప్రముఖ ద్విభాషా కవి వానవిల్ కె రవి తదితరులు హాజరయ్యారు. డా అంబేద్కర్ విశ్వవిద్యాలయ ఆచార్యులు ఎల్.వి కృష్ణా రెడ్డి, ద్రావిడ విశ్వవి ద్యాలయ ఆచార్యులు ఎం. హరి కృష్ణ తదితరులు పత్ర సమర్పణ చేశారు

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు

అట్లూరు నవంబర్ 16 (ఆంధ్రపత్రిక): అట్లూరు మండలంలోని గాండ్లపల్లె నల్లగొండపల్లె కాలనీ ఉప్పుటూరు కాలనీ చుండువాయి కాలనీలలో ఇంటింటికి సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం నిర్వహించారు.మాజీ ఎమ్మెల్యే విజయమ్మ యువ నాయకులు రితీష్ రెడ్డి ఆదేశాల మేరకు మంచూరు సూర్య నారాయణ రెడ్డి అరవ శ్రీనివాసులు రెడ్డి పోతిరెడ్డి రెడ్డయ్య పాలకొల్లు రాజశేఖర్ రెడ్డిఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వ నమోదు ముమ్మరంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎం పుల్లారెడ్డి ఈశ్వర్ రెడ్డి రఘురాం రెడ్డి పి నర్సింలు పరుశురాముడు దేవరాజ్ ఈశ్వరయ్య ఐవారయ్య నిత్య పూజయా నరసింహులు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

దుగరాజపట్నం పోర్టును

వెంటనే ప్రారంభించాలి

గూడూరు నవంబర్ 16(ఆంధ్ర పత్రిక): విశాఖ పట్నం లా గూడూ రు అభివృద్ధి చెందాలంటే దుగరాజ పట్నం పోర్టు ప్రారంభిచాలని కాంగ్రెస్ పార్టీ కేంద్ర మాజీ మంత్రి ,మాజీ ఎంపీ చింతా మోహన్ అన్నారు. గూడూరు పట్టణం లోని టవర్ క్లాక్ సెంటర్‌లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ చింతా మోహన్ మాట్లాడుతూ దుగ్గరాజపట్నం పోర్టు ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడ్డుకుంటున్నారని తెలిపారు. అమరావతిని రాజధాని గా అభివృద్ధి చేయాలంటే వందేళ్లు పడుతుందని అన్నారు. చంద్రబాబు నాయుడు పోలవరం, అమరావతి గురుంచే మాట్లాడుతాడు కానీ పోర్టు నిర్మాణం చేపట్టక పోతే నష్టం వస్తుందన్నారు... గూడూరు ప్రాంత ప్రజల్లో చైతన్యం రావాలన్నారు. ఈయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

హలో మాల చలో పలమనేరు

రామకుప్పం నవంబర్ 16(ఆంధ్రపత్రిక): రామకుప్పం మండల కేంద్రం నుండి ఈనెల 23వ తేదీన పలమనేరు పట్టణ కేంద్రంలో నిర్వహించబోవు మాలల ఐక్యవేదిక సమావేశానికి మాల మహానాడు అనుబంధ సంఘాలు అందరు కూడా పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలంలోని శివాజీ నగర్ కాలనీ నందు మండలంలోని మాల మహానాడు నాయకుల ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాల మహానాడు జాతీయ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ డాక్టర్ యమల సుదర్శనం గుండాల మనోహర్ పెన్వెల్ సింహ సతీష్ మహేష్ అంజి గోవర్ధన్ శ్రీరాములు రామచంద్ర రమేష్ కన్నప్ప మరియు మాల సంఘాల నాయకులు పాల్గొన్నారు

ఆవుల కుప్పంలో పారిశుధ్య కార్యక్రమం

రామకుప్పం, నవంబర్ 16(ఆంధ్రపత్రిక): రామకుప్పం మండలంలోని ముద్దనపల్లి పంచా యతీ ఆవుల కుప్పం గ్రామం నందు బూత్ కన్వీ నర్ నాగరాజు, బాలాజీ నేతృత్వంలో ఆవులకుప్పం గ్రామం నందు పారిశుధ్య కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుండి అంగన్వాడి కేంద్రం వద్ద గ్రామం నుండి వచ్చే మురుగనీరు, వర్షపునీరు నిల్వ ఉండటంతో గ్రామస్తులకు ఇబ్బంది ఉండ టంతో, టిడిపి మండల అధ్యక్షులు ఆనంద్ రెడ్డికి తెలియజేయగా ,వెంటనే ఆనంద్ రెడ్డి ఎంపీడీవోకు తెలియజేశారు. వెంటనే జెసిబి సమకూర్చి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేతలు బాలాజీ దేవరాజు గ్రామస్తులు పాల్గొన్నారు .

శెట్టేరి గ్రామంలో వేడుకగా

వెంకటేశ్వరుని స్వామి ఊరేగింపు

బంగారుపాళ్యం, నవంబర్ 16 (ఆంధ్రపత్రిక) : చిత్తూరు జిల్లా పూతల పట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండల పరిధిలోని శెట్టేరి గ్రామ పంచా యతీలో సర్పంచ్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ యువత శనివారం శ్రీవెంకటేశ్వర స్వామివారికి గరుడ వాహన సేవను వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ అనిల్ కుమార్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో గ్రామాభివృద్ధి నిరాటంకంగా కొనసాగాలని గ్రామ యువత సహాయ సహకారాలతో గరుడోత్సవాన్ని నిర్వహించడం జరిగిందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో దాము,సుభాష్, చిరంజీవి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా

వ్యాస రచన పోటీలు

బంగారుపాళ్యం, నవంబర్ 16 (ఆంధ్రపత్రిక) : చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో శనివారం 3గం లకు విద్యార్థులకు గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా వ్యాస రచన చిత్రలేఖనం పోటీలను నిర్వహిం చడం జరిగింది.ఈకార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయురాలు సుశీల వ్యవహరించారు.ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 20వ తేదీ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందని గ్రంథాలయ అధికారి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

విద్యార్థులకు బహుమతులు ప్రధానం

గూడూరు, నవంబర్ 16(ఆంధ్రపత్రిక): స్థానిక లిటిల్ ఏంజెల్స్ పాఠశాల నందు జె.వి.వి ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి మండల స్థాయి పరీక్షలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జె.వి.వి సభ్యులు బహుమతులు, మెమొంటోలను అందచేశారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా ఎం.ఈ.ఓ.రవూఫ్, చేతుల మీదుగా మెమొంటోలు, బహుమతులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక వారు ఈ సమాజంలో విద్యార్థులను భావి, భారత పౌరులుగా, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా తీర్చిదిద్దేందుకు సైన్స్ పరీక్షలు నిర్వహిస్తూ వారిలో చైతన్యాన్ని నింపటం చాలా గొప్ప విషయమని తెలిపారు. విద్యార్థులు అందరూ కూడా రుణపడి ఉంటారని వారి కార్యక్రమాలు అద్భుతంగా ఉంటాయని ప్రతి స్కూల్ టీచర్లు, విద్యార్థులు వారి ఆలోచనా విధానాన్ని వారు నిర్వహించే సైన్స్ కార్యక్రమాల్ని ఆచరణలోకి తీసుకొని ముందుకు సాగాలని కోరారు. అదేవిధంగా జే.వి.వి.వారు 32 సంవత్సరాలుగా ఈ పరీక్షలు నిర్వహిస్తూ సమాజాభివృద్ధి కోసం పాటుపడుతూ మూఢనమ్మకాలను పారదోలుతూ, చెడు అలవాట్లకు దూరంగా ఉండండి అని సమాజాన్ని మేలుకొలుపుతూ, చెట్లు నాటే కార్యక్రమాలు చేస్తూ, సమాజానికి ఉపయోగపడే అన్నిమంచి కార్యక్రమాలు చేస్తున్న జే.వి.వి. సభ్యులందరిని అభినందించారు.చదువు యొక్క ఆవశ్యకత, చెట్లు యొక్క ప్రాముఖ్యతను జే.వి.వి. భాధ్యతలను గురించి పాటల రూపంలో ఆలపించిన గాయకులను అభినందించారు.. ఈ కార్యక్రమంలో జే.వి.వి.అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, ఎల్. ఏ.పి. హెచ్. ఎం. సురేష్ , నాగరాజు, చెంచునారాయణ, శ్రీనివాసాచారి, పురుషోత్తమరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిసెంబర్ 14న జరిగే జాతీయ

లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

గూడూరు, నవంబర్ 16(ఆంధ్ర పత్రిక): డిసెంబర్ 14 న దేశవ్యాప్తంగా జరిగే జాతీయ లోక్ అదాలత్ ను జయప్రదం చేయాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సులోచన రాణి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సులోచన రాణి మాట్లాడుతూ కేసుల శాశ్వత పరిష్కారానికి రాజీయే రాజా మార్గం అని పిలుపునిచ్చారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో సివిల్, క్రిమినల్, బ్యాంక్, బి.ఎస్. ఎన్. ఎల్, ఎలక్ట్రి సిటీ కేసులు, భూ తగాదాలు, ఇతర కేసులను రాజీ మార్గంలో ఇరు వర్గాల సమ్మతితో రాజీ చేస్తామని తెలిపారు. కక్షి దారులు ఈ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

నియోజక వర్గ అభివృద్ధికి సహకరించండి

గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

గూడూరు నవంబర్ 16(ఆంధ్ర పత్రిక): అసెంబ్లీ సమావేశాలలో భాగంగా విజయవాడ కు వెళ్లిన ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ అమరావతి సచివాలయంలో శనివారం రాష్ట్ర హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత, రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ , టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్ లను మర్యాద పూర్వకం గా కలిసి పుష్ప గుచ్చాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గూడూరు నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలని మంత్రు లను కోరడం జరిగిందన్నారు. వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈయన వెంట గూడూరు నియోజకవర్గ టిడిపి నాయకులు బిల్లు చెంచురామయ్య తాతపూడి ఇశ్రాయేల్ కుమార్, ఎం.డి. అబ్దుల్ రహీం, ఈసంశెట్టి నటశేఖర్, షేక్ షాహుల్, పత్రంగం వసంత్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండు నేతాజీ నగర్‌లో ఇంటింటి కొలతలు నిర్వహించిన దేవాదాయ శాఖ అధికారులు

చౌడేపల్లి, నవంబర్ 16(ఆంధ్ర పత్రిక): గోసల కురుపల్లి కాశి విశ్వేశ్వర స్వామి ఆలయ మన్యం భూముల్లో అక్రమంగా స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్న, వారిపై దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు కొరడా ఝులిపించారు.శనివారం ఈ మేరకు బస్టాండు నేతాజీ నగర్ లో ఇంటింటికి వెళ్లి కొలతలు తీసుకున్నారు. బస్టాండ్ లోని 59 దుకాణాలు, నేతాజీ నగర్ లోని 56 గృహాలకు కొలతలు నిర్వహించినట్లు. పుంగనూరు గ్రూప్ టెంపుల్స్ ఈవో కమలాకర్ తెలిపారు. ఈ కొలతలను ఉన్నతాధికారులకు నివేదిస్తున్నట్లు ఆయన వివరించారు. అనంతరం అధికారుల చర్యలు ఉంటాయన్నారు. దీంతో నేతాజీ నగర్, బస్ స్టాండ్, దుకాణదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఏ సమయానికి ఏమి జరుగుతుందో అన్న ఆందోళన వారిలో నెలకొని ఉంది. దేవస్థానం భూములు ఆక్రమిస్తే దశాబ్దాలు అయినప్పటికీ చర్యలు తప్పవని దేవస్థానం అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ శశిధర్, భాస్కర్ రెడ్డి, సిబ్బంది హరి, మోహన్ రెడ్డి, గిరి, రామకృష్ణ, సహదేవ రెడ్డి, వీఆర్వో విజయ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవి దేవి ఆలయంలో విశేష పూజలు

చౌడేపల్లి, నవంబర్ 16(ఆంధ్ర పత్రిక): పంచాయతీ కేంద్రం పుదిపట్లలో గల స్వయంభు వైష్ణవి దేవి, ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకురాలు శ్రావణి, ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అభిషేకము, అలంకరణ గావించారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అమ్మవారి సేవలో తరించారు.

అదేవిధంగా ఆలయ ప్రాంగణంలోని కాలభైరవుడు, ఆంజనేయస్వామి, ఆలయాల్లోనూ పూజలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు ఆలయ నిర్మాణదాత వినోద్ కుమార్ రెడ్డి, పవిత్ర తీర్థప్రసాదాలు అందించారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

- ప్రభుత్వమే ఇంటి నిర్మాణం చేపట్టాలి.
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

జంగాల అజయ్ కుమార్ డిమాండ్

మంగళగిరి నవంబర్ 16 (ఆంధ్రపత్రిక) : గత ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరు పేదలకు గ్రామాల లో 3 సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ అన్నారు. శనివారం శనివారం మంగళగిరి పట్టణంలోని నాలుగో వార్డు జండా చెట్టు సెంటర్ వద్ద నిరుపేద నుంచి నివేశ స్థలాల కోసం ప్రజలు సమర్పించిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జంగాల మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో పేదలకు గ్రామాలలో మూడు సెంట్లు పట్టణాలలో రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించి ఇంటి నిర్మాణం కోసం 5 లక్షలు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జంగాల డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హామీ ఇస్తూ ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షల తొక్కున ఇస్తామని చెప్పడం జరిగింది. ఇంటి ఫలాలు కేటాయింపులో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సానుకూలమే. సిమెంట్, ఇసుక, ఇటుక, ఇనుము, కంకర, తదితర సామాగ్రి ధరలు పెరిగిన రీత్యా ఐదు లక్షలకు పెంచి గృహ నిర్మాణానికి రుణం మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పేదల ఇళ్ల నిర్మాణానికి సిమెంటు ఇసుక, ఇనుము, ఇసుక, కంకర, ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలి అని ఆయన కోరారు. రోడ్లు విద్యుత్, త్రాగునీరు, డ్రైనేజ్ పారుదల వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని జంగాల ప్రభుత్వాన్ని కోరారు. ఈనెల 18వ తేదీన అర్జీలను గ్రామ, వార్డు సచివాలయాల వద్ద వ్యక్తిగతంగా అందజేసి, సచివాలయాల వద్ద జరుగు ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొనాలని జంగాల పిలుపునిచ్చారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన సెంటు స్థలం పేదల నివాసానికి ఏమాత్రం సరిపోదని ప్రభుత్వానికి చెప్పినప్పటికీ మొండిగా ముందుకెళ్లిందని ఆయన అన్నారు. ఇంటి నిర్మాణానికిచ్చే ఆర్థిక సాయం కూడా కేవలం 1,80,000 మాత్రమే ప్రకటించిందని ఆయన అన్నారు. ఆ ఆర్థిక సహాయంతో పునాదులు కూడా పూర్తి చేయలేరని పేదవారు కూడా ఇంటి నిర్మాణం చేపట్టలేదని ఆని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల పట్టాలు నిరుపయోగంగా మారాయని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం పట్టణాల్లో గ్రామాలలో నివాసయోగ్యంగా గృహ నిర్మాణానికి అనువైన ప్రాంతాలలో స్థలాలు గుర్తించి నిరుపేద ప్రజలకు ఇవ్వాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు, నాలుగో వార్డ్ శాఖ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, ముక్కంటి, దొడ్డి ఈశ్వరరావు, దేవర వెంకటేశ్వర్లు, తోట శివశంకర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై ఆవులు నియంత్రణకు
నాలుగు ప్రత్యేక టీములు
- కమిషనర్ పులి శ్రీనివాసులు

కార్పొరేషన్, నవంబర్ 16 (ఆంధ్రపత్రిక) : గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో వీధులలో సంచరించు ఆవులు, దూడలు, గేదెలు, ఎద్దులు నియంత్రణ కొరకు శానిటరీ ఇన్ స్పెక్టర్ల పర్యవేక్షణలో 4 ప్రత్యేక టీములను ఏర్పాటుచేసి ప్రతిరోజు 2 వాహనములలో పట్టి వెంగళాయపాలెం నగర పాలక సంస్థ వారు ఏర్పాటు చేసిన గోశాలకు తరలించి బందెలదొడ్డి నిర్వహణ జరుగుచున్నదని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు.వీటి సంరక్షణ కొరకు కొందరు వర్కర్లను నియమించి పశుగ్రాసము, మంచినీరు, వైద్యము, ఆహారము అందించుట జరుగుచున్నది. నగర పాలక సంస్థ చేపడుతున్న ప్రత్యేక చర్యలలో భాగంగా ట్రాఫిక నిబంధనల ప్రకారం ప్రజలకు అసౌకర్యం కలుగకుండా, వాహన చోదకులకు సమస్యలు తలెత్తకుండా వీధులలో సంచరించు ఆవుల యజమానులకు ది.16-11-2024 తేదీన శ్రీయుత కమీషనరు ఛాంబరు నందు తూర్పు శాసన సభ్యులు శ్రీ నజీర్ అహ్మద్ నగర పాలక సంస్థ ప్రజారోగ్య అధికారులతో సమావేశము నిర్వహించుట జరిగినది. ఆవులు, దూడలు, గేదెలు, ఎద్దులు యజమానులు వారి యొక్క స్వంత స్థలములో మాత్రమే ఉంచుకొనవలసినదిగా కోరడమైనది, వీధులలో వదిలిన యెడల వాటిని పట్టి బందెలదొడ్డికి తరలించుట జరిగుననియూ, పట్టిన వాటిని విడిపించుకోవాలంటే వాటి యజమాని ఆధార్ కార్డు, నోటరీ, సచివాలయ సిబ్బంది విచారణ రిపోర్టు ఆధారంగానే వారివి అని నిర్ధారించిన తదుపరి అపరాధ రుసుముతో వదిలివేయుట జరుగును. మరలా అదే ఆవుని వీధులలో వదిలినయెడల యజమానికి అప్పగించబడదు, పట్టిన ఆవు కొరకు 10 రోజుల వరకు ఎవరూ రాని యెడల దానిని వీధి ఆవుగా పరిగణించి మున్సిపల్ చట్టము సెక్షన్ 510 ప్రకారము వేలం నిర్వహించబడును. గత 10 రోజులలో నగర పాలక సంస్థ సిబ్బంది 109 ఆవులను పట్టుట జరిగినది. యజమానుల సమావేశములో శ్రీయుత కమీషనరు గారు మున్సిపల్ నిబంధనల ప్రకారము వారిపై తగు చర్యలు ఉంటాయని కాబట్టి గో-యజమానులు నగర పాలక సంస్థకు సహకరించి వీధులలో వదలకుండా చూసుకొనవలసినదిగా హెచ్చిరించినారు.ఈ సమావేశమునకు ప్రభుత్వ పశు వైద్య జాయింట్ డైరక్టర్ మరియు డిప్యూటీ డైరక్టర్ హాజరయి ప్రస్తుతము వీధులలో సంచరిస్తున్న జంతువులకు లంప్ స్కిన్ అను వైరస్ ప్రబలి ఉన్నదని, దానివలన మరణాలు సంభవిస్తాయిని వాటికి ఉచితంగా వ్యాక్సిన్ వేయబడునని, వాటిని ఉంచు ప్రదేశములు దోమలు, ఈగలు రాకుండా మెష్ లు వాడాలని, చుట్టు ప్రక్కల పరిశరాలు సున్నం, బ్లీచింగ్ చల్లుకొనవలసినదిగా సూచించినారు.సదరు సమావేశములో వెటర్నరీ వైద్యాధికారులు, నగర పాలక సంస్థ సి,య,హెచ్.ఓ డాక్టర్ శోభారాణి, యం,హెచ్.ఓ డాక్టర్ రవి కుమార్, ప్రజారోగ్యశాఖాధికారులు పాల్గొన్నారు.

ప్లాన్ ప్రకారం నిర్మాణాలు చేపట్టాలి
- కమిషనర్ పులి శ్రీనివాసులు

కార్పొరేషన్ నవంబర్ 16 (ఆంధ్రపత్రిక) : గుంటూరు నగర పాలక సంస్థ అనుమతించిన ప్లాన్ ప్రకారం నిర్మాణాలు ఉండాలని, ర్యాంపులతో డ్రైన్లు ఆక్రమించకుండా చూడాలని నగర కమీషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళికా అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం రోజువారి పర్యటనలో భాగంగా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు తనిఖీల నిమిత్తం శ్యామల నగర్, బృందావన్ గార్డెన్స్,రెడ్డిపాలెం ప్రాంతాలలో పర్యటించి, నిబంధనల ప్రకారం అనుమతించిన భవన నిర్మాణాలు ఉన్నది లేనిది ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. అపార్ట్మెంట్ల వద్ద ర్యాంపులు డ్రైన్లు మరియు రోడ్లు పైకి ఉండుట గమనించి, వెంటనే ర్యాంపులు తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. అనతరం పర్యటనలో భాగంగా గుజ్జనగుండ్ల సెంటర్ నుండి చేబ్రోలు హనుమయ్య కంపెనీ వరకు తొలగించిన వీధి వ్యాపారులు మరియు పట్టణ ప్రణాళిక అధికారులతో కలిసి పర్యటించి, ట్రాఫిక్ అనంతరాయం కలుగకుండా వెడింగ్ హాకర్స్ జోన్స్ ఏర్పాటు చేయాలని ప్రణాళిక మరియు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గుజ్జనగుండ్ల జంక్షన్ నందు తొలగించిన తోపుడు బండ్ల వీధి వ్యాపారులకు హాకర్ వెండింగ్ జోన్స్ 3 రోజుల్లో వీధి వ్యాపారదారులకు ప్రత్యేకంగా స్ట్రీట్ వెండింగ్ జోన్లు ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేస్తున్నామని, ప్రతి ఒక్క వీధి వ్యాపారి రోడ్లు మరియు డ్రైన్లు అక్రమించకుండా సహకరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ప్రణాళిక అధికారులు మార్కింగ్ వేయాలని, ఇంజనీరింగ్ అధికారులు ప్లాట్ ఫారం ఏర్పాటు చేయాలని ఆదేశించారు.సదరు పర్యటనలో కార్పొరేటర్ మానం పద్మశ్రీ , సిటీ ప్లానర్ రాంబాబు, ఎ.సి.పి రహమాన్, టి.పి.యస్ సత్యనారాయణ, డి.ఈ.ఈ లు, ఎ.ఈ లు , బిల్డింగ్ ఇన్స్పెక్టర్లు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలోని సమస్యలను పరిష్కరిస్తాం :ఎంపీడీవో

రాజుపాలెం, నవంబర్ 16 (ఆంధ్రపత్రిక) : ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన మండలంలోని సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని స్థానిక ఎంపీడీవో జి.వి.సత్యనారాయణ శనివారం అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అధికారులు సర్వసభ్య సమావేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి అధ్యక్షత వహించి పలు అంశాలపై ప్రసంగించారు. ముఖ్యంగా మండలంలో ప్రధాన సమస్యగా త్రాగునీటి కొరత ఉందని, సంబంధిత ప్రజా సమస్యలపై ప్రజాప్రతినిధులు అధికారులు చర్చలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఎన్. దుర్గేశ్వర రావు, ఎంఈఓ మల్లికార్జున శర్మ, తదితర ప్రజాప్రతినిధిలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్క టీడీపీ కార్యకర్త సభ్యత్వం నమోదు చేసుకోవాలి

చెరుకుపల్లి నవంబర్ 16 (ఆంధ్రపత్రిక) ; ప్రతి కార్యకర్త టిడిపి సభ్యత్వం తీసుకోవాలని కొనకాల రవి కిరణ్ అన్నారు. రాష్ట్ర రెవిన్యూ మంత్రివర్యులు అనగాని సత్య ప్రసాద్ ఆదేశాల మేరకు, సీనియర్ నాయకులు అనగాని శివప్రసాద్ సహకారంతో బులుసుల పాలెం పంచాయతీ పరిధిలో మెట్ట గౌడ పాలెంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కొనకాల రవికిరణ్ ప్రారంభించి మాట్లాడుతూ తెలుగుదేశం కార్యకర్తలు 100 రూపాయలతో సభ్యత్వం తీసుకున్న వారికి ప్రమాద బీమా కింద ఐదు లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పేరం శంకర్ మాట్లాడుతూ టిడిపి నాయకులు కార్యకర్తలు, ప్రతి ఒక్కరూ సభ్యత్వాన్ని వినియోగించుకోవాలని ఆయన అన్నారు

గ్రంధాలయాలు ఆధునిక దేవాలయాలు

పిడుగురాళ్ల-2 నవంబర్ 16 (ఆంధ్రపత్రిక) : గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని ఆ దేవాలయాలపై ఆధారపడి చదువు సాగించిన వారు జీవితాంతం సుఖంగా ఉంటారని హెచ్ఎం శ్రీనివాస రావు పేర్కొన్నారు. గ్రంథాలయాధికారి రాజశేఖర్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సురేష్ తో కలిసి ఆయన హాజరయ్యారు. ముందుగా గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అఖిలభారత విద్యార్థి సంఘం 49వ రాష్ట్ర మహాసభలు

పిడుగురాళ్ల నవంబర్ 16 (ఆంధ్రపత్రిక) : ఏఐఎస్ఎఫ్ అఖిలభారత విద్యార్థి సంఘం 49వ రాష్ట్ర మహాసభలు నవంబర్ 27 నుండి 30 వరకు మూడు రోజులు విజయనగరంలో జరిగే మహాసభ లను విజయవంతం చేయాలని ఈరోజు పిడుగురాళ్ల పట్టణంలోని కుమ్మరిపాలెం నారాయణ స్కూల్ దగ్గర ఏఐఎస్ఎఫ్ విద్యార్థులు పోస్టల్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సభను మేధావులు, ప్రజాసంఘాలు, విద్యార్థులు, విద్యార్థిని విద్యార్థి సంఘాలు, కళాకారులు ఈ సభను విజయవంతం చేయవలసిందిగా పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గ ఏఐఎస్ఎఫ్ సెక్రటరీ మధు, నియోజకవర్గ ప్రెసిడెంట్ సాయి, పిడుగురాళ్ల పట్టణ ప్రెసిడెంట్ చింటూ, సెక్రటరీ రాజు, పట్టణ ప్రెసిడెంట్ వేణు, పిడుగురాళ్ల పట్టణ సిపిఐ కార్యదర్శి జె కృష్ణ నాయక్, సిపిఐ పట్టణ మహిళా సమైక్య నాయకురాలు పి సుజాత తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన వరి పంట పొలాలను పరిశీలించిన
తహసిల్దార్ ఆశ్రపున్నిసాబేగం

బెల్లంకొండ, నవంబర్ 16 (ఆంధ్రపత్రిక) : నష్టపోయిన వరి పంట పొలాలను తహసిల్దార్ అశ్రపున్నిసా బేగం వ్యవసాయ శాఖ అధికారి డి కృష్ణయ్య సందర్శించారు. బెల్లంకొండ మండలంలోని నాగిరెడ్డి పాలెం గ్రామ సమీపంలో ఎర్రబాలెం మేజర్ కాలువకు గండిపడటంతో వరి పంట పొలాలను నీరు చుట్టుముట్టడంతో 14. 61 ఎకరాలలో పంట నష్టం జరిగిందని పంట నష్టం అంచనా నివేదికలను తదుపరి చర్యలు నిమిత్తం ఉన్నతాధికారులు పంపుతున్నట్లు తహసిల్దార్ తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ పంట పొలంలో నీరు నిల్వ ఉండకుండా పల్లం వైపు వరకలవలు తీసి నీటిని బయటకు పంపి పడిన వాటిని నాలుగైదు దుబ్బులుగా కలిపి కట్టి పంట నష్టాన్ని కొంతవరకు తగ్గించుకోవచ్చని ఆయన రైతులకు సూచించారు ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి వెంకయ్య, గ్రామ వ్యవసాయ సహాయకుడు అయ్యప్ప, టిడిపి మండల కోరు కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి, వెంకటరామిరెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖలో నిఘా
విభాగ విధులు కీలకం

నిబద్ధతతో సమర్థవంతంగా విధులు నిర్వహించాలి
ముందస్తు సమాచారాన్ని వేగవంతంగా సేకరించాలి

బాపట్ల నవంబర్ 16 (ఆంధ్రపత్రిక) : జిల్లా పోలీస్ శాఖలో నిఘా విభాగం విధులు కీలకమని జిల్లా ఎస్పీ తుషార్ దూడి తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా నిఘా విభాగ పోలీసులతో ఎస్పీ సమీక్షా నిర్వహించారు. నిఘా విభాగంలో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది ముందస్తుగా నిగూడ రహస్య సమాచారం సేకరించవలసిన విధానం, వ్యవహరించవలసిన తీరు తదితర విషయాల గురించి సమీక్షించి తగిన సూచనలు, మెళకువలు తెలియజేసినారు. పోలీస్ శాఖ సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు, అసాంఘిక కార్యకలాపాలు కట్టడి చేయడానికి ముందస్తు సమాచారం వేగవంతంగా సేకరించడం కీలకమని ఎస్పీ తెలిపారు. ముందస్తు సమాచారం సేకరించడం వలన ఆదిలోనే నేరాలను అరికట్టి శాంతి భద్రతలను పరిరక్షించవచ్చునన్నారు. నిత్యం ప్రజలతో మమేకమై గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తులు, చెడునడత కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. అట్టివారు ఏదైనా నేరానికి పాల్పడే అవకాశం ఉందని గ్రహిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల అమ్మకం, వినియోగం వంటి వాటి మీద ప్రత్యేకంగా నిఘా ఉంచాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా పేకాట, కోడిపందాలు వంటి ఇతర అసాంఘిక కార్యకలాపాలు గురించిన ముందస్తు సమాచారం ఉన్నతాధికారులకు అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. ఖచ్చితత్వంతో కూడిన సమాచారం వేగవంతంగా సేకరించి అందించాలన్నారు. ఎవరైనా విధులలో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించిన, నిగూడ రహస్య సమాచారం సేకరించడంలో అలసత్వం వహించిన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో ఏస్.బి సిఐ నారాయణ, జిల్లా ఏస్.బి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిసి రోడ్లను నాణ్యతతో నిర్మించాలి
- కలెక్టర్ మురళి

బాపట్ల నవంబర్ 16 (ఆంధ్రపత్రిక) : ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన సిసి రోడ్లను నాణ్యతతో నిర్మించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాపట్ల మండలం పశ్చిమ బాపట్ల వైయస్సార్ నగర్ లో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న అంతర్గత సిసి రోడ్లను ఆయన పరిశీలించారు.వలస కూలీలను నివారించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఉపాధి లేదనే కారణంతో జిల్లాను విడిచి ఎవరు వెళ్లరాదన్నారు. పొరుగు జిల్లాలకు లేదా పొరుగు రాష్ట్రాలకు వెళ్లకుండా స్వగ్రామంలోనే వారికి ఉపాధి పనులు చూపించాలని అధికారులను ఆయన ఆదేశించారు. బాపట్ల జిల్లాలోనూ వలసలు ఉన్నట్లు తెలియడంపై గ్రామంలో ఆయన పర్యటించారు. నిరుపేదల కొరకు మాత్రమే ఉపాధి హామీ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. చేపట్టే నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. కూలీలకు కనీస వేతనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి పనులలో అక్రమాలు చోటుచేసుకోకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఆయన వెంట డ్వామా పిడి విజయలక్ష్మి, తహసిల్దార్లు సలిమా, ఇంజినీర్లు, తదితరులు ఉన్నారు.సి సి రోడ్లను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు.

చిన్నారుల ఆరోగ్య స్క్రీనింగ్
వైద్య అధికారి కె వి కోటేశ్వరరావు

బెల్లంకొండ,నవంబర్ 16 (ఆంధ్రపత్రిక) : రాష్ట్రీయ బాలల స్వస్థ కార్య క్రమంలో భాగంగా ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు ఆరో తరగతి నుండి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల నందు విద్యను అభ్యసించుచున్న బాలబాలికలు అందరికీ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఎం ఎల్ హెచ్ పి ఆశ కలిసి వైద్య పరీక్షలు స్క్రీనింగ్ ప్రారంభించిన వైద్యాధికారి ఆమ్ సుధర్ పర్యవేక్షణలో శనివారం చంద్రాజుపాలెం ప్రాథమిక ఉన్నత పాఠశాల నందు ప్రారంభించారు. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం చిన్నారులకు సాధారణంగా వచ్చే రుగ్మతలు చర్మవ్యాధులు రొమాంటిక్ దంత సంబంధిత వ్యాధులు చెవి సంబంధిత వ్యాధులు శ్వాసకోశ మూర్చ వ్యాధులను త్వరితగతిన స్క్రీనింగ్ చేసి వారికి సరి అయిన వైద్యం కొరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేయడం వారికి చికిత్స అందించి సత్వరమే వ్యాధులను నిర్మూలించవచ్చని అన్నారు. ఆమ్ సుధర్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ఉదయాన్నే దంతములు బ్రష్ తో శుభ్రపరచుకోవాలని మరియు బహిర్భూమికి వెళ్ళినప్పుడు వచ్చిన తదుపరి చేతులను సబ్బుతో శుభ్రపరుచుకోవాలని పరిసరాలలో నీరు నీరు నిలవ ఉండటంతో వాటి ద్వారా దోమల వ్యాప్తి చెంది డెంగ్యూ మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తి చెంది అవకాశం ఉన్నందున ఉంచుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ భాష ఆశా ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు

నియోజకవర్గ సమస్యలపై శాసన సభ సమావేశంలో గళమెత్తిన పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు నవంబర్ 16 (ఆంధ్రపత్రిక) : ఏపి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో నియోజకవర్గ సమస్యల పై పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ గళమెత్తారు. శాసన సభ జీరో అవర్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజధానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి అని పేరు పెట్టారని రాజధాని పేరులోని అసలైన అమరావతి పెదకూరపాడు నియోజకవర్గంలో ఉందన్నారు. దానిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. ప్రసిద్ధ అమరేశ్వర స్వామి కొలువై ఉన్న బౌద్ధరామంగా,ఉత్తర కృష్ణా ప్రవాహినిగా పేరొందిన అమరావతి ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి ఆదేశాలతో తాను మినీ మాష్టర్ ప్లాన్ ను సిద్ధం చేసినట్టు చెప్పారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వచ్చిన ఎమ్మెల్యే,ఎమ్మెల్సీలు అమరావతి ప్రాంతాన్ని సందర్శించాలని కోరారు. నదీ తీరాన ఉన్న నియోజకవర్గంలోని 40 గ్రామాలకు ఎత్తిపోతల పథకాల ద్వారా త్రాగు,సాగునీటిని అందించాలని ఆయన కోరారు. ఇసుక రవాణాతో నియోజకవర్గంలోని ప్రధాన రోడ్లు సైతం పాడై పోయాయని వాటి పునరుద్ధరణకు నిధులను కేటాయించాలని కూటమి ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శాసన సభ లో కోరారు.

20 వేల మొక్కలు నాటాలి - కలెక్టర్

బాపట్ల నవంబర్ 16 (ఆంధ్రపత్రిక) : సముద్ర తీరం వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం కొరకు విస్తృతంగా మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. బాపట్ల, చీరాల మండలాలలో జిల్లా కలెక్టర్ శనివారం విస్తృతంగా పర్యటించారు. కార్తీక మాసం సందర్భంగా బాపట్ల సూర్యలంక బీచ్ ని సందర్శించారు. కార్తీక మాసంలో పర్యాటకులు విస్తృతంగా బీచ్ కి వస్తున్నందున వసతులను పరిశీలించారు. పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తున్నందున బీచ్ వద్ద గజ ఈతగాలను ఉంచామన్నారు. స్నానాలకు ఏర్పాట్లు, స్నానాలు ఆచరించిన తర్వాత దుస్తులు మార్చుకోవడానికి ఏర్పాట్లపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. బీచ్ వద్ద అనువైన మొక్కలు నాటాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటి, పర్యాటకులకు మరింత ఆహ్లాదాన్ని పెంచేలా తీర్చిదిద్దాలన్నారు. బీచ్ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. బాపట్ల పరిధిలోని సూర్యలంక, వాడరేవు, రామాపురం, పాండురంగాపురం బీచ్ లు పర్యాటకులను ఆకట్టుకునేలా చేయాలన్నారు. డ్వామా, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా పైలెట్ కింద 20 వేల మొక్కలు నాటాలన్నారు. బీచ్ వద్ద కనీసం 10 ఎకరాలలో మొక్కల నాటడానికి చర్యలు తీసుకోవాలన్నారు. బీచ్ లో భద్రత ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. సముద్ర మత్స్య సంపద విక్రయాలను ఆయన పరిశీలించారు. వసతి సౌకర్యాణపై ఆరా తీశారు.చీరాల వాడరేవును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచేలా చూడాలన్నారు. రెవెన్యూ అసోసియేషన్ అతిథి గృహాన్ని నవీకరించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సంపద సృష్టించే కార్యక్రమంలో భాగంగా అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. వాడరేవులోని పోర్టు పోరంబోకు భూమిలో విస్తృతంగా మొక్కలు నాటాలని ఆదేశించారు. పర్యాటకులను మరింతగా ఆకర్షించేలా సుందరీకరణ చేస్తామన్నారు.చీరాల పట్టణంలోని ప్రధాన రహదారిలో శిథిలావస్థలో ఉన్న గ్రామ చావడి భవనాన్ని తొలగించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తామని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. సంపద సృష్టిలో భాగంగా భవనం కింద భాగంలో షాపింగ్ కాంప్లెక్స్, పై అంతస్తులో ప్రభుత్వ కార్యాలయాలు ఉండేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. తక్షణమే సంబంధిత ఏర్పాట్లు చేయాలని ఆర్డీవోను ఆయన ఆదేశించారు. ఆయన వెంట డ్వామా పిడి విజయలక్ష్మి, అటవీశాఖ అధికారి భీమయ్య, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్, తహసిల్దార్లు గోపికృష్ణ, సలిమా, తదితరులు ఉన్నారు.

పంటను ధ్వంసం చేసిన కేసులో నిందితుడు అరెస్ట్

నిందితునిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు
సత్తెనపల్లి డిఎస్పి ఎం హనుమంతరావు వెల్లడి

సత్తెనపల్లి, నవంబర్ 16 (ఆంధ్రపత్రిక) : చేతి కందిన ప్రత్తి పంటను ధ్వంసం చేసిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సత్తెనపల్లి డి.ఎస్.పి ఎం హనుమంతరావు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆయన శనివారం పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అమరావతి మండలం ఉంగుటూరు గ్రామానికి చెందిన దార్ల వీరబాబు, ఇదే గ్రామానికి చెందిన ఓ రైతు పొలంను కౌలుకు తీసుకున్నాడు. తను కౌలుకు తీసుకున్న రెండున్నర ఎకరాలలో ప్రత్తి పంట వేశాడు. ఈ ఐదు నెలల కాలంలో సుమారు లక్ష రూపాయల వరకు పంటపై పెట్టుబడి పెట్టినట్లు దార్ల వీరబాబు తెలిపారు. ఎకరాకు పది కింటాలు చొప్పున పత్తి పంట దిగుబడి కానున్న సమయంలో ఇదే గ్రామానికి చెందిన పి. శేషగిరిరావు అనే రైతు మూడు రోజుల క్రితం తన వద్ద ఉన్న యంత్రాల సహాయంతో అర్ధరాత్రి సమయంలో పంటను పూర్తిగా ధ్వంసం చేశారని వీరబాబు వాపోయారు. ఉదయం పొలానికి వెళ్లి చూసిన వీరబాబు ఒక్కసారిగా కంగుతిని, ఈ సమాచారాన్ని కాస్త అమరావతి పోలీసులకు చేరవేశారు. తనకు న్యాయం చేయాలని వీరబాబు పోలీసులను ఆశ్రయించారు. సత్తెనపల్లి డిఎస్పి ఎం హనుమంతరావు, అమరావతి సీఐ ఎం శ్రీనివాసరావు లు తమ సిబ్బందితో కలిసి పంటపొలాన్ని పరిశీలించి, నిందితునిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా శనివార నిందితుడిని అరెస్టు చేసి, సత్తెనపల్లి కోర్టులో హాజరు పరిచినట్లు డి.ఎస్.పి విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. నిందితుడు శేష గిరి రావుకు, పొలం ను కౌలుకు ఇచ్చిన రైతుకు మధ్య వివాదం ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

డిబిఆర్సీ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలు

సత్తెనపల్లి, నవంబర్ 16(ఆంధ్రపత్రిక) : మండల పరిధిలోని కంటేపూడి గ్రామం లో ఎంపీపీ స్కూల్ నందు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం బాలల హక్కుల వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కోఆర్డినేటర్ మేడే వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఉమాదేవి పాల్గొని మాట్లాడుతూ ఆడపిల్లలు ఉన్నత స్థాయికి ఎదగాలంటే చదువు అవసరం, చెడ్డ అలవాటులకు దూరంగా ఉండాలి, విద్య, పౌష్టికాహారం, ఆరోగ్యం సంరక్షణ, విద్యార్థుల హక్కుల గురించి వివరించారు. డిబిఆర్సి కోఆర్డినేటర్ మేడే వెంకట రమణ మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండకుండా పెళ్లి చేయకూడదని, మగపిల్లలకు 21 రాకుండా పెళ్లి చేయటం చట్టరీత్యా నేరమని, చేసిన వారు ఈ పెళ్లికి సహకరించినటువంటి ప్రతి ఒక్కరు కూడా శిక్షార్హులని బాల్య వివాహాలను ప్రోత్సహించడం మంచిది కాదు అని వారి భవిష్యత్తు మార్చుకోవడానికి ఆ వయసు ఉపయోగపడుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను
సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలి
హెచ్ఎం సాంబశివరావు



నాదెండ్ల నవంబర్ 16 (ఆంధ్రపత్రిక) : గ్రామస్తులు విద్యార్థులు, గ్రంథాలయాలను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సాంబశివరావు అన్నారు. మండల కేంద్రమైన నాదెండ్ల పంచాయతీ కార్యాలయం పక్కనున్న ప్రాథమిక పాఠశాలలో మూడవ రోజైన శనివారం 57వ జాతీయ గ్రంథాలయాల వారోత్సవాల భాగంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. గ్రంథాలయాలు అనేవి కొన్ని దశాబ్దాల నుండి భారతదేశంలో అన్ని ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి అన్నారు. ఈ గ్రంథాలయాల ద్వారా ఎంతోమంది విజ్ఞానాన్ని పొందుతున్నారు అన్నారు. విద్యార్థులు ప్రాథమిక దశ నుండి గ్రంథాలయంలో పుస్తకాలు చదవడం అలవాటు పడాలి అన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాల్లో పుస్తకాలను తీరుకున్న సమయంలో ఇంటికి తెచ్చుకో నాయనా వాటిని చదువుకొని తిరిగి మరలా గ్రంథాలయానికి అప్పగించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేయని తప్పుకు శిక్ష అనుభవించా

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చాను. దాన్ని అమలు చేయడం వల్ల టెలికాం రంగం వృద్ధి చెందింది. దేశంలోనే తొలిసారిగా వాట్సాప్ గవర్నెన్స్ విధానాన్ని తీసుకొస్తున్నాం. దీని ద్వారా ప్రజలకు చేరువగా, సులువుగా మరిన్ని సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. తద్వారా ప్రజా సేవలను చివరి వ్యక్తి వరకు అందించాలన్నది మా లక్ష్యం. ఈ యుగంలో సమాచారమే ఓ పెద్ద నిధి. ఏఐ, డీప్ టెక్నాలజీలను ఉపయోగించి అన్ని రంగాల్లో పరిష్కారాలు సాధించవచ్చు. స్మార్ట్ ఫోన్ చేతిలో ఉంటే ప్రపంచంలో ఏ మూల ఉన్నా మన పనులు చేసుకుంటూ పోవచ్చని అన్నారు. ఇప్పుడు చైనా, జపాన్ సహా అనేక ప్రపంచ దేశాల్లో వయోధికులు ఎక్కువైపోయారు. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల్లో ఈ సమస్య ప్రారంభమైంది. ఫెర్టిలిటీ రేటు ఇక్కడ తగ్గిపోతోంది. సాధారణంగా ఇది 2.1 కంటే ఎక్కువగా ఉంటే సమస్య ఉండదు. ప్రస్తుతం బోర్డర్ లైన్‌లో జననాల రేటు ఉంది. ఇది కాస్త తగ్గితే జపాన్, చైనా మాదిరి సమస్య మన దేశంలో కూడా మొదలవుతుంది. భారతదేశంలో 145 కోట్ల జనాభా ఉంది. పాపులేషన్ మేనేజ్‌మెంట్ చేస్తే ప్రపంచంలో మనల్ని కొట్టేవారే ఉండరు. మనం ఒక ప్రణాళికాబద్ధంగా అమల్లోకి తీసుకువస్తే.. 30-40 కోట్ల మంది భారతీయులు ప్రపంచంలో అన్ని మూలలకు వెళ్లి పని చేసి దేశానికి ఆదాయం తీసుకొస్తారు. బ్రిటీష్ వాళ్లు భారత్‌కి వచ్చి పరిపాలించిన తరహాలో మనం కూడా ప్రపంచదేశాలకు వెళ్లి ఆ దేశాలను ఏలుతాం. ఒకప్పుడు ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకుండా నిబంధనలు పెట్టాను. ఇప్పుడు ఆ నిబంధన తొలగించి... కనీసం ఇద్దరు పిల్లలు ఉంటే తప్ప పోటీకి అర్హత లేదని పెట్టాలని చెబుతున్నా. మానవ వనరులు, నైపుణ్యాల అభివృద్ధి జరగాలి.. దానికి అనుగుణంగా పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగ కల్పన జరగాలి. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఒకటో తరగతి నుంచే ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి.

తెలుగుదేశం పార్టీ తొలి నుంచీ దేశ రాజీయాల్లో కీలక పాత్ర పోషించింది. దేశాభివృద్ధి కోసం తెలుగుదేశం ఎప్పుడూ ముందుంటుంది. భాజపాకి వాజ్‌పేయీ పునాదులు వేస్తే.. నరేంద్రమోదీ బలోపేతం చేశారు. మోదీ నేతృత్వంలో దేశం ఆర్థికంగా బలంగా తయారవుతోంది. రానున్న రోజుల్లో ప్రపంచంలో భారతదేశం రెండు, మూడు స్థానాల్లో ఉంటుంది. నరేంద్రమోదీ మా నాయకుడు. ఆయన నేతృత్వంలోనే ముందుకు వెళ్తాం. హరియాణా సీఎం ప్రమాణస్వీకారం చేసిన తర్వాత ప్రధాని ఆధ్వర్యంలో ఎన్డీయే కూటమి సీఎంల సమావేశం జరిగింది. నాలుగు గంటల పాటు జరిగిన సమావేశంలో 2029 ఎన్నికలకు ఏ విధంగా సమాయత్తం అవ్వాలనే విషయంపై మోదీ అందరి అభిప్రాయాలు తీసుకున్నారు. ఏపీలో కూడా 2029 ఎన్నికలకు ఇప్పటి నుంచే సమాయత్తం అవుతున్నాం. ఆంధ్రప్రదేశ్ లో గత ప్రభుత్వ పాలన పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, అసంతృప్తితో పాటు.. ఎన్డీఏ కూటమిపై జనానికి భరోసా కలిగింది.

ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. ఎన్నికల ఫలితాలు ఏకపక్షంగా వస్తాయని మేం ముందుగానే ఊహించాం. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా 57 శాతం ఓట్లు.. 93 శాతం సీట్లు కూటమికి ప్రజలు ఇచ్చారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా పవన్ కల్యాణ్ మూడు పార్టీలను కలిపారు. దాని ఫలితం ఇప్పుడు చూశాం. జాతీయ స్థాయిలో కూడా భాజపాకి పూర్తి మెజారిటీ వస్తుందని అనుకున్నామని ఆయన అన్నారు.

పది దాటినా చీకటి.. చీకటి

న్యూఢిల్లీ, నవంబర్ 16 (ఆంధ్రపత్రిక): దేశ రాజ ధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకు పెరుగుతున్నది. గాలిలో తేమ పెరిగినా కొద్ది కాలుష్యం తీవ్రమవుతున్నది. ప్రస్తుతం ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 300 దాటింది. భజన్‌పురా ఏరియాలో ఉదయం 10 గంటలైనా మంచుకప్పుకుని చీకటి చీకటిగానే ఉంది. రోడ్లపై విజుబిలిటీ సరిగా లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎయిర్ పొల్యూషన్‌ను తగ్గించేందుకు ఢిల్లీ సర్కారు, అధికార యంత్రాంగం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం పెద్దగా కనిపించడం లేదు. గ్రేప్ నియమాలు కూడా పొల్యూషన్‌ను కంట్రోల్ చేయలేక పోతున్నాయి.

బ్రెజిల్ పర్యటనకు ప్రధాని నరేంద్రమోడీ

(మొదటిపేజీ తరువాయి)

నా పర్యటన ఒక అవకాశంగా నిలుస్తుంది. ప్రజాస్వామ్యం, భాగస్వామ్య విశ్వాసం గురించి నేను భారతీయ సమాజాన్ని, నైజీరియాలోని స్నేహితులను కలవడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను." అంటూ ప్రధాని ట్వీట్ చేశారు. నవంబర్ 18-19 తేదీల్లో బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డా సిల్వా ఆతిథ్యం ఇవ్వనున్న జీ-20 సమ్మిట్‌లో పాల్గొనేందుకు ప్రధాని తదుపరి బ్రెజిల్‌లోని రియో డి జెనీరోకు వెళతారు. ఆ తర్వాత ప్రధాని గయనాలో పర్యటించనున్నారు. 1968 తర్వాత ఒక భారత ప్రధాని ఈ దేశానికి వెళ్లడం ఇదే తొలిసారి. అక్కడ ప్రవాసులను ఉద్దేశించి ప్రసంగించడంతో పాటు గయానా పార్లమెంట్‌లో ప్రసంగిస్తారు. తన పర్యటనలో మోడీ 2వ ఇండియా-కారికోమ్ సమ్మిట్‌లో కరేబియన్ దేశాల నాయకులతో చర్చించనున్నారు.

రామోజీరావు బాటలు నేటికీ ఆదర్శం

హైదరాబాద్,నవంబరు 16 (ఆంధ్రపత్రిక): విలువలతో కూడిన జర్నలిజానికి నిదర్శనంగా నిలిచిన బహుముఖ ప్రజ్ఞాశాలి రామోజీరావు అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కొనియాడారు. రామోజీరావు జయంతి సందర్భంగా నివాళులర్పించారు. "అడుగు పెట్టిన ప్రతి రంగంలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. మీడియా మొదలుకుని అనేక రంగాల్లో వారు వేసిన బాటలు నేటికీ ఆదర్శంగా, ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి. వ్యక్తిగా మొదలై శక్తిమంతమైన వ్యవస్థగా ఎదిగిన రామోజీరావు జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శనీయం" అని వెంకయ్యనాయుడు తెలిపారు.

ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం

తిరువూరు, నవంబర్ 16 (ఆంధ్రపత్రిక): ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ తిరువూరు శాఖ ఆధ్వర్యంలో జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం తిరువూరులోని శ్రీ భగవాన్ మహర్షి ఆశ్రమం. అమ్మ ఆశ్రమం. దివ్యాంగుల సేవా ఆశ్రమాల్లో దివ్యాంగులు. వృద్ధులు. అనాథలకు ఆహార పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రారంభమైన రోజునే జాతీయ పత్రికా దినోత్సవంగా జరుపుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడం. జర్నలిస్ట మిత్రులు వ్రాసే వార్తల విషయంలో సంబంధిత జర్నలిస్టులపై వ్యక్తిగతంగా దృష్టి కేంద్రీకరించకుండా. చట్టబద్ధమైన చర్యలతోనే వాస్తవ అవాస్తవాలను గ్రహించే విధంగా జర్నలిస్టులకు పరోక్షంగా రక్షణగా ఏర్పాటైన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకి సంబంధించిన తదితర కార్యాచరణలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే స్టేట్ కౌన్సిల్ మెంబర్ మొహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మొహమ్మద్ అసుదుల్లా తిరువూరు నియోజకవర్గ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బద్రి ప్రధాన కార్యదర్శి విజయ్ గౌరవాధ్యక్షుడు షేక్ సైదులు సీనియర్ జర్నలిస్టు బలుసు పాటి వెంకటేశ్వరరావు మొహమ్మద్ గౌస్ సందాని కిషోర్ పాల్గొన్నారు.

వాడివేడిగా ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)

తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోన్నారు. ఈ క్రమంలో ఇప్పటికే కోస్తా జిల్లాలకు చెందిన సీనియర్ సభ్యుడు జ్యోతుల నెహ్రూ మాట్లాడిన విషయం తెలిసిందే. ఇసుక పాలసీని ఆయన తప్పు పట్టారు. దీనివల్ల ప్రభుత్వానికి మంచి పేరు రావట్లేదని తేల్చి చెప్పారు. దీనిపై పునరాలోచన చేయాల్సిన అవసరం ఉందని, ఇసుక అమ్మకాల్లో అధికారుల జోక్యాన్ని తగ్గించాలని సూచించారు. గత విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఇప్పుడు తాజాగా ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన సీనియర్ సభ్యుడు కూన రవికుమార్ గళం విప్పారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా జరిగే జీరో అవర్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. జీరో అవర్‌లో సభ్యులు లేవనెత్తే సమస్యలు, అంశాల గురించి ఎవరు నోట్ చేసుకుంటున్నారో తెలియట్లేదని అన్నారు. జీరో అవర్.. డ్రైవర్ లేని కారులా ఉందని కూన రవికుమార్ వ్యాఖ్యానించారు. దీనికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పందిస్తూ.. మంత్రులు ఉన్నారని, వాళ్లు నోట్ చేసుకుంటున్నారని, నిండు సభలో అలా అసత్యాలు మాట్లాడకూడదని హితవు పలికారు. దీనికి కూన రవికుమార్ బదులిస్తూ 10 మంది మంత్రులు ఉన్నారని, ఎవరు నోట్ చేసుకుంటున్నారని చెప్పారు. జీరో అవర్‌లో సభ్యులు లేవనెత్తే అంశాలను తాము నోట్ చేసుకున్నామంటూ ఒక మంత్రి లేచి సమాధానం ఇచ్చే సంప్రదాయం గతంలో ఉండేదని గుర్తుచేశారు. నోట్ చేసుకోకపోయినా అదొక ఆనందంగా ఉండేదని, ఇప్పుడు జీరో అవర్.. డ్రైవర్ లేని కారులా ఉందని అన్నారు. దీనిపై వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పందించారు. జీరో అవర్‌లో సభ్యులు ప్రస్తావించే అంశాలన్నీ శాఖలవారీగా మంత్రుల దృష్టికి వస్తుందని, అనంతరం దానిపై ఎలాంటి చర్యలు తీసుకున్నామనే విషయాన్ని మళ్లీ సదరు సభ్యుడికి తెలియజేస్తామని అన్నారు. ఈ సభకు ఎలాంటి సమస్యను తీసుకొచ్చారో.. వాటిని పరిష్కరిస్తామని, మళ్లీ దాని గురించి ఆ సభ్యుడికి తెలియజేస్తామనే మాట ఇస్తున్నానని, దీనిపై అనుమానాలు అక్కర్లేదని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. అనంతరం కూన రవికుమార్ మాట్లాడారు. మంత్రి నోట్ చేసుకున్న అంశాలు, వాటి పరిష్కారానికి ప్రభుత్వం నుంచి తీసుకున్న చర్యలకు సంబంధించిన సమాధానాలు కనీసం తరువాతి సభ సమావేశం అయ్యే నాటికి తమకు తెలియజేసినా తృప్తిగా ఉంటుందని, ఇది తన సలహా మాత్రమేనని చెప్పారు.

గాలి వార్తలకు చెక్ పెట్టాలి

అమరావతి, నవంబర్ 16 (ఆంధ్రపత్రిక): టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తిరుమలలో ప్రక్షాళన మొదలుపెట్టినట్టు తెలుస్తోంది. ప్రతీ విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారాయన. స్వయంగా భక్తులతో కలిసి ఆయన భోజనం చేశారు. వారి నుంచి కీలక సమాచారాన్ని తీసుకున్నారు. కొత్త చట్టాలేవీ తీసుకురాకుండా ఉన్నవాటికి పదును పెట్టాలనే ఆలోచన చేస్తున్నారు. ఇటీవల ఓ ఛానెల్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో కీలక విషయాలు బయటపెట్టారు ఛైర్మన్ బీఆర్ నాయుడు. తాము ఏ పని చేసినా బోర్డులో చర్చించిన తర్వాత, సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. టీటీడీ చాలా చట్టాలు తీసుకొచ్చిందని, కొత్తగా తీసుకొచ్చేవి ఏమీ లేవన్నారు. తిరుమలలో రాజకీయాల గురించి మాట్లాడడం కరెక్ట్ కాదని, దాన్ని పూర్తిగా బ్యాన్ చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు మనసులోని మాట బయటపెట్టారు టీటీడీ ఛైర్మన్. రాజకీయాలు మాట్లాడినవారు, వాటిని టెలికాస్ట్ చేసినవారిపై కేసులు పెట్టిస్తామన్నారు. తిరుమల పవిత్రను కాపాడడమే తమ ఉద్దేశ్యమన్నారు. గాలి వార్తలకు చెక్ పెట్టాలన్నది ఆయన ప్రధాన ఆలోచన. ప్రస్తుతం బోర్డులో చాలామంది పెద్దవాళ్లు ఉన్నారని, గతంలో పని చేసిన అనుభవం ఉందన్నారు బీఆర్ నాయుడు. శ్రీవారి ఆస్తులను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలన్నది మరో ఆలోచన. శ్రీవారి నగదు ప్రైవేటు బ్యాంకులో ఉండడం సరికాదన్నారు. పనిలోపనిగా శ్రీవాణి టికెట్లు విషయాన్ని ప్రస్తావించారు. దానికి సంబంధించిన టికెట్ల నిధులు నేరుగా శ్రీవారి ట్రస్టులో జమ అయ్యేలా మంతనాలు జరుపుతున్నారట. బోర్డు సభ్యుల ఆమోదం తర్వాత అప్పుడు ప్రభుత్వంతో మాట్లాడుతామన్నారు. భక్తులకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకునే ఆలోచనలో ఉన్నట్లు చెప్పుకొచ్చారు ఛైర్మన్ బీఆర్‌నాయుడు. శ్రీవారి దర్శనం పేరిట భక్తులను గంటల తరబడి కంటెయినర్‌లో లాక్ చేయడం కరెక్ట్ కాదన్నది ఆయన ఆలోచన. నీళ్లు, ఫుడ్, టిఫిన్ ఇస్తున్నారని అది సమస్య కాదని అన్నారు. ఒక వ్యక్తిని అన్ని గంటలు నిర్బంధించడం మానవ హక్కుల ఉల్లంఘనే అవుతుందనేది తన అభిప్రాయంగా చెప్పుకొచ్చారు. ఎంతో కష్టపడి భక్తులు తిరుమలకు వస్తుంటారని, కనీసం రెండు సెకన్ల పాటు దేవుడ్ని చూసే అవకాశం కల్పించలేకపోతున్నామని అన్నారు. అలాంటప్పుడు భక్తులకు శ్రీవారి మీద ఎలాంటి నమ్మకం కలుగుతుందని మనసులోని బాధను బయటపెట్టారు. అలాంటి భక్తులు మళ్లీ తిరుమల వస్తారా? అని అన్నారు. గతంలో తిరుమలకు వచ్చే భక్తులకు టైమింగ్ ట్యాగ్ వేసేవారని, దాన్ని ఇంప్లిమెంట్ చేయాలని భావిస్తున్నామని తెలిపారు. చాలామంది భక్తుల నుంచి సమాచారాన్ని సేకరించారాయన. తిరుమలకు వచ్చినా తమకు తృప్తిలేదని, వృద్ధులమని చెప్పినా లాగి పారేస్తున్నారంటూ మొరపెట్టుకున్నారట. టైమింగ్ ట్యాగ్ వేసి గంట లేదా రెండు సమయంలో దర్శనం జరిగేలా ప్లాన్ చేస్తున్నారట. ఎంతమంది వచ్చారన్నది ముఖ్యం కాదని, భక్తుడికి దర్శనమే ముఖ్యమంటున్నారు. దర్శనం అనేది భక్తులకు కరెక్ట్ టైమ్ ఇస్తే, చుట్టుపక్కల టెంపుల్‌ని సందర్శిస్తారని, వారికి కొంత తృప్తి కలుగుతుందని అంటున్నారు. బీఆర్ నాయుడు ఆలోచనలు కార్యరూపం దాల్చితే బోర్డు ఛైర్మన్‌గా భక్తుల మనసులో కలకాలం నిలిచిపోతారని అంటున్నారు శ్రీవారి భక్తులు.

నందమూరి వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో కార్తీకదీపోత్సవం

పెడన,నవంబర్ 16 (ఆంధ్రపత్రిక): స్థానిక వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నాడు కార్తీక మాసాన్ని పురస్కరించుకొని దీపోత్సవం నిర్వహించారు. కళాశాలలో ఉన్న ఉసిరి చెట్టు కింద పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త అనంతలక్ష్మి ప్రవచనాలు వినిపించారు. విద్యార్థులు భక్తి గీతాలు సంబంధించి నృత్యాలు చేశారు. ఉత్తమ దీపాలంకరణ చేసిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కుమార్ బాబు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాబా ప్రిన్సిపాల్ బిఆర్ఎస్ రెడ్డి వైస్ ప్రిన్సిపాల్ రాజా రమేష్ డిప్లమా ప్రిన్సిపాల్ ప్రసాద్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కళాంజలి వార్షికోత్సవ వేడుకలు

పెడన, నవంబర్ 16 (ఆంధ్రపత్రిక): స్థానిక మఠం వీధిలోని కళాంజలి హైస్కూల్ నందు యాన్యువల్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా పెడన ఎస్సై 2 రాజేంద్రప్రసాద్ గవర్నమెంట్ సివిల్ సర్జన్ డాక్టర్ వెంకటేష్ సివిల్ ఇంజనీర్ సుబ్బారావు పాల్గొన్నారు. బాలల దినోత్సవం వేడుకల సందర్భంగా నిర్వహించిన వివిధ ఆటల పోటీల విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. అలాగే 2024 మార్చి ఎస్ .ఎస్ .సి లో 592 మార్కులు సాధించి మండల ఫస్ట్‌గా నిలిచిన జోయా ముస్కాన్‌కు 588 మార్పులు సాధించిన ఆయేషా గుల్ ఫామ్‌కు వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎస్ఐ రాజేంద్రప్రసాద్ మాట్లాడు తూ పిల్లలకు చదువుతోపాటు ఆటలు ఆడించడం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన యాజమాన్యాన్ని అభినందించారు. అలాగే వివిధ ఆటల పోటీలలో బహుమతులు సాధించిన విద్యార్థుల ను అభినందించారు డాక్టర్ బి.వెంకటేష్ మాట్లాడుతూ కళాంజలి లో విద్యా ప్రమాణాలు అంతర్జాతీయ స్థాయిలో ఉన్నాయని కొనియాడారు. జిల్లా స్థాయి ,రాష్ట్రస్థాయి మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించి సత్కరించారు.ఈ కార్యక్రమంలో చిన్నారులు ఫాన్సీ డ్రస్సులతో రాగా రైమ్స్ కు ప్రైమరీ విద్యార్థులు డాన్స్ చేశారు.హై స్కూల్ బాలురు చేసినా కరాటే విన్యాసాలు అందర్నీ ఆకట్టుకున్నాయి.హై స్కూల్ విద్యార్థులు చేసిన అనేక నృత్య ప్రదర్శనలు అందర్నీ అలరించాయి. ఈ కార్యక్రమానికి సహక రించిన ఉపాధ్యాయులకు విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ కె.దిలీప్ కుమార్ ధన్యవాద ములు తెలియజేశారు.

దేశం గర్వించేలా యువత

(మొదటిపేజీ తరువాయి)

కూలంకషంగా చర్చించారు. సదస్సు ప్రాంగణంలో ప్రదర్శించిన 26/11 ముంబయి పేలుళ్ల కథనాలను వీక్షించిన ఆయన ఆ ఘటనపై స్పందించారు. "ఈ రోజు నేను 26/11 దాడికి సంబంధించిన నివేదికలను ఎగ్జిబిషన్‌లో చూశాను. ఆ సమయంలో ఉగ్రవాదం భారతీయులకు పెద్ద ముప్పు. ప్రజలు సురక్షితంగా లేరని భావించారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. ఇప్పుడు ఉగ్రవాదులు తమ సొంత ప్రదేశాల్లో కూడా సురక్షితంగా లేరు. భయంభయంగా బతుకుతున్నారు. ఇక, వారు మనల్ని భయపెట్టలేరు" అని ఆయన అన్నారు. అనంతరం మోడీ తమ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ఎప్పుడూ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, ఓటు బ్యాంకు రాజకీయాలకు దూరంగా ఉందని అన్నారు. 'ప్రజల కోసం, ప్రజలచే అభివృద్ధి' అనేది తమ ప్రభుత్వ స్పష్టమైన లక్ష్యమన్నారు. తాము ప్రజా ప్రయోజనాల దిశలో మాత్రమే పయణిస్తున్నామన్నారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ప్రధాని మోడీ అన్నారు. భారతదేశాన్ని సుసంపన్నమైన, అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యం, భారతీయులు తమ నమ్మకాన్ని అందించారని, ఆ నమ్మకాన్ని పూర్తి చిత్తశుద్ధితో నెరవేరుస్తున్నామని ఆయన అన్నారు. సోషల్ మీడియా ద్వారా వ్యాప్తి చెందుతున్న తప్పుడు సమాచారం, పుకార్లను కూడా ఆయన ప్రస్తావించారు. స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో యువతలో రిస్క్ తీసుకునే స్ఫూర్తి కొరవడిందని, అయితే గత 10 ఏళ్లలో ఇది పూర్తిగా మారిపోయిందని ప్రధాని మోడీ తెలిపారు. ప్రస్తుతం భారతదేశంలో 1.25 లక్షలకు పైగా నమోదైన స్టార్టప్‌లు ఉన్నాయని, మన యువత దేశం గర్వించేలా చేయాలని ఎదురు చూస్తున్నారని ఆయన అన్నారు. తమ ప్రభుత్వం చేపట్టిన పారిశుధ్యం, ఉపాధి కల్పన పథకాలను కూడా ప్రధాని ప్రస్తావించారు. "మన దేశంలో మరుగుదొడ్లు నిర్మించాలనే ప్రచారం ప్రారంభించబడింది. ఈ పథకం పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంలో మాత్రమే కాకుండా ఉపాధిని సృష్టించడం, ఆర్థిక వ్యవస్థను పెంపొందించడంలో సహాయపడింది. ఈ పథకం గౌరవం, భద్రతను అందిస్తుంది." అని తెలిపారు.

దారుణం

(మొదటిపేజీ తరువాయి)

గాయపడ్డారు. షార్ట్‌సర్క్యూ ట్ వల్లే మంటలు చెలరేగాయని ఇంతకుముందు చెప్పి నా ఇప్పుడు భిన్నమైన వార్తలు వస్తున్నాయి. ఆక్సిజన్ సిలిండర్ పైపును కనెక్ట్ చేసేందుకు ఓ నర్సు అగ్గిపుల్ల వెలిగించిందని, అగ్గిపుల్ల వెలిగిన వెంటనే వార్డు మొత్తం మంటలు చెలరేగాయని ప్రత్యక్ష సాక్షి చెప్పారు.ఝాన్సీలోని రాణి లక్ష్మీబాయి మెడికల్ కాలేజ్‌లో తన కొడుకును చేర్చిన వారిలో హమీర్‌పూర్ నివాసి భగవాన్ దాస్ ఒకరు. నిన్న మంటలు చెలరేగినప్పుడు.. భగవాన్ దాస్ వార్డులో ఉన్నాడు. ప్రాథమిక విచారణలో షార్ట్ సర్క్యూట్ కారణమని అధికారులు తెలిపారు. కానీ ఈ ఘటన వెనుక అసలు కారణాన్ని ప్రత్యక్ష సాక్షి భగవాన్ దాస్ చెప్పాడు. భగవాన్ దాస్ ప్రకారం.. పిల్లల వార్డులో ఆక్సిజన్ సిలిండర్ పైపును కనెక్ట్ చేయడానికి నర్సు అగ్గిపుల్లని వెలిగించింది. ఆమె అగ్గిపెట్టె వెలిగించిన వెంటనే, వార్డు మొత్తం మంటలు చెలరేగాయి. మంటలు చెలరేగిన వెంటనే, భగవాన్ దాస్ 3 నుంచి 4 మంది పిల్లలను తన మెడకు చుట్టికుని బయటకు పరిగెత్తాడు. కొంత మందిని రక్షించాడు. ఇదిలా ఉండగా.. ఈ ఘటనపై మరో ఆశ్చర్యకరమైన విషయం తెలిసింది. అగ్నిప్రమాదం జరిగిన తర్వాత అగ్నిమాపక అలారం మోగింది. కానీ.. ఆ వార్డులో ఉంచిన అగ్నిమాపక సిలిండర్ల వల్ల ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. సిలిండర్‌లో నింపిన లిక్విడ్‌ను గడువు తేదీ కూడా ముగిసినట్లు తేలింది. అంటే అగ్నిమాపక యంత్రం గడువు ముగిసి ఏళ్లు గడుస్తున్నా.. ఈ సిలిండర్లు ఖాళీగా ఉన్నాయని చూపించేందుకు ఇక్కడే ఉంచారు.

జేపీ నడ్డా, ఖర్గేలకు వేర్వేరుగా ఈసీ నోటీసులు

న్యూఢిల్లీ.నవంబరు 16: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లలో ప్రచార వాతావరణం వేడెక్కింది. అధికార, విపక్ష పార్టీల మధ్య పరస్పర ఆరోపణలు, విమర్శలు తీవ్రమయ్యాయి. ఈ క్రమంలోనే ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించారంటూ భాజపా, కాంగ్రెస్ నేతలు ఇటీవల ఒకరిపై ఒకరు ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేశారు. ఈ వ్యవహారంపై స్పందించిన ఈసీ.. ఇరు పార్టీల అధ్యక్షులు జేపీ నడ్డా, మల్లికార్జున ఖర్గేలకు వేర్వేరుగా లేఖలు రాసింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన ప్రసంగంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారంటూ ఈసీకి ఇటీవల కమలదళం ఫిర్యాదు చేసింది. మరోవైపు.. కేంద్ర మంత్రి అమిత్ షా కూడా ఇదే తప్పిదానికి పాల్పడ్డారంటూ హస్తం పార్టీ సైతం ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. ఈ నేపథ్యంలోనే తమ నేతలపై వచ్చిన ఫిర్యాదులపై ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంట కల్లా అధికారిక వివరణ ఇవ్వాలని ఇరుపార్టీల అధ్యక్షులకు ఎన్నికల సంఘం ఆదేశించింది. సంబంధిత ఫిర్యాదులనూ రెండు పక్షాలకు చేరవేసింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల సందర్భంగా స్టార్ క్యాంపెయినర్లకు చేసిన సూచనలను ప్రస్తావించింది.జాతీయ పార్టీల స్టార్ క్యాంపెయినర్లు ఇతరులకు ఆదర్శంగా మెలగాలని, సమాజంలో సున్నితమైన కూర్పును పాడుచేయొద్దని లోక్‌సభ ఎన్నికల సమయంలో ఈసీ సూచించింది. తమ మాటలు, ప్రస్తావ నల్లో సంయమనం ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత ప్రధానంగా అగ్రనేతలపైనే ఉందని పేర్కొంది. ఇదే విషయాన్ని ఎన్నికల సంఘం తాజాగా మరోసారి గుర్తుచేసింది. ఇదిలా ఉండగా.. ఝార్ఖండ్‌లో ఇప్పటికే ఒకదశ ఎన్నికలు ముగిశాయి. 20న ఝార్ఖండ్ రెండోదశతోపాటు మహారాష్ట్ర అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు.

అర్ష్ దల్లా కేసులో విచారణ జరుగుతోంది

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యలు చేయదలుచుకోలేదని అన్నారు. అతడికి సంబంధించి ఏవైనా విచారణలు చేయాల్సి ఉంటే భారత దౌత్యవేత్తలతో చర్చలు జరుపుతామని తెలిపారు. అక్టోబరు 27, 28న మిల్టన్ పట్టణంలో కాల్పులు జరిపిన ఘటనలో సింగ్ ప్రమేయం ఉన్నట్లు గుర్తించిన కెనడా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, పోలీసులు అతడిని అరెస్టు చేశారు. పంజాబ్‌లోని మోగా జిల్లాకు చెందిన దల్లాపై భారత్‌లో హత్య, వేధింపులు, అపహరణ సహా పలు కేసులు ఉన్నాయి. గతేడాది జనవరిలో భారత ప్రభుత్వం అతడిని ఉగ్రవాదిగా ప్రకటించింది. పెద్ద మొత్తంలో డ్రగ్స్, ఆయుధాల స్మగ్లింగ్‌లో ఇతడి పాత్ర ఉందని కేంద్ర హోంమంత్రిత్వశాఖ కూడా తెలిపింది. దల్లాకు సంబంధించిన పలుకేసులను జాతీయ విచారణ సంస్థ దర్యాప్తు చేస్తోంది. ఖలిస్థానీ ఉగ్రవాది, గుర్తు తెలియని వారి కాల్పుల్లో హతమైన నిజ్జర్‌కు దల్లా సన్నిహితుడు.

శంషాబాద్‌లో విమానానికి బాంబు బెదిరింపు

హైదరాబాద్, నవంబర్ 16 (ఆంధ్రపత్రిక): విమానాలకు బాంబు బెదిరింపు కాల్స్ ఆగడం లేదు. తాజాగా బాంబు బెదిరింపులతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానం అత్యవసరంగా ల్యాండింగ్ అయ్యింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బ్యాంకాక్‌కు విమానం బయలుదేరింది. అయితే విమానం బయలుదేరిన కాసేపటికే ఓ కాల్ కాలవడంతో ఎమర్జెన్సీగా విమానాన్ని ల్యాండ్ చేశారు. విమానంలో బాంబు ఉందంటూ ఓ అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి చెప్పడంతో వెంటనే విమానాన్ని తిరిగి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండింగ్ అయ్యింది. విమానంలో ప్రయాణికుల ను దింపి భద్రతా సిబ్బంది తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో ఎటువంటి బాంబు లేదని నిర్ధారించారు. ఇది ఫేక్ కాల్‌గా అధికారులు తేల్చారు.

నారా వారి ఇంట విషాదం

హైదరాబాద్, నవంబరు 16 (ఆంధ్రపత్రిక): ఏపీ సీఎం చంద్రబాబు నాయుడి ఇంట విషాదం నెలకొంది. బాబు సోదరుడు, మాజీ చంద్రగిరి ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు అనారోగ్యంతో మృతి చెందారు. గుండె సంబంధిత సమస్యలతో హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చేరిన ఆయన.. చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. 1994లో తెదేపా నుంచి రామ్మూర్తి చంద్రగిరి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రామ్మూర్తి నాయుడికి భార్య ఇందిర, కుమారులు నారా రోహిత్, గిరీశ్ ఉన్నారు. చిన్నాన్న ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్న ఏపీ మంత్రి నారా లోకేశ్ తన కార్యక్రమాలను రద్దు చేసుకొని శనివారం ఉదయమే హైదరాబాద్ చేరుకున్నారు. దిల్లీలో ఉన్న సీఎం చంద్రబాబు మహారాష్ట్ర పర్యటన రద్దు చేసుకుని హైదరాబాద్ చేరుకున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి వెళ్లారు. ఆదివారం నారావారిపల్లెలో రామ్మూర్తి నాయుడు అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఈ మేరకు భౌతిక కాయాన్ని తరలిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నాతమ్ముడు,చంద్రగిరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మమ్మల్ని విడిచి వెళ్లిపోయాడని బాధాతప్త హృదయంతో తెలియజేస్తున్నానని సిఎం చంద్రబాబు తెలిపారు. రామ్మూర్తి నాయుడు ప్రజా జీవితంలో పరిపూర్ణ మనసుతో ప్రజలకు సేవలు అందించిన నాయకుడు. మా నుంచి దూరమై మా కుటుంబంలో ఎంతో విషాదాన్ని నింపాడు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను అని చంద్రబాబు ట్వీట్ చేశారు. మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు మృతి పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. న్నాన్న రామ్మూర్తి

నాయుడు మృతి తీవ్ర విషాదం నింపిందని నారా లోకేశ్ అన్నారు. ఆయనతో నా చిన్ననాటి అనుబంధం కళ్ల ముందు కదలాడుతోంది. కన్నీటితో నివాళులు అర్పిస్తున్నా. ఇన్నాళ్లూ ఆయన మాకు కనిపించే ధైర్యం.. ఇకపై చిరకాల జ్ఞాపకం. ఆయన ఆత్మకు శాంతి కలగాలి. అంతులేని దుఃఖంలో ఉన్న నా సోదరులు, పిన్ని ధైర్యంగా ఉండాలని కోరుతున్నా అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మరణించారని తెలిసి చింతిస్తున్నానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. రామ్మూర్తి నాయుడు ఆత్మకు శాంతి చేకూరాలి. సోదర వియోగంతో బాధపడుతున్న సీఎం చంద్రబాబుకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. మహారాష్ట్రలో ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ఉండటంతో రామ్మూర్తి నాయుడు అంత్యక్రియలకు హాజరు కాలేకపోతున్నా. రామ్మూర్తి నాయుడు కుమారుడు రోహిత్, కుటుంబ సభ్యులకు నా సంతాపం తెలుపుతున్నా అని అన్నారు. రామ్మూర్తి నాయుడు మృతికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు సంతాపం తెలిపారు. ఈ సమయంలో చంద్రబాబు కుటుంబానికి భగవంతుడు ధైర్యం ఇవ్వాలని కోరుకున్నారు. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు మరణంపై తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు చెప్పారు. ఆయన మృతి తెలుగుదేశం పార్టీకి, చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు తీరని లోటని స్పీకర్ పేర్కొన్నారు. రామ్మూర్తి నాయుడు 1994 నుంచి 1999 వరకూ చంద్రగిరి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ విశేష సేవలు అందించారని అయ్యన్న గుర్తు చేశారు. 994-1996 మధ్య తన సహచర శాసనసభ్యుడిగా రామ్మూర్తి పనిచేశారని, నియోజకవర్గానికి ఆయన విశిష్టమైన సేవలు మరవలేనివని స్పీకర్ అయ్యన్న కొనియాడారు. రామ్మూర్తి నాయుడు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు చెప్పారు. భగవంతుడు వారికి మనోధైర్యం ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా దేవుడిని ప్రార్థించినట్లు స్పీకర్ చెప్పుకొచ్చారు. రామ్మూర్తి నాయుడి సేవలను తెలుగు ప్రజలు ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటారని స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆశాభావం వ్యక్తం చేశారు.ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. నారా రామ్మూర్తి నాయుడు మృతి ఎంతో బాధించింది. ఆయన కుటుంబం, చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు, తెదేపా కార్యకర్తలకు ఆయన మరణం తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి. కుటుంబ సభ్యులకు మనోధైర్యం ఇవ్వాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. నారా రామ్మూర్తి నాయుడు మృతి బాధాకరం. ఆయన మృతి నారా కుటుంబానికి తీరని లోటు. ఆయన చంద్రగిరి ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలకు ఎనలేని సేవలు అందించారు. ఆయన పార్టీకి చేసిన సేవలు వెలకట్టలేనివి. రామ్మూర్తి నాయుడు ఆత్మకు శాంతి కలగాలని మాజీ ఎంపి కనకమేడల రవీంద్రకుమార్ అన్నారు.

ఐకాన్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో నవంబర్ 16 వ తేదీన సాయంత్రం మూడు గంటల నుండి 400 ల మంది విద్యార్థులు 28 రాష్ట్రాలకు సంబంధించిన సాంప్రదాయ జానపద నృత్యంను ఛాంపియన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ మరియు ఏషియన్ వరల్డ్ రికార్డ్ వారి సమక్షంలో 40 సెకండ్లలో ఐకాన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు భారతదేశ పటం ఆకారంలో ఏర్పడి రికార్డును బద్దలు కొట్టరు. ఈ మహోన్నత కార్యక్రమానికి విశిష్ట అతిథిగా సౌత్ సెంట్రల్ రైల్వే లో విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఆనంద్ రావు పాటిల్ గారు మరియు ముఖ్య అతిథిగా జాయింట్ సెక్రెటరీ టు గవర్నర్, జె.సూర్య ప్రకాష్ గారు (రాజ్ భవన్, విజయవాడ) పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఐకాన్ విద్యాసంస్థల అధినేత కె రాజేంద్ర, డైరెక్టర్ యద్ల పార్థసారధి, తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ చిత్రకారుడు బొండా జగన్మోహనరావుకు డ్రీమ్ పెయింట్ బ్రష్ మెగా అవుట్‌స్టాండింగ్ అచీవ్‌మెంట్ అవార్డు

విజయవాడపశ్చిమ, నవంబర్ 16, (ఆంధ్రపత్రిక) : కలకత్తాకు చెందిన డ్రీమ్ పెయింట్ బ్రష్ సంస్థ దేశవ్యాప్తంగా నిర్వహించిన జాతీయస్థాయి ఆన్‌లై న్ ఆర్ట్ అండ్ ఫోటోగ్రఫీ పోటీల్లో విజయవా డకు చెందిన ప్రముఖ చిత్రకారుడు, గిరిజన గీత శిల్పి డాక్టర్ బొండా జగన్మోహనరావుకు మెగా అవుట్ స్టాండింగ్ అచీవ్ మెంట్ అవార్డు లభించింది. భవానిపురంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో నివసిస్తున్న బొండా జగన్మోహనరావు శనివారం మధ్యాహ్నం కొరియర్ ద్వారా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనివార్య కారణాల రీత్యా తాను కలకత్తాలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి వెళ్లలేకపోయినట్లు తెలిపారు. గిరిజనుల జీవన విధానంపై తాను గీచిన చిత్రాలకు గాను ఈ అవార్డులు లభించినట్లు బొండా జగన్మోహనరావు వివరించారు. డ్రీమ్ పెయింట్ బ్రష్ సంస్థ 2024 సంవత్సరంలో ప్రతి మూడు నెలలకు ఒక జాతీయస్థాయి ఆన్‌లైన్ పెయింటింగ్ పోటీలను నిర్వహించిందని, ఈ విధంగా 2024 సంవత్సరంలో మొత్తంగా నాలుగుసార్లు ఆన్‌లైన్ పోటీలు నిర్వహించగా ఈ నాలుగు పోటీల్లోనూ తాను అవార్డులు గెలుచుకున్నట్లు వివరించారు. దీంతో తనకు ఈ మెగా అవుట్ స్టాండింగ్ అచీవ్మెంట్ సర్టిఫికెట్ తో పాటు మూడు మెమొంటోలను కూడా సంస్థ అందించిందని చెప్పారు.

తనకు ఇప్పటిదాకా వందల సంఖ్యలో జాతీయ, అంతర్జాతీయ అవార్డులు వచ్చాయని వివరించారు. చిత్రకారులు సామాజికఅభ్యున్నతిని కాంక్షిస్తూ తమ చిత్రాలను గీయడం ద్వారా దేశానికి, సమాజానికి తమ సేవలను అందజేయాలని బొండా కోరారు. కాగా బొండా జగన్మోహన రావుకు డ్రీమ్ పెయింట్ బ్రష్ సంస్థ వారి ప్రతిష్టాత్మక అవార్డు లభించినట్లు తెలుసుకున్న పలువురు చిత్రకారులు, అభిమానులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

ప్రతి పేదోడికి కూడు, గూడు లక్ష్యంగానే టీడీపీ పాలన

ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

అమరావతి, నవంబర్ 16, (ఆంధ్రపత్రిక) : తెలుగుదేశం పార్టీ ప్రతి పేదవాడికి కూడు, గూడు, నీడ ఉండాలనే లక్ష్యంతో పనిచేసిందని ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. టిడ్కో ఇళ్లపై అసెంబ్లీలో లఘు చర్చ జరిగింది. ఈ విషయంపై ఆంజనేయులు కీలక విషయాలు తెలిపారు. 7 లక్షలు ఇళ్లను గతంలో ఎన్డీఏ ప్రభుత్వం శాంక్షన్ చేశారని అన్నారు. మొద టి దశలో 4 లక్షల 54 వేల ఇళ్లకు టెండర్ లు పిలిచారని గుర్తుచేశారు. 2019 ప్రారంభానికి 3 లక్షల 13 వేల 832 ఇల్లు 90 శాతం పూర్తి అయ్యాయని వివరించారు. ఒక్క రూపాయికి ఇల్లు ఇస్తామని జగన్ మోసం చేశారని విమర్శించారు. ఏడాదికి 5 లక్షలు ఇల్లు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక వాటిని పట్టించుకోలేదని అన్నారు. ఐదేళ్లలో 25 వేల ఇల్లు అన్నారని.. అయితే పట్టించుకోలేదని చెప్పారు. జగన్ మోహన్ రెడ్డికు ప్యాలెస్‌లు కావాలని అన్నారు. బెంగళూరు, హైదారాబాద్, రుషికొండలో వాటిని కట్టారని చెప్పారు. రూ.430 కోట్లు ఖర్చు చేసి రుషికొండ ప్యాలెస్ కట్టారన్నారు. పేదవాడికి ఒక సెంట్ ఇల్లు అని, జగనన్న కాలనీ అన్నారని...అందులోనూ అక్రమాలు జరిగాయని తెలిపారు. ఎన్డీఏ మళ్లీ వచ్చి ఉంటే ఈ లక్షలాది ఇల్లు పూర్తి అయ్యేవని అన్నారు. ఇల్లు రాకపోగా పేదలకు బ్యాంక్‌ల నుంచి వాయిదాలు కట్టమని నోటీసులు వచ్చాయని అన్నారు. టిడ్కో ఇళ్ల కోసం రూ. 17 కోట్లు వడ్డీ చెల్లించారని... పేదవాడి డిపాజిట్లు చెల్లించలేదని అన్నారు. ఈ ఇళ్లను కూడా పేదవాళ్లకు కాకుండా వాళ్ల ఇష్టం వచ్చిన వాళ్లకు ఇచ్చారని చెప్పారు. 90 శాతం ఇల్లు పూర్తి అయినవి కూడా ఐదేళ్లలో పూర్తి చేయలేదని మండిపడ్డారు. వినుకొండలో 1200 ఇల్లు ప్రారంభిస్తే వాటిలో ఒకటి కూడా ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్రవ్యాప్తంగా కోకొల్లలుగా ఉన్నాయన్నారు. దీనివల్ల ప్రభుత్వానికి ప్రజలకు చాలా నష్టం వాటిల్లిందని జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు.

తిరుమలలో పెరుగుతున్న భక్తుల రద్దీ

శ్రీ శ్రీనివాసుడి దర్శనం కోసం బారులు తీరుతున్న జనం

అమరావతి, నవంబర్ 16, (ఆంధ్రపత్రిక) : అసలే కార్తీకమాసం. ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఎక్కడ చూసినా ఓంకార నాదం వినిపిస్తోంది. అందులో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాలలో ఆలయాలు భక్తులతో కళకళలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో కలియుగ వైకుంఠం శ్రీ శ్రీనివాసుడు వెలసిన తిరుమలకు కూడా భారీగా భక్తులు చేరుకుంటున్నారు. తిరుమల మాడవీధులు గోవిందా నామస్మరణతో మారుమ్రోగుతున్నాయి. ఎటుచూసినా భక్తజనసందోహం తిరువీధులలో కనిపిస్తోంది. అలిపిరి నుండి గల కాలినడక దారి భక్తులతో నిండుగా కనిపిస్తోంది. శ్రీ శ్రీనివాసా శరణు.. శరణు అంటూ భక్తులు కలియుగ వైకుంఠం శ్రీ శ్రీనివాసుడి దర్శనం కోసం బారులు తీరుతున్నారు. దీనితో భక్తుల సేవలో తరించే టీటీడీ, ఎటువంటి అసౌకర్యం కలుగకుండా.. అన్ని చర్యలు చేపట్టింది. ప్రస్తుతం శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటల సమయం పడుతుందని టీటీడీ ప్రకటించింది. అలాగే సోమవారం స్వామి వారిని 61,613 మంది భక్తులు దర్శించుకోగా.. 20,291 మంది భక్తులు తలనీలాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అంతేకాదు స్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ. 3.12 కోట్ల మేర ఆదాయం వచ్చినట్లు టీటీడీ అధికారులు తెలిపారు. తిరుపతి శ్రీకపిలేశ్వరస్వామివారి ఆలయంలో నవంబరు 15వ తేదీన కార్తీక పౌర్ణమి పర్వదినాన అన్నాభిషేకం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 2 గంటలకు సుప్రభాతంతో మేల్కొలిపి, 2.30 నుంచి 4.30 గంటల వరకు అభిషేకం, అలంకారం, అర్చన నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఏకాంతంగా అన్నాభిషేకం, దీపారాధన చేపడతారు. ఈ సందర్భంగా భక్తులకు స్వామివారి దర్శనం ఉండదు. తర్వాత సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు భక్తులకు అన్నలింగ దర్శనం కల్పిస్తారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఏకాంతంగా అన్నలింగ ఉద్వాసన చేపడతారు. శుద్ధి అనంతరం రాత్రి 7.30 గంటల నుండి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

తెలుగు భాషను కాపాడుకుందాం..

మన సాంస్కృతిక వైభవాన్ని నిలబెడతాం ; మంత్రి కందుల దుర్గేష్ వినతి

అమరావతి, నవంబర్ 16, (ఆంధ్రపత్రిక) : 9వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సుకు విచ్చేసిన తెలుగువారికి సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల తరపున మంత్రి కందుల దుర్గేష్ అభినందనలు తెలిపారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, ఆంధ్ర కళా వేదిక ఖతార్ సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న సదస్సుపై ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు భాషను కాపాడుకుంటాం.. తెలుగు సాంస్కృతిక వైభవాన్ని నిలబెడుతాం అంటూ సదస్సులో చేస్తున్న ప్రతిజ్ఞ ప్రతి ఒక్కరికీ దిశానిర్దేశం చేస్తుందన్నారు. విదేశాల్లో ఉంటూ తెలుగు భాష మీద మక్కువతో చేస్తున్న కార్యక్రమాలు అందరికీ మార్గదర్శకం అన్నారు. అయితే, 9వ పర్యాయం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం గర్వించదగ్గ అంశం అని రాష్ట్ర పర్యటన, సినిమాటోగ్రాఫి మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. దేశ, విదేశాల నుంచి విచ్చేసిన తెలుగువారు అందరు ఒకే వేదికపై నిలబడి తెలుగు భాషను కాపాడుకుంటాం.. తెలుగు సాంస్కృతిక వైభవాన్ని నిలబెడుతాం అని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నానని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు తెలుగు భాష పట్ల ఆసక్తి కనబర్చాలని సూచించారు.

ట్రోల్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

అమరావతి,నవంబరు 16 (ఆంధ్రపత్రిక): రాజమహేంద్రవరం మాజీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీని సోషల్ మీడియాలో ట్రోల్ చేసి వేధించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రస్తుత ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కోరారు. ఈ మేరకు అసెంబ్లీలో శూన్యగంట సమయంలో స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీలో భవానీ అప్పట్లో మాట్లాడిన వ్యాఖ్యల్నే ట్రోల్ చేశారని, గత స్పీకరుకు విజ్ఞప్తి చేసినా.. స్పందించలేదన్నారు. ఇదే సమయంలో గత ఐదేళ్లలో దిశ చట్టం పేరిట జరిగిన దుర్వినియోగంపైనా విచారణ జరిపించాలని వాసు కోరారు. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టేవారికి శిక్ష పడేలా చట్టాలను సవరించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. శాసనసభలో జీరో అవర్‌లో మాట్లాడిన ఆమె.. అధికారంలో ఉండి కూడా సోషల్ మీడియా పోస్టుల వల్ల చాలా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం తెదేపా వాళ్లనే కాకుండా.. అన్ని పార్టీల నేతలనూ సోషల్ మీడియా సైకోలు ఇబ్బంది పెడుతున్నారని సభాపతి దృష్టికి తీసుకెళ్లారు.

స్ఫూర్తి ప్రదాత రామోజీరావు ఏపీ సీఎం చంద్రబాబు



అమరావతి, నవంబరు 16 (ఆంధ్రపత్రిక): రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకుడు రామోజీ రావు జయంతి సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు నివాళి అర్పించారు. విలువలతో కూడిన పాత్రికేయంతో, నిష్పక్షపాత వైఖరితో సమాజంపై తిరుగులేని ముద్ర వేసిన మహనీయుడని కొనియాడారు. వ్యాపారాల్లోనూ సమాజహితం, ప్రజా శ్రేయస్సు చూసిన ఏకైక వ్యాపారవేత్త అని అన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. తన సంస్థల ద్వారా సమాజాన్ని అత్యంత ప్రభావితం చేసిన రామోజీరావును స్మరించుకోవడం ప్రజలందరి బాధ్యత అని, నిత్య స్ఫూర్తిగా నిలిచే ఆయన జీవితాన్ని మార్గదర్శిగా భావించి ముందడుగు వేద్దామని పిలుపునిచ్చారు.

రామోజీరావు స్ఫూర్తి ప్రదాత: లోకేశ్

రామోజీ సంస్థల వ్యవస్థాపకుడు రామోజీ రావు జయంతి సందర్భంగా మంత్రి లోకేశ్ నివాళులర్పించారు. తెలుగు భాషకు, తెలుగు జాతికి ఎనలేని సేవలందించిన రామోజీరావు.. స్ఫూర్తి ప్రదాత అని అన్నారు. వ్యాపారంలోనూ సమాజ హితం కాంక్షించే ఆయన సేవలను స్మరించుకుందామని పిలుపునిచ్చారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు.

2.3 లక్షల టిడ్కో ఇళ్లను రద్దు చేసిన వైఎస్ జగన్

భాజపా ఎమ్మెల్యే విష్ణుకుమార్

అమరావతి,నవంబరు 16 (ఆంధ్రపత్రిక): కేంద్ర ప్రభుత్వం గతంలో 7 లక్షల ఇళ్లు కేటాయించిందని భాజపా ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తెలిపారు. 5 లక్షల ఇళ్లకు పాలనా ఆమోదం కూడా ఇచ్చారని చెప్పారు. జగన్ దుర్మార్గంగా 2.3 లక్షల టిడ్కో ఇళ్లను వద్దని రద్దు చేశారని తెలిపారు. టిడ్కో ఇళ్లపై ఆంధ్రప్రదేశ్ శాసనసభలో స్వల్పకాలిక చర్చ సందర్భగా విష్ణుకుమార్ రాజు మాట్లాడారు. వైకాపా ప్రభుత్వం రాగానే కాంట్రాక్టర్లకు బిల్లులు నిలిపివేశారని చెప్పారు. కాంట్రాక్టర్గా తనకు రావాల్సిన బకాయే రూ.87 కోట్లుగా ఉందని పేర్కొన్నారు. తన లాంటి వ్యక్తి పదిసార్లు ఆత్యహత్య చేసుకోవాలని.. గుండె ధైర్యం ఎక్కువ కాబట్టే ఆ పని చేయలేదని చెప్పారు. కాంట్రాక్టర్లను జగన్ చాలా రకాలుగా ఇబ్బంది పెట్టారని విమర్శించారు. బిల్లులు చెల్లించకపోయినా గుత్తేదారులు పని చేశారని వివరించారు.

వేలేరుపాడులో విచారణ

ఏలూరు, నవంబరు16 (ఆంధ్రపత్రిక): ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కుటుంబంపై అసభ్య దూషణలు చేసిన వైకాపా నాయకుడు, రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌ను పోలీసులు విచారిస్తున్నారు. పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా వేలేరుపాడు పోలీస్ స్టేషన్‌లో ప్రశ్నిస్తున్నారు. సాయంత్రం వరకు విచారణ కొనసాగ నుంది. రెండు నెలల క్రితం ఉద్దగిరి రాణి అనే మహిళ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే అరెస్టయిన అనిల్ను విచారణ కోసం వేలేరుపాడు పోలీసులు కస్టడీకి కోరగా.. శుక్రవారం రాత్రి రాజమహేంద్రవరం జైలు నుంచి వేలేరుపాడుకు అతడిని తరలించారు.

Printed and Published by KANCHARLA RAMAIAH on behalf of Nageswara Rao Estates Private Limited,Printed at Jagati Publications Limited, Sakshi Press, SY.No.481, Phase-2, Jawahar Autonagar, Vijayawada-520007 Andhra Pradesh, and Published from D.NO.29-28-34, Dasari vari street, Suryaraopeta,Vijayawada-520002, KRISHNA DISTRICT-ANDHRA PRADESH, Editor : KANCHARLA RAMAIAH. Excutive editor V.VIJAYALAKSHMI. RNI no. 10721/65 Mobile:9849998069, Email:andhrapatrikadaily@gmail.com